Lalithaa
హైదరాబాద్ • విశాఖపట్నం • తిరుపతి
చెన్నై • మదురై • తిరుచ్చి • పుదుచ్చేరి
కుంభకోణం • బెంగళూరు • రామనాథపురం
కోయంబత్తూరు • సేలం • నాగర్‌కోవిల్

మనం

జనం కోసం.. అక్షర యజ్ఞం..

ఉత్తమంలో మరింత ఉత్తమం!
ఈ అవకాశం ఇక 3 రోజులే! (మార్చి 19 వరకు)

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | AMARAVATHI | TIRUPATI | KURNOOL | TADEPALLIGUDEM | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

హైదరాబాద్ | సంపుటి: 2 • సంచిక: 108 • పేజీలు:12+16 • వెల: రూ.6 | ఆదివారం • 18-3-2018 | www.manamnews.com | /manamnews





వజ్రపు వ్యాసం (సెంట్లలో)	సాధారణంగా మార్కెట్‌లో వజ్రాల ధర (ఒక క్యారెట్‌కు)	వజ్రాల న్యాయమైన ధర (ఒక క్యారెట్‌కు)
0 నుంచి 0.0749	రూ.67000 నుంచి 76000	రూ.46000
0.0750 నుంచి 0.1349	రూ.76000 నుంచి 85000	రూ.66500
0.1350 నుంచి 0.1749	రూ.98500 నుంచి 105000	రూ.83000
0.1750 నుంచి 0.2249	రూ.108500 నుంచి 112000	రూ.94000

హైదరాబాద్
ఆదివారం
18-3-2018
సంపుటి: 2, సంచిక: 108
పేజీలు: 12+16, వెల: రూ.6
/manamnews
www.manamnews.com

మనం

జనం కోసం.. అక్షర యజ్ఞం..
HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | AMARAVATHI | TIRUPATI | KURNOOL | TADEPALLIGUDEM | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

HAPPY UGADI

ఉగాది శుభాకాంక్షలు 2018



పంటకు మద్దతు ధర

- ఉత్పత్తి వ్యయానికి 1.5 రెట్లు
- రాష్ట్రాలతో కేంద్రం చర్చలు
- పంటలను తగులబెట్టొద్దు
- రైతన్నలను ఆదుకుంటాం
- కృషి ఉన్నతి మేళాలో మోదీ

7లో..

హే.. గాంధీ!

లేబర్ కోర్టు జడ్జిపై ఏసీబీ దాడులు

ఆదాయాన్ని మించి ఆస్తులున్న వైనం



- రూ.3.57 కోట్ల మేర ఆస్తుల గుర్తింపు
- ఏక కాలంలో ఏడు ప్రదేశాలలో సోదాలు
- హైదరాబాద్‌లో మూడంతస్తుల బంగ్లా
- రెండు ఫ్లాట్లు.. రెండున్నర కిలోల బంగారం
- గోదావరి జిల్లాల్లో 18 ఎకరాల సాగు భూమి
- ఉభయ గోదావరి జిల్లాల్లోనూ సోదాలు
- ముందే హైకోర్టు అనుమతి తీసుకున్న ఏసీబీ

హైదరాబాద్/కాకినాడ/కొవ్వూరు, మార్చి 17 (మనం ప్రతినిధి):

ఆయనో జడ్జి. అందులోనూ జాతిపిత గాంధీ పేరు పెట్టుకున్నారు. కానీ తన పదవీకాలంలో ఆదాయాన్ని మించి భారీ మొత్తంలో ఆస్తులు కూడబెట్టారు. కొంతమంది బినామీలను కూడా పెట్టుకుని వారి పేర్ల మీదకు కొన్ని ఆస్తులను బదలాయించారు. కానీ ఆ అక్రమాల పుట్ట ఎక్కువకాలం దాగలేదు. అవినీతి నిరోధక శాఖ అధికారుల దృష్టికి ఈయన అవినీతి వ్యవహారం మొత్తం వెళ్లింది. హైదరాబాద్‌లోని నాంపల్లి మిగతా 6లో..





ఏసీబీ గుర్తించిన ఆస్తులు ఇవీ..

- పశ్చిమ గోదావరి జిల్లాలో 18.22 ఎకరాల భూమి
- 2 ఫ్లాట్లు, 3 భవనాలు, 3 ఖరీదైన కార్లు, ఓ బైక్
- రెండున్నర కిలోల బంగారం, 4 కిలోల వెండి
- బంజారాహిల్స్, డీడీ కాలనీల్లో ఫ్లాట్లు, వారసిగూడలో 3 అంతస్తుల భవనం, మరో ఇల్లు
- పశ్చిమగోదావరిలో రూ.48 లక్షల విలువ చేసే పొలం
- కరగపాడులో రూ.23 లక్షల విలువగల భూమి
- ఖరీదైన గృహోపకరణాల విలువ రూ.6లక్షలు
- రూ.33 లక్షల చిట్ ఫండ్ డాక్యుమెంట్
- ఇంట్లో రూ.89 వేల నగదు

పాఠకులు, ప్రకటనకర్తలు, ఏజెంట్లు, మా శ్రేయోభిలాషులందరికీ శ్రీ విళంబి నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు. ఉగాది పండుగ సందర్భంగా ఆదివారం 'మనం' కార్యాలయాలకు సెలవు. అందువల్ల సోమవారం సంచిక వెలువడదు. పునర్దర్శనం మంగళవారం.

- ఎడిటర్



19న కోల్‌కతాకు సీఎం కేసీఆర్

థర్డ్ ఫ్రంట్‌పై మమతతో భేటీ

- కేంద్రంలో మారుతున్న రాజకీయాలు
- ఇద్దరు సీఎంల భేటీకి అత్యంత ప్రాధాన్యం
- జాతీయ రాజకీయాల్లోనూ తీవ్ర చర్చ!

హైదరాబాద్, మార్చి 17(మనం ప్రతినిధి):

జాతీయ రాజకీయాల్లో బీజేపీ, కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా మూడో ఫ్రంట్ ఏర్పాటు చేస్తామని ప్రకటించిన ముఖ్యమంత్రి కేసీఆర్ ఆ దిశగా మొదటి అడుగు వేస్తున్నారు. ఈ నెల 19న ఆయన కోల్‌కతా వెళ్లనున్నారు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీతో ఫ్రంట్‌పై చర్చించనున్నారు. ఈ విషయంలో మమతా బెనర్జీ సూచనలను మిగతా 6లో..

ఇదీలోకం!





చిత్రం: రాజేష్ బిట్టు

నిదురమ్మా.. రావే!

యువతలో పెరుగుతున్న నిద్రలేమి

50% రోగులకు అదే పెద్ద సమస్య

- నగరాల్లో ఉండేవారికి మరీ ఎక్కువ
- భవిష్యత్తులో ఆరోగ్యానికీ ముప్పే
- పనిసామర్థ్యం కూడా తగ్గే ప్రమాదం
- గుండె సమస్యలనూ పెంచుతుంది
- స్మార్ట్ ఫోన్ల వాడకమే సగం కారణం
- అసహజంగా ఉండే పని వేళలు సైతం
- 40-50 ఏళ్ల మధ్య వారికి ఇబ్బంది
- ధ్యానంతో నిద్రలేమికి చెక్ పెట్టచ్చు

(మనం సెంట్రల్ డెస్క్)

నిద్ర.. ఎక్కడ దొరుకుతుంది? షాపులో కొనుక్కోవచ్చా..? పాటలు పెట్టుకుంటే నిద్ర వస్తుందా? పుస్తకం చదువుతూ నిద్రలోకి జారిపోవచ్చా? ఇలాంటి సవాలక్ష ప్రశ్నలు మిగతా 6లో..

మనం సండే స్పెషల్

తొలిగేటు వచ్చింది!

అన్నారం బ్యారేజికి బిగింపు

- యుద్ధ ప్రాతిపదికన కాళేశ్వరం పనులు
- 80% పూర్తయిన కాంక్రీటు పనులు
- పదిరోజుల్లో పంప్ హౌజ్‌ల యంత్రాలు
- ఊపందుకున్న విద్యుత్ లైన్ల పనులు
- వానాకాలం నాటికి ఎల్లంపల్లికి నీరు
- నీటిపారుదల మంత్రి హరీశ్‌రావు వెల్లడి

కరీంనగర్, మార్చి 17:

వచ్చే వర్షాకాలం నాటికల్లా కాళేశ్వరం నుంచి ఎల్లంపల్లికి నీటిని తరలిస్తామని మంత్రి హరీశ్ రావు ప్రకటించారు. ప్రతిష్ఠాత్మకంగా మిగతా 6లో..



అన్నారం బ్యారేజీ గేట్ల బిగింపును పరిశీలిస్తున్న మంత్రి హరీశ్ రావు, అధికారులు



దేశాన్ని బీజేపీ చీలుస్తోంది

- విద్వేషాన్ని, అసహనాన్ని వ్యాప్తి చేస్తోంది
- బీజేపీ పాలనతో దేశం అలసిపోయింది
- దేశానికి కొత్త దిశానిర్దేశం కావాలి
- బీజేపీని ఓడించేది ఒక్క కాంగ్రెస్సే
- అది.. ఇంకెవరి వల్లా సాధ్యం కాదు
- కాంగ్రెస్‌లో అనైక్యత పార్టీకి నష్టం
- కాంగ్రెస్ ప్లీనరీలో రాహుల్ ప్రసంగం

7లో..

జీవితం.. ఉగాది పచ్చడి!

జీవితంలోనూ షడ్రుచులుంటాయి

- ఆటుపోట్లను అలాగే ఆస్వాదించాలి.. ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు
- కొత్త ఏడాదిలో మంచి జరగాలి.. గవర్నర్ నరసింహన్ ఆకాంక్ష
- కొత్త సంప్రదాయానికి గవర్నర్ ఒరవడి.. 'ఉగాది' గౌరవాన్ని ఇనుమడింపజేశారు
- రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్.. రాజ్‌భవన్‌లో ఘనంగా ఉగాది వేడుకలు

6లో..



ముహూర్తం

శ్రీవిళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, శుక్లపక్షం, తిథి: పాడ్యమి సా.6.32 తదుపరి విదియ; నక్షత్రం: ఉత్తరాభాద్ర రా.8.07 తదుపరి రేవతి; వర్జ్యం: ఉ.7.55-9.32; దుర్ముహూర్తం: సా.4.47-5.35; రాహుకాలం: సా.4.53-6.23; అమృతఘడియలు: మ.3.16-4.54; శుభసమయం: ఉ.7.00-7.54.

సూర్యోదయం: 6.26

సూర్యాస్తమయం: 6.23

వాతావరణం



తెలుగు రాష్ట్రాల్లో ఆదివారం వాతావరణం మేఘావృతమై ఉంటుంది. పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. రాత్రిపూట గంటకు 12 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయి.

గరిష్ఠ ఉష్ణోగ్రత: 34 డిగ్రీలు

కనిష్ఠ ఉష్ణోగ్రత: 20 డిగ్రీలు

గాలిలో తేమ: 76 శాతం



సమయమంత్రి
చంద్రశేఖర శర్మ

మననం

> అరేబియా సముద్రంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా తెలుగు రాష్ట్రాలలోని ప్రధాన నగరాలన్నీ చల్లబడినా రాజకీయ వాతావరణం మాత్రం సముద్రంలో అల్పపీడనంలా అల్లకల్లోలంగా మారిపోయింది. తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు తాను కాంగ్రెస్, బీజేపీయేతర పార్టీలతో ఫ్రంట్ ఏర్పాటు చేస్తానని, అవసరమైతే ఇక్కడి నుంచే జాతీయ రాజకీయాలు చేస్తానని ప్రకటించడమే కాకుండా కేంద్ర ప్రభుత్వ వ్యవస్థ మీదే తిరగబడ్డారు.



రాజకీయ చిత్రం.. విచిత్రం!

నిన్న మొన్నటి వరకు తిరుగులేని నాయకుడిగా దేశంలో ఏకఛత్రాధిపత్యంగా పాలిస్తున్న నరేంద్రమోదీ వెన్నులో వణుకు పుట్టించే స్థాయిలో తెలుగు రాజకీయాలు ఒక్కసారిగా మారిపోయాయి. దాదాపు వారం పది రోజుల నుంచి జరుగుతున్న మార్పులు హస్తినాపురిలో ప్రకంపనలు పుట్టిస్తున్నాయి. రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఇంతకుముందు కేంద్ర ప్రభుత్వంతో చాలా సఖ్యతగా ఉండేవారు. రాష్ట్రపతి ఎన్నికలు, పెద్దనోట్ల రద్దు లాంటి కీలక పరిణామాలన్నింటిలో పూర్తిస్థాయి మద్దతు తెలిపారు. కొన్ని కొన్ని విషయాలలో నరేంద్రమోదీ సొంత పార్టీ నుంచి కూడా వ్యతిరేకత ఎదుర్కొన్న సందర్భాలలోనూ వీళ్లిద్దరూ అండగా నిలిచారు. కానీ అలాంటిది దాదాపు ఒకే సమయంలో ఇద్దరూ తిరగబడ్డారు. ఒకరు ఏకంగా కేంద్రంలోని తన మంత్రులతో రాజీనామా చేయించి ఎన్డీయే నుంచి బయటికొచ్చి అవిశ్వాస తీర్మానం పెట్టే వరకు వెళ్లడమే కాకుండా ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటుకు తెరవెనుక పావులు కదుపుతుంటే, మరొకరు థర్డ్ ఫ్రంట్.. కాదుకాదు ఫస్ట్ ఫ్రంట్ పెట్టి అంతు తేలుస్తానంటూ రంకెలేస్తున్నారు. అరేబియా సముద్రంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా తెలుగు రాష్ట్రాలలోని ప్రధాన నగరాలన్నీ చల్లబడినా రాజకీయ వాతావరణం మాత్రం సముద్రంలో అల్పపీడనంలా అల్లకల్లోలంగా మారిపోయింది.

తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు తాను కాంగ్రెస్, బీజేపీయేతర పార్టీలతో ఫ్రంట్ ఏర్పాటు చేస్తానని, అవసరమైతే ఇక్కడి నుంచే జాతీయ రాజకీయాలు చేస్తానని ప్రకటించడమే కాకుండా కేంద్ర ప్రభుత్వ వ్యవస్థ మీదే తిరగబడ్డారు. తెలుగు రాష్ట్రాల్లో విభజన హామీలను నిర్లక్ష్యం చేసిందని, అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేవలం అతి కొద్దిమంది కలిసి ఇన్ని కోట్ల మంది విషయంలో నిర్ణయాలు తీసుకోవడం ఏంటని, రిజర్వేషన్ల లాంటి వ్యవహారాలు రాష్ట్రాల చేతుల్లోనే ఉండాలని, సమాఖ్య వ్యవస్థకు కొత్త అర్థం చెబుతానని ఆయన అంటున్నారు. నిజంగానే అమెరికా లాంటి దేశాలలో చూసుకుంటే దాని పేరే 'అమెరికా సంయుక్త రాష్ట్రాలు'. అంటే కేవలం కొన్ని రాష్ట్రాల సమూహమే తప్ప విడిగా దేశం కాద న్న మాట. మొత్తమ్మీద అమెరికా అనే అంటున్నా, ఎక్కడి కక్కడ న్యాయవ్యవస్థ, చట్టం వేర్వేరుగా ఉంటాయి. పూర్తి స్థాయి సమాఖ్య వ్యవస్థ అక్కడ కనపడుతుంది. ఆ తరహా పరిపాలన ఇక్కడ కూడా రావాలన్నది కేసీఆర్ ఆకాంక్షలా కనిపిస్తోంది. కొంతవరకు పర్వాలేదు గానీ, అలా ఉంటే అసలే ఇప్పటికే జలాల పంపిణీ విషయంలో కత్తులు దూసు కుంటున్న రాష్ట్రాల మధ్య ఇంకెన్ని గొడవలు జరుగుతాయో అనుమానమే. ఆ మాట అలా ఉండగానే ఉన్నట్టుండి తెలంగాణ అసెంబ్లీ రణరంగంగా మారింది. చినికి చినికి గాలివానగా మారినట్లు అది కాస్తా ఏకంగా ఇద్దరు ఎమ్మెల్యేల శాసన సభ్యత్వాలను రద్దు చేసేవరకు వెళ్లిపోయింది. ఇప్పటివరకు గవర్నర్ ప్రసంగాన్ని అడ్డుకోడానికి మహా అయితే ఆయన చేతుల్లోని కాగితాలు లాక్కునే వరకు చూశామే గానీ ఏకంగా గవర్నర్ మీదే మైకులు, హెడ్‌సెట్లు విసిరేయడాన్ని చూడలేదు. అది మండలి చైర్మన్‌కు తగిలి కంటికి గాయం కావడం మరింత దురదృష్టకరం. అదే నిజంగా గవర్నర్‌కు తగిలి ఉంటే.. పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారేది. చర్యలు కూడా మరింత కఠినంగా ఉండేవేమోనన్న అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఈ గొడవను సమర్థించుకోడానికి కాంగ్రెస్ ఎంతలా ప్రయత్నించినా, 48 గంటల నిరాహార దీక్ష చేసినా ఫలితం మాత్రం లభించలేదు. వాళ్లకు రావాల్సిన మైలేజి రాలేదు సరికదా, చిన్నపిల్లల్లాగ అలా బెంచీలు ఎక్కడం, మైకులు విసిరేయడం ఏంటన్న వ్యాఖ్యలు కూడా విన వచ్చాయి. ఈ మొత్తం ఎపి సోడ్‌లో చెప్పుకోవాల్సిన మరో విచిత్రం ఏమిటంటే.. రెండు తెలుగు రాష్ట్రాలలోనూ ప్రధాన ప్రతిపక్షం సభలో లేకుండానే బడ్జెట్ ప్రసంగాలు సాగిపోవడం!

ఏపీలో విచిత్ర రాజకీయ చదరంగం

తెలంగాణ పరిస్థితి ఇలా ఉంటే.. దానికి దాయాది రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయాలు సరిగ్గా చెప్పాలంటే బంగాళాఖాతంలో అల్పపీడనం వచ్చినప్పటి పరిస్థితిలాగే ఉన్నాయి. అక్కడ ఎటు చూసినా తీవ్ర గందరగోళం, అల్లకల్లోలమే కనిపిస్తోంది. తెలుగుదేశం పార్టీకి ఇంతకుముందు అసెంబ్లీలో చూసుకుంటే ఒకరే ప్రత్యర్థి. కేవలం అక్కడ రెండు పార్టీల రాజకీయం మాత్రమే ఉందనిపించేది. ఒక అధికార పక్షం, ఒకే ఒక్క ప్రతిపక్ష పార్టీ. రెండూ బలంగా ఉండటంతో కొదమసింహాల్లా ఢీకొనేవి. రెండింటి మధ్య ఓట్ల తేడా కూడా రెండు శాతం మాత్రమే కావడంతో ఎవరికి వారు బలోపేతం కావడానికి అన్ని రకాలుగా ప్రయత్నించేవారు. అలాంటిది ఇప్పుడు ఒక్కసారిగా ఉన్నట్టుండి పరిస్థితులు మారిపోయాయి. ఇప్పుడక్కడ బహుముఖ రాజకీయం నడుస్తోంది. ఒక టీడీపీ, ఒక బీజేపీ, ఒక వైఎస్ఆర్ సీపీ, ఒక జనసేన.. ఇంకా వీటన్నింటికీ తోడు ఎప్పటి నుంచో ఉన్న కాంగ్రెస్, వామపక్షాలు. వీటిలో బీజేపీ, కాంగ్రెస్, వామపక్షాలకు మొత్తంమీద సొంతంగా ఉన్న ఓటు బ్యాంకు శాతం తక్కువే అయినా.. అవి కూడా ఎంతో కొంత ప్రభావం చూపించగల స్థాయిలోనే ఉన్నాయి. సొంతంగా గెలిచేంత పరిస్థితి మాట ఎలా ఉన్నా, అవతలి వాళ్ల జయాపజయాలను నిర్ణయించడంలో తమ వంతు పాత్ర పోషించగలవు. ఇక ప్రధాన పార్టీలుగా ఉన్న టీడీపీ, వైఎస్ఆర్‌సీపీ, జనసేన.. ఈ మూడింటి మధ్య బీజేపీతో కలుపుకొని అక్కడ చిత్రమైన రాజకీయ చదరంగం నడుస్తోంది. నిన్న మొన్నటి వరకు బీజేపీతో మైత్రి నెరపిన తెలుగుదేశం పార్టీ ఇప్పుడు ఉన్నట్టుండి బంధాన్ని తెంచుకోవడమే కాక.. ఏకంగా కత్తులు దూస్తోంది కూడా.

క్షణక్షణం మారుతున్న బాబు ఎత్తుగడలు

మోదీ మీద జగన్ అవిశ్వాసం పెడితే ఆయన ప్రభుత్వం ఏమైనా పడిపోతుందా అని ప్రశ్నించిన చంద్రబాబు.. స్వయంగా తన పార్టీ వాళ్లతో అవిశ్వాస తీర్మానానికి నోటీసు ఇప్పించడం ఆయనలో వచ్చిన పెద్ద మార్పును సూచిస్తుంది. ఇదంతా ఒక ఎత్తయితే, ముందురోజు అసెంబ్లీలో స్వయంగా తానే ప్రకటన చేస్తూ వైఎస్ఆర్‌సీపీ వాళ్లు ప్రవేశపెట్టే అవిశ్వాస తీర్మానానికి తమ పార్టీకి చెందిన 16 మంది ఎంపీలు మద్దతిస్తారని చెప్పి, మర్నాడు ఉన్నట్టుండి తమ ఎంపీ తోట నరసింహంతో స్వయంగా అవిశ్వాస తీర్మానానికి నోటీసు ఇప్పించడం మరో ఎత్తు. అనుక్షణం మారే చంద్రబాబు రాజకీయ ఎత్తుగడలను ఈ మార్పు సూచిస్తుంది. తీర్మానం ఎవరు పెడితేనేం.. ఏదైనా రాష్ట్ర ప్రయోజనాలకు సంబంధించిన గొంతు అక్కడ వినిపించడమే కదా అని ఈ విషయంలో వైఎస్ఆర్‌సీపీ కొంత రాజీపడినట్లు కనిపిస్తోంది. ఆ మాటకొస్తే జగన్ ముందునుంచి ఒకమాట చెబుతున్నారు. 'మేము అవిశ్వాసం పెడతాం, చంద్రబాబును మద్దతివ్వమని చెప్పండి.. లేదా ఆయన్నే పెట్టమనండి.. మేం మద్దతిస్తాం' అంటున్నారు. దానికి తగ్గట్లే జరిగింది. కానీ ఈ ఎపిసోడ్ మొత్తానికి తాను సూత్రధారిగా వ్యవహరిస్తానని చెప్పిన పవన్ కల్యాణ్ మాత్రం ఎంపీలను కూడగట్టే ప్రయత్నంలో ఎక్కడా కనిపించలేదు. గుంటూరు జిల్లాలో ప్రబలిన అతిసార వ్యాధి బాధితులను పరామర్శించడం, ఎన్నారైలతో సమావేశాలు పెట్టి వాళ్లను మోటివేట్ చేయడం లాంటి కార్యక్రమాలలో ఆయన బిజీబిజీగా ఉన్నారు. ఆయన చెప్పినా చెప్పకపోయినా.. నేరుగా చంద్రబాబే రంగంలోకి దిగారన్న మాటతో జాతీయ స్థాయిలో మోదీని వ్యతిరేకించే పార్టీలన్నీ కూడా అవిశ్వాసానికి మద్దతి స్తామంటూ ముందుకొచ్చాయి. స్వయంగా కాంగ్రెస్ పార్టీ సైతం ఇందులో చేతులు కలపడం అతి పెద్ద విశేషం. ఈ ఐక్యత రేపు ఎన్నికల వరకు ఉంటుందా అంటే అనుమానమే గానీ, ప్రస్తుతానికైనా వీళ్లంతా మనకోసం ఒక్కటిగా నిలవడం మాత్రం కాస్త సంతోషించాల్సిన విషయమే అని చెప్పుకోవాలి. అలాగని రేపు చంద్రబాబు లేదా చంద్రశేఖర్ రావు ఏర్పాటు చేయబోయే ఫ్రంట్‌లోకి వీళ్లు వస్తారా?.. వస్తే ప్రధాని అభ్యర్థి ఎవరవుతారు అన్నంతవరకు చర్చలు వెళ్లేలా లేవు. కేసీఆర్‌కు అభయం ఇచ్చారని చెప్పిన మమతా బెనర్జీ, హేమంత్ సోరెన్ లాంటి వాళ్లు ఆ తర్వాత కాంగ్రెస్ పంచన చేరేలా కనిపించడమే అందుకు కారణం. మాజీ కాంగ్రెస్ నాయకులే అయిన శరద్ పవార్, మమతా బెనర్జీ లాంటి వాళ్లంతా మళ్లీ మాతృసంస్థతో కొంతవరకు కలిసి దేశ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించాలని భావిస్తే, అప్పుడు ఈ ఫ్రంట్‌లు ఏమీ ఏర్పడే అవకాశం లేదు, ఒకవేళ ఏర్పాటైనా పెద్దగా ప్రభావం చూపించే చాన్స్ ఉండదు.

> ఏపీలో ప్రతిపక్షం మొత్తం కన్సాలిడేట్ అయ్యి, అంతా కలిసి చంద్రబాబు మీద పోరాటం చేసే అవకాశం ఉందా అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి. జాతీయ స్థాయిలో మోదీ మీద ఇలా ప్రతిపక్షాన్ని ఏకం చేసి పోరాడా లనుకున్న చంద్రబాబుకు.. సొంత రాష్ట్రంలో ప్రతిపక్షాలు ఏకమైతే కొంత ఇబ్బంది తప్పకపోవచ్చు. మొత్తమ్మీద ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు మాత్రం మంచి కాకమీద ఉన్నాయి. ఎన్నికల సమయం దగ్గర పడితే తప్ప ఇక్కడి రాజకీయ ముఖచిత్రంలో స్పష్టత వచ్చే అవకాశం లేదు.

పవన్ రాక గతాన్ని పునరావృతం చేస్తుందా?

మరోవైపు పూర్తిస్థాయి రాజకీయ నాయకుడిగా మారిపోయిన పవన్ కల్యాణ్ ఇప్పుడు ఎవరి మనిషి అన్న చర్చ కూడా ఆంధ్రప్రదేశ్‌లో గట్టిగానే నడుస్తోంది. జనసేన పార్టీని ఏర్పాటుచేస్తున్నట్లు చాలాకాలం క్రితమే ప్రకటించిన పవన్.. తాజాగా పార్టీ ఆవిర్భావ సభ అంటూ ఓ భారీ కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. దానికి ఇసుకేస్తే రాలనంత జనం కూడా వచ్చారు. ఆ సభలో పవన్ నూటికి నూరుశాతం రాజకీయాలు మాత్రమే మాట్లాడారు. ఏపీలో లెక్కలేనంత అవినీతి ఉందని, నియోజకవర్గానికి 25 కోట్లు సిద్ధం చేసి పంపేస్తున్నారని, లోకేష్ ఎన్నికల పేరుతో డబ్బు వసూలు చేస్తున్నారని, ఎమ్మెల్యేల అరాచకాలను ముఖ్యమంత్రి పట్టించుకోవడం లేదని, ఫాతిమా కాలేజి విద్యార్థుల సమస్యను గాలికి వదిలేశారని, పోలవరం ప్రాజెక్టును ప్రైవేటు కాంట్రాక్టర్లకు కట్టబెట్టారని, అమరావతికి అన్ని వేల ఎకరాల భూములెందుకని.. ఇలా చాలా విషయాలు ప్రస్తావించారు. దాంతో ఆయన స్క్రిప్టు ఎవరిదన్న చర్చ అక్కడ గట్టిగానే నడిచింది. ప్రభుత్వ వ్యతిరేక ఓటు కన్సాలిడేట్ కాకుండా ఉండటానికి చంద్రబాబే పవన్ కల్యాణ్‌ను రంగంలోకి దించి, వ్యతిరేక ఓటును చీలుస్తున్నారన్నది వైఎస్ఆర్‌సీపీ వాదన. ఒక్కసారి ఫ్లాష్‌బ్యాక్‌లోకి వెళ్లి 2009లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన ఎన్నికలను గుర్తుతెచ్చుకుంటే, అప్పట్లో వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం మీద కొంత సానుకూలత ఉన్నా, మళ్లీ అధికారంలోకి వస్తారా.. రాలేరా అన్న అనుమానం సైతం ఉంది. ఎట్టి పరిస్థితుల్లోనూ చంద్రబాబు అధికారం చేపడతారనే అంతా అనుకున్నారు. సరిగ్గా అలాంటి సమయంలో చిరంజీవి రాజకీయ ఆరంగేట్రం చేశారు. అప్పుడు ఏపీలో ప్రజారాజ్యం పార్టీ అభ్యర్థులు సాధించిన ఓట్లు చాలావరకు కాంగ్రెస్ ఎమ్మెల్యేల మెజారిటీ కంటే కొంచెం ఎక్కువగానే ఉన్నాయి. నిజానికి పీఆర్పీ అభ్యర్థులు బరిలో లేకపోతే ఆ ఓట్లు చాలావరకు టీడీపీకి పడాల్సినవి. అలా చిరంజీవి చేసిన ప్రయత్నం వైఎస్ఆర్‌కు కలిసొచ్చింది. ఇప్పుడు సరిగ్గా ఇలాగే జరుగుతుందా అన్న అనుమానం జగన్ పార్టీలో కనిపిస్తోంది.

బహుముఖం తప్పదా?


అందులోనూ పవన్ అంత ఘాటుగా టీడీపీ ప్రభుత్వంపై విరుచుకుపడటం ఇంతకుముందు ఎప్పుడూ లేదు. దానికి టీడీపీ నుంచి మంత్రులందరితో పాటు ముఖ్యమంత్రి సైతం గట్టిగానే స్పందిస్తున్నారు. అయినా ఇదంతా డ్రామాయేనన్నది వైసీపీ అనుమానం. పవన్.. టీడీపీ తోడు దొంగలని ఆ పార్టీ అంటోంది. మరోవైపు పవన్.. జగన్ ఎప్పుడో కలిసిపోయారని, వాళ్లిద్దరితో కలిసి బీజేపీ ఇలాంటి స్క్రిప్టు రచించి వాళ్ల చేతికి ఇస్తోందని టీడీపీ అంటోంది. ఇంకోవైపు బీజేపీ వాళ్లు కూడా పవన్ తమవాడు కాడని చెబుతున్నారు. ఎవరెవరు మిత్రులవుతారో, ఎక్కడ ఎప్పుడు చేతులు కలుపుతారో అన్న విషయం ప్రస్తుతానికి వోలటైల్‌గానే ఉంది గానీ, ఎవరూ చేతులు కలపకపోతే మాత్రం ఈసారి ఏపీలో బహుముఖ పోరు ఉండే అవకాశం కనిపిస్తోంది. టీడీపీ, వైఎస్ఆర్‌సీపీ, జనసేన పార్టీలు ప్రధానంగా పోటీలో ఉండగా.. బీజేపీ, వామపక్షాలు రెండు వేర్వేరు పక్షాలకు మద్దతిచ్చే అవకాశం ఉంది. ఇక కాంగ్రెస్ పార్టీ ఎప్పటిలాగే సొంతంగా పోటీ చేస్తుంది. లేకపోతే వామపక్షాలతో ఎన్నికల అవగాహన ఉండే చాన్స్ ఉంది. ఒకవేళ పవన్-జగన్ కలిసి, ఎన్నికలు వచ్చేలోపే బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఏపీకి ప్రత్యేక హోదా ప్రకటిస్తే అప్పుడు ఆ కూటమితో పాటు బీజేపీ కూడా కలిసే అవకాశాలు లేకపోలేవు. ఇందుకోసం ఈలోపే జగన్ మీద ఉన్న కేసులు కూడా ఒక్కొక్కటిగా క్లియర్ అయిపోయే సూచనలు సైతం కొంతవరకు కనిపిస్తున్నాయి. ఇప్పటికే ఈడీ ఎటాచ్ చేసిన కొన్ని ఆస్తులను విడిపించాలని అప్పిలేట్ ట్రిబ్యునల్ తీర్పు చెప్పింది. దాంతో సీఎం చంద్రబాబుకు వైసీపీ - బీజేపీల పొత్తుపై అనుమానం మరింత బలపడింది. రేపు ప్రత్యేక హోదా పోరులో వైఎస్ఆర్‌సీపీ ఎంపీలు రాజీనామా చేసిన తర్వాత బీజేపీ హోదా ప్రకటిస్తే, ఎటూ హోదా ఇచ్చేవాళ్లకు తన మద్దతు ఉంటుందని జగన్ ఇంతకుముందే చెప్పారు కాబట్టి ఆ దిశగా ఏపీ రాజకీయాలు నడుస్తాయా అని కూడా అంటున్నారు. ఒకవైపు బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి, కాబోయే రాజ్యసభ ఎంపీ జీవీఎల్ నరసింహారావు, మరోవైపు పవన్ కల్యాణ్ దాదాపు ఒకేలాంటి ఆరోపణలు చేశారు. రెండూ టీడీపీ ప్రభుత్వంలో అవినీతి గురించి చెప్పినవే. త్వరలోనే జాతీయ స్థాయి మీడియా చానల్ ఒక దాంట్లో ఏపీ అవినీతి గురించిన సంచలన కథనం రాబోతోందని కూడా తెలుస్తోంది. ఇవన్నీ చూస్తుంటే ఏపీలో ప్రతిపక్షం మొత్తం కన్సాలిడేట్ అయ్యి, అంతా కలిసి చంద్రబాబు మీద పోరాటం చేసే అవకాశం ఉందా అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి. జాతీయ స్థాయిలో మోదీ మీద ఇలా ప్రతిపక్షాన్ని ఏకం చేసి పోరాడా లనుకున్న చంద్రబాబుకు.. సొంత రాష్ట్రంలో ప్రతిపక్షాలు ఏకమైతే కొంత ఇబ్బంది తప్పకపోవచ్చు. మొత్తమ్మీద ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు మాత్రం మంచి కాకమీద ఉన్నాయి. ఎన్నికల సమయం దగ్గర పడితే తప్ప ఇక్కడి రాజకీయ ముఖచిత్రంలో స్పష్టత వచ్చే అవకాశం లేదు. ●

దర్శనం

ప్రకృతి-వికృతి

ఉగాది ప్రకృతిపరమైన పండుగ. అంటే వసంతకాలంలో (చైత్ర మాసం) ప్రకృతి పరవశించేవేళ వచ్చే పండుగ. అందుకే భావకవి దేవులపల్లి కృష్ణశాస్త్రి 'ఆకులో ఆకునై ' పూవులో పూవునై, కొమ్మలో కొమ్మనై, నును లేత రెమ్మనై...' అని అన్నాడు. అది పరవశింపజేసే ప్రకృతిని చూసినప్పుడు కవితా భావతరంగాలు వెల్లివిరిసే వేళ పాడుకుని మనల్ని మనమే మరిచిపోయే వేళ గొంతును ఆశ్రయించే గీతం. నిజంగా పరవశింపజేసే ప్రకృతిని చూసినప్పుడు భావ గీతికలు ఎవరినైనా పలకరిస్తాయి. అది నాణానికి ఒకవైపు మాత్ర మే! ప్రకృతికి వికృతి అన్నిటా ఉంటుంది. ఇప్పుడా పరవశింపజేసే ప్రకృతి లేదు... పరిమళాలు వెదజల్లే పూలరథాలు లేవు. కోయిల పాటలు వినిపించవు. పిచ్చుకలు ఎలావుంటాయో ఈ తరానికి తెలియదు. మనిషి వికృత రూపం దాల్చి స్వలాభం కోసం ప్రకృతి విధ్వంసానికి పాల్పడుతుంటే పరవశాలు, పూల పరిమళాలు ఎక్కడి నుంచి వస్తాయి? మనసుకు ఆహ్లాదం, మనిషికి ఆనందం ఎక్కడ లభిస్తుంది? అడవుల్ని నాశనం చేస్తున్నాం, భూమిని విషతుల్యం చేస్తున్నాం. స్వచ్ఛమైన వెన్నెల కోసం కలవరిస్తున్నాం. విశ్వజగతికి జాగృతి కావాలి ఇప్పుడు. శాంతిసౌఖ్యాలకు పూలబాట కావాలి. కల్మషరహిత గుండెల్లో నుంచి ప్రవహించే ఝుంఝూమారుతంతో కూడిన తిమిరాన్ని పారదోలే చిరుదివ్వెల కాంతులైనా అవసరం నేడు. జ్ఞానసముపార్జన మరిచి, ఉబుసుపోని, అసలు ఉపయోగం లేని ఊహలతో మనసును ఆవ రించిన అజ్ఞానాన్ని చెదరగొట్టే జ్ఞానం కావాలి. అందుకే 'జ్ఞానమే సంపద' అన్నారు. జ్ఞానసముపార్జన మార్గంలో అంతా ముళ్లబాటే ప్రత్యక్షమవుతుంది విశ్వాంతరాళంలో బ్లాక్ హోల్స్ ఉన్నట్టు! మనబాటలో కులం, మతమనే అడ్డుగోడ అడ్డుతగులుతుంది. అక్కడ ఆగామా... బాబాలు, మాతాలు, స్వాములు, అవ ధూతలు...ఇలా ఒకరేమిటి? ఎందరో మనల్ని నిలువరిస్తుంటారు. మతానికి అజ్ఞానమే అండగా నిలుస్తుంది. దానికీ, జ్ఞానానికీ ఎన్నడూ కుదరదు. ఈ అజ్ఞానాన్ని నీడలా రాజకీయం వెన్నంటి ఉంటోంది. వేషాలు, రోషాలు, ఆవేశకావేశాలు.... ఇలా ఒక్కటేమిటి? మార్గమంతా ఎన్నో ప్రతిబంధకాలు! విశ్వదర్శనం ఇస్తూ ఒక్కొక్కటీ మనల్ని ఆకర్షించేందుకు ఎన్నో వికృత రూపాలతో ప్రత్యక్షమవుతున్నాయి. అక్కడ ఆగామా ... ఇక అంతే! మనుగడ స్తంభించిపోతుంది. ప్రకృతిని వికృతం చేయకుండా ప్రకృతిగానే చూస్తే జీవన విధ్వంసానికి అవకాశం ఉండదు. కనీసం ఈ ఉగాది నుంచైనా అందుకు చేతులు కలుపుదాం. అభివృద్ధి అంటే ఒక్క పారిశ్రామికీకరణే కాదు.. అది నాణానికి ఒకవైపు. రెండోవైపు ఉంటుంది. దాన్ని మనకు కనిపించకుండా ఉంచేందుకు కార్పొరేట్ సంస్థలు, పారిశ్రామికవేత్తలు విశ్వప్రయత్నం చేస్తారు. సామదానభేదదండోపాయాలతో దండెత్తివస్తారు. అప్పుడు సామాన్యుడు 'దండం దశగుణ భవేత్' అనే పరిస్థితి వస్తుంది. నాణానికి రెండోవైపు కూడా తెలుసుకోవడమే మనకిప్పుడు కావలసిన జ్ఞానం.

భూమి రాపోనలో వాయుః, ఖం మనో బుద్ధి రేవచ, అహంకార ఇతీయం, మే భిన్న ప్రకృతి రష్టదా! (భగవద్గీత) భూమి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశం, మనస్సు, బుద్ధి, అహంకారం... ఈ ఎనిమిది ప్రకృతి అంశాలు. వీటిలో ఏదీ వదలకుండా అన్నిటినీ స్వార్థపరులు నాశనం చేశారు... చేస్తూనే ఉన్నారు. భీమేశ్వర పురాణంలో శంకరుడిని శ్రీనాథుడు, 'గరళకూట వినీల కంఠాయ శంభవే మధనాంతకాయోం నమశ్శివాయ...' అని స్తుతించాడు. ఒక్క శివుడి గొంతులోనే కాదు .. ఇవాళ ప్రతి ఒక్కరి గొంతులోను, మనసులోను గరళం పొంగి ప్రవహిస్తోంది. వైద్య శాస్త్రంలో ధనమే సర్వస్వమనుకునే వైద్యులు చెప్పిన మందులు వేసుకుంటూ శరీరాన్ని విషమయం చేసుకుంటున్నాం. విశ్వేశ్వర శతకంలో కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ 'నీవే రాజువు నేను సత్కవిని తండ్రీ నిన్ను వర్ణించెదన్ / నీవే దైవమ నేను భక్తుడను దండ్రీ నిన్ను ధ్యానించెదన్ / నీవే భూమివి నేను గర్షకుడ దండ్రీ నిన్ను బండించెదన్...' అని వర్ణించారు. కానీ, ప్రస్తుత ప్రపంచానికి సర్వం సంపాదనే ఆక్రమించింది. 'ధనమిదం మూలం జగత్...' అన్నారు.



నూతన సంవత్సరంగా భావించే ఈ ఉగాది నుంచైనా ప్రకృతిని ప్రేమించడం నేర్చుకుందాం... ప్రకృతిని ప్రేమించడం ద్వారానే భవిష్యత్తు తరాలకు మనం అసలైన 'ఉగాది'ని అందించగలం. అందుకు ఈ 'ఉగాదే' ప్రారంభం కావాలి. అదే మన దీక్ష కావాలి. అందుకు అనువైన మార్గాన్ని అన్వేషిద్దాం! అనుసరిద్దాం!!

◆ తాడేపల్లి శివరామకృష్ణారావు



నేడు ఉగాది

కవిత

ఇంకా ఉగాది పచ్చడెందుకని?

కడుపులో బజ్జున్న అమ్మని
కసిగాయగానే
తుంచేస్తున్నాం
చైత్రమా! ఆడపిల్లలంటే
మావిపిందెలా?

వేప, తురగవేప, అడవివేప
ఏ వేపైనా వొరిగిందేమిటని?
చేదు మాత్రమే మన ఆస్తి
చెట్టు మీద పెత్తనం
అమెరికాదే!
ఉచితమని
సముద్రమంత విశాలంగా
కలలు కని ఏమిటి లాభం?
కలలు పండవు
దాహం తీరదు!

అదే మనుందీ, ఇదే మనుందీ
అందనివన్నీ పులుపే
చేతినిండా ఉప్పులే
చార్టుల నిండా ప్రాజక్టులే!
పంచదార చిలకలా?
పైపైని పూతలా?
భవిత వాగ్దానాల్లో
యువత రోడ్లపైనా
పంచభూతాల కల్తీని
పట్టించుకోని ఫలితం
అమ్మకల్తీ నాన్న కల్తీ
తెలుగు భాషంతా కల్తీ కల్తీ
అంతా వొగరే కదా!

క్షణం క్షణం జీవితాన్ని
రుచి చూస్తూనే వున్నాం
ఇంకా ఉగాది
పచ్చడెందుకని?

- ఈతకోట సుబ్బారావు

నూతన రాగాల విళంబి

విశ్వ ప్రగతిని కోరుచు వేగిరమున
సకల శుభముల నొసగుమా సంతసమున
వేయి కనులతో నీరాక వేచి చూడ
రమ్ము నూతన రాగాల శ్రీవిళంబి!

సెలవు నీకిక వత్సరా సెలవు సెలవు
నీదు కాలము సాగెగా నిలుచు సతము
ఎదల నిలిచావు హాయిగా హేవళంబి
రమ్ము నూతన రాగాల శ్రీవిళంబి!

బడుగు జీవుల బతుకులు బాగు పరచ
కష్ట జనులకు వెతలను కడకు చేర్చ
రైతు లోకము హర్షించ చేతనముగ
రమ్ము నూతన రాగాల శ్రీవిళంబి!

లోక కల్యాణ రూపమై లోటు లేక
నిరత సౌభాగ్య పథముల నిలుప రావె!
చెడ్డ గుణముల ఛేదించె చూపు నీవె
రమ్ము నూతన రాగాల శ్రీవిళంబి!

- అనంతవరం శ్రీనివాస్

వసంతకేళి

మెడలో పూలమాలగా
గున్నమావి నల్లుకున్న
గొజ్జంగి విరితీగ
నుదుట భాషికంలా
రావిచెట్టును చుట్టుకున్న
వన్నెల లవలీ లతిక

ఆకు పడవలో రాచిలుక
ఊగుతున్నది వయ్యారమొలుక
జీవరాశుల తనువున ఆమని
అందమై విరియగా
ప్రాణుల గుండెల్లో ప్రణయరాగాలు
ప్రకృతిలో అణువణువున
ప్రేమ భోగాలు

సుమ పరిమళాలు వసంతకేళికి
సుస్వాగతములు తెలుపగా
కలికి చిలుకలు చిలిపి జంటలకు
శుభాకాంక్షలు పలుకగా
కోరిచేరిన కొంటె తుమ్మెద
పూల ఒడిలో ఊయలూగగా
గాలి జోలలు పాడగా

కమ్మని మధువులిచ్చి
తుమ్మెద వలపు దోచిన
విరికన్నె గుండెలో
తొంగిచూసె వసంతం

- చిరమన వెంకట రమణయ్య

కలసిమెలిసుందాం!

అరమరికలు మరిచి
గుమ్మానికి అమరిన/మామిడితోరణాల్లా
అన్నదమ్ములు సఖ్యంగా
నిండైన కుంకుమతో ఇల్లాలు
తోడూనీడల్లా తోడికోడళ్లు
పంటసిరిలా పిల్లలూ, మనవరాళ్లు
తీయటి సుఖాన్నైనా
చింతంటి కష్టాన్నైనా
కారాన్నైనా మమకారాన్నైనా
వగరైనా అనురాగాన్నైనా
ఉప్పైనా ముప్పైనా పులుపైనా చేదైనా
కలిసిమెలిసి అనుభవిస్తూ
కొత్త సంవత్సరాన్ని స్వాగతిద్దాం!

- యలమర్తి అనూరాధ

మనం
కుటుంబం
ఆదివారం, 18 మార్చి 2018
www.manamnews.com

చంద్రమానం ప్రకారం కొత్త సంవత్సర ఆగమనాన్ని జరుపుకునే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్నాటక, మహారాష్ట్ర, గోవా, మణిపూర్, జమ్మూ కాశ్మీర్, సింధ్ ప్రాంతాల్లో కొత్త సంవత్సరాన్ని వివిధ పేర్లతో జరుపుకుంటారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటకల్లో ఉగాది పేరుతో సంవత్సరాదిని జరుపుకుంటే, మహారాష్ట్ర గోవా (కొంకణ్ ప్రాంతం)ల్లో గుడి పడ్వా పేరుతో జరుపుకుంటారు, ఇక మణిపూర్‌లో చెరాబా పేరుతో జరుపుకుంటే కశ్మీర్‌లో నవ్రే పేరుతో, జమ్మూ ప్రాంతంలో నవ్రాత్రా పేరుతో కొత్త సంవత్సరానికి ఘనంగా స్వాగతం చెబుతూ, సంప్రదాయబద్ధంగా పండుగను జరుపుకుంటారు. అంటే ఈ రాష్ట్రాల్లోని వారంతా చైత్ర శుక్ల పక్షంలో తొలిరోజు పాడ్యమినాడు తమతమ సంస్క ృతిని అనుసరించి కొత్త సంవత్సరానికి ఆరంభంగా జరుపుకుంటారు.





ఉగాది పండుగ వస్తోంది
ఉత్సాహాన్ని తెస్తోంది
ఊరంతా సంతోషం
ఉరకలు వేసే సందోహం
ఉప్పు, పులుపు, చెరుకు, చేదు
ఉపాహారం ఈ రోజు ప్రత్యేకం
ఉదయం తలంటు పోత
ఉత్సాహం కొత్త బట్టల జత

ఊరి దేవత సంబరం
ఉత్కంట గొలిపే వినోదం
ఉగాది పంచాంగ శ్రవణం
ఊరట ఇచ్చే గోచారం వివరం

ఉంది ఉంది మంచి పొంచి
ఉన్నది గ్రహాల బలం
ఊరికి కొంచెం ఉపకారం
ఉగ్ర గ్రహాల శాంతికి దానం

ఉన్నత స్థితికి సోపానం
ఉద్వాసన - ఇబ్బందులు మాయం
ఉగాది పండుగ ధ్యేయం
ఉత్సాహాన్ని పెంచడం

విళంబికి స్వాగతం



మరాఠీల గుడి పడ్వా

గుడి పడ్వా పండుగ ప్రకారం బ్రహ్మ ఈరోజునే విశ్వాన్ని సృష్టించాడని మరాఠీలు విశ్వసిస్తారు. అంతేకాదు సత్యయుగం ఆరంభమైంది ఈరోజే అన్నది మరాఠా పురాణాల సారం. జగత్తును ఈరోజు సృష్టించిన బ్రహ్మ కాల గణన, గ్రహ నక్షత్ర, రుతు, మాస, వర్షాదులను ప్రవర్తింప చేశాడు. నారద పురాణం కూడా ఇదే విషయాన్ని వివరిస్తుంది. సంవత్సరంలో తొలి రోజును రంగు రంగుల రంగోలీలతో ఆహ్వానించడం మహారాష్ట్రలో సంప్రదాయంగా వస్తోంది.

యుగాది

తెలుగు సంవత్సరాలకు ప్రత్యేకంగా పేర్లు ఉన్నాయి. ఆయా పేర్లను బట్టి సంవత్సరమంతా ఎలా ఉంటుందో అంచనా వేయవచ్చు. మొత్తం 60 సంవత్సరాలు తెలుగు సంవత్సరాలుగా మనకు వాడుకలో ఉన్నాయి. ప్రభవనామ సంవత్సరం తొలి సంవత్సరం కాగా అక్షయనామ సంవత్సరంతో ఒక ఆవృతం పూర్తవుతుంది. తిరిగి మళ్లీ ప్రభవనామ సంవత్సరంతో పంచాంగం మొదలవుతుంది. ఇక ఈ పేర్ల వెనుక కూడా ఎన్నో కథలు, కథనాలు ప్రచారంలో ఉన్నాయి. అందులో ఒకటి శ్రీకృష్ణుడికి 16100 మంది భార్యల్లో సందీపని అనే రాజకుమారికి 60 మంది సంతానం, వారి పేర్లనే తెలుగు సంవత్సరాలకు పెట్టారని ప్రతీతి. మరో కథ ప్రకారం నారదుడి పిల్లల పేర్లు వీటికి పెట్టారని, కాదు దక్షుడి కుమార్తెల పేర్లే మన సంవత్సరాల పేర్లని భిన్నవాదనలు ఉన్నాయి. శాలివాహనుడు పట్టాభిషిక్తుడైన దినం కారణంగా ఈ పండుగ ప్రాశస్త్యంలోకి వచ్చినట్టు మరొక గాథ కూడా ఉంది. శ్రీమహావిష్ణువు మత్స్యావతారంలో వేదాలను దొంగతనం చేసిన సోమకుడిని సంహరించి వాటిని బ్రహ్మకు అప్పగించిన రోజు కూడా ఇదేనని ప్రతీతి. శ్రీరాముడు, విక్రమాదిత్యుడు, శాలివానుడు పట్టాభిషిక్తుడైన రోజు కూడా ఉగాది అని ప్రతీతి. వీటితోపాటు వరాహమిహురుడు పంచాంగాన్ని జాతికి అంకితం చేసింది కూడా ఈరోజే. ఉగాదిని 'యుగాది' అని కూడా అంటారు. 'ఉగ' అంటే నక్షత్ర గమనం, నక్షత్ర గమనానికి 'ఆది' కనుగ 'ఉగాది' అని అర్థం. సృష్టి ఆరంభమైన దినం కనుక 'యుగాది' అని అంటారు. యుగం అంటే జంట అనే అర్థముంది, ఇక్కడ జంట అంటే ఉత్తరాయణం, దక్షిణాయణం అనే రెండు యుగం (సంవత్సరం) కనుక యుగానికి ఆది యుగాది అయిందన్నమాట. వసంత ఆగమనోత్సవ వేడుకలను నిర్వహించే ఉత్తమమైన రోజున అన్నీ శుభసూచకాలు కావాలని అందరూ మనస్ఫూర్తిగా కోరుకుంటూ, పూజాదికాలు నిర్వహిస్తారు.

60 సంవత్సరాలెందుకు?

గ్రహాలలో శని ఒకసారి సూర్యుని చుట్టూ తిరిగి రావడానికి 30 సంవత్సరాలు, గురుడు తిరిగి రావడానికి 12 సంవత్సరాలు పడుతుంది. ఈ రెండింటి కనిష్ట సామాన్య గుణిజం 60 కనుక చాంద్రమానంలోని సంవత్సరాలను కూడా 60గా నిర్ణయించారు. ఈ 60 సంవత్సరాలను మళ్లీ మనం సంవత్సర, పరివత్సర, ఇడావత్సర, ఇద్వత్సర, అనువత్సరాలనే భాగాలుగా చేస్తే అది పంచవర్షాత్మక యుగంగా చూస్తే 60 ఏళ్లు మళ్లీ 12 విభాగాలుగా కనిపిస్తాయి.



ఉగాది కవి సమ్మేళనాలు

ఉగాది పండుగ మరో విశిష్ఠత కవి సమ్మేళనాలు పెద్ద ఎత్తున నిర్వహించడం. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణంతోపాటు కవి సమ్మేళనాలను అధికారికంగా నిర్వహిస్తారు. ప్రపంచంలో తెలుగు, కన్నడ సంఘాలవారు ఎక్కడ ఉన్నా ఇలా కవితా సమ్మేళనాలను నిర్వహించి, ఆద్యంతం ఆస్వాదించడం విశేషం.

పంచాంగ శ్రవణంలో ఆంతర్యమిదే

తిథి వార నక్షత్రాదులతో కూడుకున్న పంచాంగాన్ని ఈరోజు వినడం వల్ల సంవత్సరంలో చేయాల్సిన పనులకు సంబంధించిన ప్రణాళిక వేసుకునే అవకాశం కలుగుతుంది. అందుకే పంచాంగ శ్రవణం తప్పనిసరిగా మన సంప్రదాయంలో చేర్చారు. కొత్త సంవత్సానికి సంబంధించిన విశేషాలను తెలుసుకుంటే (శ్రవణం చేస్తే) సంవత్సరంలో తీసుకునే నిర్ణయాలు, ఆచరణపై తొలి రోజునే ఓ స్పష్టత వస్తుంది. ఇదంతా ముందు జాగ్రత్తలో భాగమే కానీ చాదస్తం ఏమాత్రం కాదు. వర్షాలు ఎలా ఉంటాయి, ఏ ప్రాంత భూముల్లో ఏ పంటలు బాగా పండుతాయి, ఏఏ ధాన్యాల విలువలు ఎలా ఉంటాయి, పశుసంపద, యుద్ధాలు, వాతావరణం, ఆరోగ్యం, ఐశ్వర్యం ఇలా ప్రతి అంశానికి సంబంధించిన వివరాలను ముందస్తుగా తెలుసుకోవడం ద్వారా ఆ సంవత్స రంలో ఎలా మెలగాలో అన్ని వర్గాల వారికి అర్థమవుతుంది. పంచాంగం అంటే తిథి, వార, నక్షత్ర, యోగ, కరణాలు. భూమి నుండి ఆకాశంలోని సూర్య, చంద్రాదుల దూరాలను గణించి వాటికి సంబంధించిన వివరాలను అందించే విజ్ఞాన సర్వస్వమే మన పంచాంగం.



తెలుగు లోగిళ్లలో ఉగాది

ప్రకృతి కొత్త చీర కట్టుకోగా... కోకిలమ్మ రారమ్మంటూ 'కొత్త ఏడాది'కి ఆహ్వానం పలుకుతున్న వేళ.. తెలుగు లోగిళ్లు 'ఉగాది'ని ఆనందోత్సాహాలతో జరుపుకుంటున్నారు. షడ్రుచుల 'ఉగాది పచ్చడి'ని ఆరగించి విళంబి నామ సంవత్సరానికి స్వాగతం పలుకుదాం.

రుచుల సమ్మేళనం-అనుభవాల సారం

ఉగాది పచ్చడిలోని ఒక్కొక్క పదార్థం, ఒక్కొక్క భావానికి, అనుభవానికి ప్రతీక.

బెల్లం – తీపి : ఇది ఆనందానికి సంకేతం

ఉప్పు– ఇది ఉత్సాహానికి నిదర్శనం. నిండైన ఉత్సాహం ఉంటేనే మనిషి ఏ పనైనా చేయగలడు.

వేపపువ్వు – చేదు: ప్రతి మనిషి జీవితంలో సంతోషాలతో పాటు, బాధలు, కష్టాలు ఉంటాయి. అవి కలిగించే అనుభవాలకు ప్రతీకనే చేదు రుచి.

చింతపండు – పులుపు: నేర్పుగా వ్యవహరించాల్సిన పరిస్థితులకు సూచిక.

మామిడి ముక్కలు– వగరు: పాత సమస్యలు తొలిగిపోగానే.. మళ్లీ కొత్త చిక్కులు వస్తుంటాయి. కొత్త సవాళ్లకు ఎప్పుడూ సిద్ధంగా ఉండాలి. అదే వగరు రుచి చెబుతోంది.


మిరప పొడి – కారం: సహనం కోల్పోయే పరిస్థితులకు ఇది సూచన.



కడప గడపలో..

కడపలో 'దేవుని గడప'గా పిలిచే శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం ఉంది. తిరుమలకు కాలినడకన వెళ్లే వాళ్లు మొదట ఈ ఆలయాన్ని సందర్శించే వెళతారని స్థానికులు చెబుతారు. అందుకే దీనికి ఆ పేరు వచ్చింది. ఇక్కడ ఉగాది పండుగ సర్వమత సమ్మేళనాన్ని తలపిస్తుంది. ఈ పర్వదినాన ముస్లింలు భక్తిప్రపత్తులతో కోటినామాల గోవిందుడిని సేవిస్తారు. శ్రద్ధగా పూజలు చేస్తారు. ఉగాది పచ్చడి చేసుకోవడమే కాదు, వీధుల్లో అందరికీ పంచిపెడతారు. వంద సంవత్సరాల నుంచి ఇక్కడ ఈ సంప్రదాయం కొనసాగుతోంది.

దర్గాలో పంచంగ శ్రవణం



ఉగాదికి పంచాంగ శ్రవణం వినడం తెలుగు ప్రజల సంప్రదాయం, ఆనవాయితీ. దేవాలయాల్లో శ్రవణం వినడం సహజమే కానీ దర్గాలో పంచాంగ శ్రవణం నిర్వహించడం విశేషంగా చెప్పుకోవచ్చు. కర్నూలో జిల్లాలోని కౌతాళం దర్గా అందుకు వేదికగా నిలిచింది. పంచాంగ శ్రవణానికి హిందూ, ముస్లింలు కలిసే వస్తారు. దాదాపు 300 ఏళ్లుగా ఇక్కడ ఈ సంప్రదాయం కొనసాగుతోంది. ఖాదర్ లింగాస్వామి స్మారకంగా ఈ దర్గాను నిర్మించారు.

పేర్లలో ఏముంది?

ప్రతి సంవత్సరానికి ఉన్న పేర్ల వెనుక ఓ పురాణ గాథ ఉంది. అదేంటంటే విష్ణుమాయ కారణంగా నారదుడికి 60 మంది పుత్రులు జన్మిస్తారు. ఓ యుద్ధంలో వారంతా చనిపోతారు. నారద మహర్షి విష్ణువుని ప్రార్థించగా ఆయన కరుణిస్తాడు. నీ పిల్లలు 60 సంవత్సరాలు కాలచక్రంలో తిరుగుతుంటారు, ఆ పేర్లు శాశ్వతంగా నిలిచిపోతాయంటూ వరమిస్తాడు. అవే మన తెలుగు సంవత్సరాలుగా వాడుకలో ఉన్నాయని ఆ పురాణ గాథ వివరిస్తోంది.

అరవై వసంతాలు..

ఈ ఏడాది వచ్చిన విళంబి నామానికి అర్థం.. అంతా సుభిక్షంగా ఉంటారని. మంచి కోరుకోవడం వల్ల అంతా మంచే జరుగుతుందంటారు.



బెటర్ ఆంధ్రప్రదేశ్ (బాప్) ఆధ్వర్యంలో జరిగిన ఉగాది పురస్కారాల కార్యక్రమంలో పత్రికా రంగానికి గాను పురస్కారం అందుకుంటున్న 'మనం' దినపత్రిక ఆంధ్రప్రదేశ్ రెసిడెంట్ ఎడిటర్ జి. రాజశుక దంపతులు


మంత్రి హరీశ్ కాన్వాయ్ కారులో మంటలు!



హైదరాబాద్, మార్చి 17: మంత్రి హరీశ్‌రావు కాళేశ్వరం ప్రాజెక్ట్ పర్యటనలో చిన్న అపశ్రుతి చోటు చేసుకున్నది. మహదేవ్‌పూర్ మండలంలో మేడిగడ్డ బ్యారేజ్ పనులను మంత్రి పరిశీలించి వస్తుంబడగా.. మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న అంబటిపల్లి గ్రామం సమీపంలోకి రాగానే.. కాన్వాయ్‌లోని మంత్రి వాహనంలో మంటలు చెలరేగాయి. ఇది మంత్రి ప్రయాణించే ఇన్నోవా కారు. కాని.. ప్రమాద సమయంలో మంత్రి ఆ కారులో లేరు. హరీశ్ రావు వేరే కారులో ప్రయాణిస్తున్నారు. ఇంజన్ వేడెక్కడం వల్ల మంటలు చెలరేగడంతో వెంటనే అప్రమత్తమైన సిబ్బంది మంటలను ఆర్పేశారు. ఈ ఘటనలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. దీంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

హే.. గాంధీ!

(మూడోపేజీ తరువాయి)



లేబర్ కోర్టులో జడ్జిగా పనిచేస్తుండటంతో ముందుగా హైకోర్టు నుంచి అనుమతి తీసుకుని మరీ శనివారం ఏక కాలంలో ఏడు ప్రాంతాల్లో ఏసీబీ అధికారులు దాడులు చేశారు. హైదరాబాద్ వారాసిగూడ ప్రాంతంలో ఉన్న జడ్జి మల్లంపాటి గాంధీ విలాసవంతమైన ఇంటితో పాటు తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో ఆయన బంధువులు, స్నేహితుల ఇళ్లలో కూడా ఒకేసారి సోదాలు జరిగాయి. హైదరాబాద్‌లోని వారాసిగూడ, నాంపల్లి, డీడీ కాలనీలతో పాటు తూర్పుగోదావరి జిల్లా రాజానగరం, పశ్చిమగోదావరి జిల్లా కొవ్వూరు, దేవరపల్లి, గోపాలపురం తదితర ప్రాంతాలలో ఈ సోదాలు చేశారు. వారాసిగూడలో జడ్జికి చెందిన విలాసవంతమైన ఇంట్లో సోదాలు చేసేటపుడు ఏసీబీ అధికారులు కౌంటింగ్ మిషన్లను కూడా తెప్పించాల్సి వచ్చింది. దాన్ని బట్టి నగదు ఎంత మొత్తంలో దొరికి ఉంటుందో అంచనా వేయొచ్చు. అలాగే.. ముందు జాగ్రత్తగా ఆయనను అదుపులోకి తీసుకోడానికి ముందు గాంధీ ఆస్పత్రికి చెందిన వైద్యులను కూడా ఇంటికే రప్పించి ఆయనకు వైద్య పరీక్షలు చేయించారు. మొత్తం రూ. 3.57 కోట్ల విలువైన ఆస్తులను గుర్తించినట్లు ఏసీబీ అధికారులు హైదరాబాద్‌లో విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం జిల్లా జడ్జి క్యాడర్‌లో ఉన్న గాంధీని అదుపులోకి తీసుకుని ఏసీబీ అధికారులు విచారిస్తున్నారు. 1994లో ఉద్యోగంలో చేరిన గాంధీ.. 2018 ఫిబ్రవరి వరకు సంపాదించిన ఆస్తులన్నింటినీ లెక్కదీశారు. పశ్చిమగోదావరి జిల్లాలో 18.22 ఎకరాల భూమి, హైదరాబాద్‌లో మూడు అంతస్తుల ఇంటితో పాటు రెండు ఫ్లాట్లు, మూడు కార్లు, ఇంట్లో కిలో బంగారం, నాలుగు కిలోల వెండి ఉన్నట్లు కనుగొన్నారు. స్టేట్ బ్యాంక్ వారాసిగూడలో ఒక లాకర్ ఉన్నట్లు తెలిసి వెంటనే అక్కడకు వెళ్లగా అక్కడ దాదాపు ఒకటిన్నర కిలోల బంగారు నగలు బయటపడ్డాయి. దాంతో మొత్తం రెండున్నర కిలోల బంగారం ఉన్నట్లయింది.

పశ్చిమగోదావరి జిల్లా కొవ్వూరుకు చెందిన నిమ్మలగడ్డ పుల్లారావు అనే న్యాయవాది... గాంధీ తోడల్లుడు కావడం, ఆయన గాంధీకి బినామీగా వ్యవహరిస్తున్నారన్న అనుమానంతో ఏసీబీ అధికారులు శనివారం ఆయన ఇంట్లో సోదాలు చేశారు. ఏసీబీ డిప్యూటీ డైరెక్టర్ ఆదేశాల మేరకు మెదక్ రేంజి డీఎస్పీ ప్రతాప్‌కుమార్ ఆధ్వర్యంలో పుల్లారావు ఆస్తులపై వివరాలు సేకరించారు. పశ్చిమగోదావరి జిల్లాలో దేవరపల్లి మండలం కురుకురు గ్రామంలో గాంధీ అన్నయ్య ఇంట్లో, గోపాలపురం మండలం వెదుళ్లగుంటలోని మావయ్య ఇంట్లోను సోదాలు నిర్వహించామరు. పుల్లారావు బ్యాంకు ఖాతాలు, ఆదాయ పన్ను రిటర్నులు, వివిధ దస్తావేజులు పరిశీలించి ఆయన వద్ద నుంచి వివరాలు సేకరించారు. అలాగే తూర్పుగోదావరి జిల్లా రాజానగరంలో పుల్లారావు కూతురి ఇంటిపై కూడా అధికారులు దాడులు చేశారు.

తెలుగు ప్రజలకు మోదీ ఉగాది శుభాకాంక్షలు

న్యూఢిల్లీ, మార్చి 17: దేశంలోని పవిత్ర స్థలాలు, పుణ్యక్షేత్రాల్లో శ్రీశైలం ఒకటని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. 'తెలుగు ప్రజలకు ఉగాది పర్వదిన శుభాకాంక్షలు' అంటూ మోదీ తెలుగులోనే మాట్లాడారు. న్యూఢిల్లీ నుంచి ప్రధాని మోదీ.. శ్రీశైలం ఆలయ ప్రధాన అర్చకులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ.. ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. మిమ్మల్ని నేరుగా కలిసే అవకాశం లేనందున వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్నానని అన్నారు. షడ్రుచుల కలయికతో ఉగాది పచ్చడి మహా అద్భుతంగా ఉంటుందని పేర్కొన్నారు. బసమేశ్వరుడు నడయాడిన నేల శ్రీశైలం అని.. ఉగాది యుగానికి ఆరంభం అని.. సంతోషం, బాధతో కూడిన జీవితాలను ఉగాది పచ్చడి ప్రతిభింబిస్తుందని మోదీ అన్నారు. సరికొత్త ఆశలు, ఆశయాలతో ఉగాది ప్రారంభమవుతుందని అన్నారు.

19న కోల్‌కతాకు కేసీఆర్

(మూడోపేజీ తరువాయి)

ఆయన పరిగణలోకి తీసుకోనున్నారు. దేశ రాజకీయ పరిస్థితులపై ఇద్దరు నాయకులు చర్చించనున్నారు. మమతా బెనర్జీ తరువాత వరసగా వివిధ పార్టీల నాయకులతో కేసీఆర్ చర్చలు జరపనున్నారు. ప్రధానంగా ప్రాంతీయ పార్టీలపైనే ఆయన ఎక్కువ దృష్టి కేంద్రీకరించనున్నారు. మరోవైపు, కేంద్రంలో క్షణంక్షణం మారుతున్న రాజకీయ సమీకరణాల నేపథ్యంలో వీరి అత్యంత భేటీకి అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది. ఇద్దరు సీఎంల భేటీలో ఎలాంటి అంశాలు చర్చకు వస్తాయోనని జాతీయ రాజకీయాల్లోనూ చర్చ జరుగుతోంది. వారి భేటీ ఫలితం ఎలా ఉండబోనుందో కూడా అంచనా వేస్తున్నాయి. ఒకవేళ థర్డ్‌ఫ్రంట్‌కు వీరి భేటీలో బీజం పడితే మాత్రం జాతీయ రాజకీయాల్లో పెను సంచలనంగా మారనుందని రాజకీయ పండితులు పేర్కొంటున్నారు. నాలుగేండ్లుగా తలోదిక్కున ఉన్న పలు ప్రాంతీయ పార్టీలు మోదీ సర్కారుకు కలిసికట్టుగా సెగ పెట్టేందుకు ఈ తృతీయ ఫ్రంట్ బీజం వేయనుందని అంటున్నారు. దేశవ్యాప్తంగా కొద్ది రోజులుగా చోటుచేసుకుంటున్న రాజకీయ పరిణామాలు, పునరేకీక తమవుతున్న ప్రాంతీయ పార్టీలు, ముందుకొస్తున్న కొత్త కూటమి ప్రయత్నాలు, ఎన్డీయే కూటమికి రోజురోజుకు దూరమవుతున్న భాగస్వామ్యపక్షాలు, ఉత్తరప్రదేశ్, బీహార్‌లలో బీజేపీకి కలవరం కలిగించిన పరిణామాలను గమనిస్తే.. వీరి భేటీ జాతీయ రాజకీయాలను కీలక మలుపు తిప్పగలవని భావిస్తున్నారు. ఇప్పటికే తెలంగాణ అభివ ద్ధి తీరుతెన్నులను వివిధ రాష్ట్రాలకు, కేంద్ర ప్రభుత్వానికి అధ్యయనాంశంగా మార్చిన కేసీఆర్.. తెలంగాణ తరహా ప్రయోగాన్ని జాతీయ స్థాయిలో చేసేందుకు సిద్ధపడుతుండటంతో రాజకీయ చర్చ మొదలైంది. మరోవైపు వరుసగా ఒకొక్కక్క భాగస్వామ్య పక్షాన్ని కోల్పోతున్న ఎన్డీయేకు తాజాగా టీడీపీ షాక్ ఇచ్చింది. తాను ఎన్డీయే కూటమినుంచి వైదొలుగుతున్నట్టు ప్రకటించడం, ఎన్డీయే ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం ఇవ్వడం, దానికి కాంగ్రెస్, వామపక్షాలతోపాటు మమతాబెనర్జీ నాయకత్వంలోని తృణమూల్‌కాంగ్రెస్, ఇతర ఎన్డీయేయేతర పక్షాలు మద్దతు పలుకడంతో ఎన్డీయేకు బీటలు వారుతున్నాయనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

తొలిగేటు వచ్చింది!



(మూడోపేజీ తరువాయి)

చేపడుతున్న కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ ప్రాంతాలలో శనివారం ఆయన విస్తృతంగా పర్యటించారు. నిర్ణీత గడువులోగానే మూడు బ్యారేజిలు, మూడు పంప్‌హౌజ్‌ల నిర్మాణ పనులు పూర్తిచేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు మంత్రి చెప్పారు. అన్నారం బ్యారేజి గేట్ల బిగింపు ప్రక్రియ శనివారం మొదలైంది. తొలిగేటును బిగించే పనులను మంత్రి ప్రత్యక్షంగా పరిశీలించారు. అన్నారం బ్యారేజికి 66, మేడిగడ్డకు 86, సుందిళ్ల బ్యారేజికి 74 గేట్లను అమర్చాల్సి ఉంది. కాళేశ్వరానికి సంబంధించిన బ్యారేజిలు, పంప్‌హౌజ్ పనుల్లో 80% సిమెంటు కాంక్రీటు పనులు పూర్తయినట్టు మంత్రి ప్రకటించారు. మిగతా 20% పనులు రెండు నెలల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. అన్నారం-కన్నెపల్లి మధ్య గ్రావిటీ కెనాల్ పనులు 70% పూర్తయినట్టు హరీశ్ రావు విలేకరులకు చెప్పారు. కాళేశ్వరం పనుల పురోగతిపై మంత్రి హరీశ్ రావు కన్నెపల్లి దగ్గర ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ అమేయ కుమార్, కాళేశ్వరం ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ నల్ల వెంకటేశ్వర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు. వేసవి కాలంలో రాత్రి వేళల్లో పనులను వేగవంతం చేయడానికి అవసరమైన చోట కొందరు ఇంజనీర్లను డిప్యుటేషన్‌పై నియమించనున్నట్టు మంత్రి తెలిపారు. కన్నెపల్లి, మేడిగడ్డ, సుందిళ్ల,అన్నారం పంప్‌హౌజ్‌లకు అవసరమైన యంత్రాలు మరో పది రోజుల్లో దిగుమతి కానున్నట్టు మంత్రి చెప్పారు. జపాన్, స్విట్జర్లాండ్, ఆస్ట్రియా లాంటి దేశాల నుంచి ఈ యంత్ర సామగ్రి రవాణా అవుతున్నట్టు హరీశ్ రావు తెలిపారు. కన్నెపల్లి దగ్గర గోదావరి నుంచి అప్రోచ్ కెనాల్ , హెడ్ రెగ్యులేటర్ ద్వారా ఫోర్ బే వరకు చేరిన నీటిని శక్తిమంతమైన మోటార్ల ద్వారా ఎత్తి అన్నారం, సుందిళ్ల బ్యారేజిల మీదుగా ఎల్లంపల్లికి తరలించనున్నారు. ఇందుకోసం కన్నెపల్లి పంపుహౌజ్ లో 17 మోటార్లు అమర్చుతున్నారు. నీటిని పంపింగ్ చేయడానికి 5 మీటర్లు, 3.5 మీటర్ల వ్యాసార్ధంతో ఉన్న భారీ పైపులను నిర్మాణంలో ఉపయోగిస్తున్నారు. కన్నెపల్లి పంపు హౌజ్ నుంచి దాదాపు కిలోమీటరున్నర దూరం వరకు పైపుల ద్వారా నీటిని తరలించి అక్కడి నుంచి గ్రావిటీ కెనాల్ ద్వారా అన్నారం బ్యారేజీలోకి నీటిని నింపనున్నారు. కన్నెపల్లి - అన్నారం మధ్య అటవీ ప్రాంతంలో తలపెట్టిన 13.35 కిలోమీటర్ల పొడవైన గ్రావిటీ కెనాల్ నిర్మాణ పనులను మంత్రి హరీశ్ రావు శనివారం పరిశీలించారు. ఇందులో మట్టి పనులు దాదాపు పూర్తి కావస్తున్నాయి. స్ట్రక్చర్ల నిర్మాణం సహా అన్ని పనులనూ రెండు నెలల్లో పూర్తి చేయాలని ఇంజనీర్లు, ఏజన్సీ ప్రతినిధులను ఆయన ఆదేశించారు. ఈ పనులు మే 31 కల్లా పూర్తి చేయాలని డెడ్ లైను విధించారు.

విద్యుత్ పనులు వేగవంతం

కాళేశ్వరం ప్రాజెక్టులో విద్యుత్ సబ్ స్టేషన్ల నిర్మాణ పనులు వేగవంతమయ్యాయి. ప్రాజెక్టు అవసరాలకు ప్రత్యేక విద్యుత్ లైన్ల ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రాజెక్టులో ప్రధానమైన బ్యారేజిలు, పంప్‌హౌజ్‌ల కోసం ప్రత్యేకంగా విద్యుత్ సబ్ స్టేషన్ల నిర్మాణాలు, ప్రత్యేక లైన్ల ఏర్పాట్ల పనులు జోరుగా సాగుతున్నాయి. విద్యుత్తు అవసరాల సామర్థ్యానికి అనుగుణంగా పనులు పూర్తవుతున్నాయి. జైపూర్‌లోని సింగరేణికి చెందిన పవర్ ప్లాంట్ నుంచే ప్రత్యేకంగా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల పంప్‌హౌజ్‌లకు వేర్వేరుగా విద్యుత్ లైన్లు ఏర్పాటు చేస్తున్నారు. పెద్దపల్లి జిల్లా గోలివాడ నుంచి జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కన్నెపల్లి దగ్గర నిర్మిస్తున్న పంప్‌హౌజ్ వరకు 80 కిలోమీటర్ల మేరకు విద్యుత్ లైను లాగుతున్నారు. రాష్ట్రంలో పెద్ద ఎత్తున చేపట్టిన ఎత్తిపోతల పథకాలకు అవసరమైన విద్యుత్ కోసం విద్యుత్ శాఖ ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నది. మొత్తం ఎత్తిపోతల పథకాలకు 12,500 మెగావాట్ల విద్యుత్ అవసరమని అంచనా వేశారు. వచ్చే వానాకాలం నాటికి కాళేశ్వరం ప్రాజెక్టు పంపింగ్ స్టేషన్లు పని చేయనున్నవి. విద్యుత్ సరఫరాకు ఏర్పాట్లు వేగవంతం చేయాలని మంత్రి హరీశ్ రావు ఆదేశించారు. విద్యుత్, ఇరిగేషన్ అధికారులతో మంత్రి నిరంతరం సమీక్షిస్తున్నారు. కాళేశ్వరం పంపు హౌజ్‌ల పనులు త్వరలోనే పూర్తి చేయడానికి డెడ్‌లైన్ పెట్టుకున్నందున విద్యుత్ సంస్థలు తమ పనులను మరింత వేగవంతం చేశాయి. వచ్చే ఖరీఫ్‌లో కాళేశ్వరం ద్వారా ఆరునూరైనా సాగునీటిని అందించడానికి మంత్రి హరీశ్ రావు నిరంతరం సమీక్షిస్తున్నారు. ఆకస్మిక పర్యటనలు జరుపుతున్నారు. కాళేశ్వరం కోసం 59 విద్యుత్ టవర్ల ఏర్పాటును పూర్తి చేయనున్నారు. రానున్న రోజుల్లో ఇరిగేషన్, విద్యుత్ సంస్థలు మరింత సమన్వయంతో పని చేయాల్సిన అవసరం ఉందని హరీశ్ రావు అభిప్రాయపడుతున్నారు. ఇందుకోసం ఇరిగేషన్, ట్రాన్స్‌కోకు చెందిన ఇంజనీర్లతో ఒక బృందాన్ని ఏర్పాటు చేయాలని కూడా గతంలో ఆయన సూచించారు. ఒక్కో ప్రాజెక్టు వద్ద ఒక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేయాలని, అందులో ఈ టీమ్ పనిచేయాలని మంత్రి ఆదేశించారు. బ్యారేజిలు, పంప్‌హౌజ్‌లు, కరకట్టలు, కాలువలు, రిజర్వాయర్లు తదితర పనులన్నీ సమాంతరంగా చేసేందుకు చర్యలు చేపట్టారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మిస్తున్న మేడిగడ్డ బ్యారే జి వద్ద 365 రోజులు నీరు అందుబాటులో ఉంటున్నందున ఎప్పుడు ఎంత పని జరిగితే అంత మేర నీటిని తరలించి చెరువులు నింపేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఒకే కేంద్రం నుంచి కాకుండా వేర్వేరు జనరేషన్ స్టేషన్ల ద్వారా విద్యుత్ అందించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులకు అంతరాయం కలగకుండా విద్యుత్ సరఫరా చేయడానికి ట్రాన్స్ కో సన్నాహాలు చేస్తున్నది. ఉత్తర భారతదేశంతో దక్షిణాది రాష్ట్రాల విద్యుత్ గ్రిడ్ అనుసంధాన ప్రక్రియ వేగవంగా అమలవుతున్నది. కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తయ్యే నాటికి విద్యుత్ గ్రిడ్ అనుసంధానం కూడా పూర్తవుతుందని తెలంగాణ ప్రభుత్వం భావిస్తున్నది. కాళేశ్వరం విద్యుత్ పనుల పురోగతిని ప్రభుత్వ లిఫ్ట్ ఇరిగేషన్ సలహారు పెంటారెడ్డి క్షేత్ర స్థాయిలో పర్యవేక్షిస్తున్నారు.

ఈ ఏడాది సాధారణమే!

రుతుపవనాల గమనంపై వాతావరణ శాఖ నివేదిక

- 'పసిఫిక్, హిందూ'లు సానుకూలం
- లానినా పరిస్థితులు శుభసూచకం
- మార్చిలో అల్పపీడనం అరుదు
- రేపటి వరకూ పలుచోట్ల వర్షాలు
- గ్లోబల్ వార్మింగ్ వల్లే ఈ మార్పులు
- వాతావరణ నిపుణుల వెల్లడి



హైదరాబాద్, మార్చి 17:

ఈ ఏడాది రుతు పవనాలు అనుకూలంగానే ఉండే అవకాశం ఉందని భారత వాతావరణ పరిశోధన శాఖ(ఐఎండీ) నివేదిక వెల్లడించింది. ఇది అందరిలో ఆశలు రేకెత్తించింది. లానినా పరిస్థితులు ఇప్పటికి శుభసూచకమంటూ ముందస్తు అంచనాలను మోసుకొచ్చింది. పసిఫిక్, హిందూ మహాసముద్రాల నుంచి అనుకూల వాతావరణం కనిపిస్తోందని వెల్లడించింది. ఈమేరకు మార్చి నెలకు సంబంధించి ఎల్‌నినో, లానినాల గమనం.. హిందూ మహాసముద్ర ద్విధ్రువ (ఐఒడీ) పరిస్థితులపై ప్రత్యేక సమాచారాన్ని వెలువరించింది. పసిఫిక్ మహాసముద్రంలోని భూమధ్యరేఖా ప్రాంతంలో లానినా పరిస్థితులున్నాయని.. మొత్తం రుతుపవన కాలానికి ఇదే పరిస్థితి ఉండవచ్చని అంచనా వేసింది. వాతావరణంలో ఎల్‌నినో చూపించే ప్రభావానికి వ్యతిరేకంగా లానినా పరిస్థితులుంటాయి. పసిఫిక్ మధ్య, తూర్పు ప్రాంతాల్లో ఎల్‌నినో ఉంటే వేడిమిని పెంచుతుంది. అవే ప్రాంతాల్లో లానినా పరిస్థితిని చల్లబరుస్తుంది. ఈ క్రమంలో రుతుపవనాలు అనుకూలంగా ఉండే పరిస్థితులు కనిపిస్తున్నట్లు ఐఎండీ (పుణే) విశ్లేషణ బృందానికి చెందిన ఏ.కె.శ్రీవాస్తవ తెలిపారు. హిందూ మహాసముద్ర భూమధ్య రేఖా ప్రాంతంలో తటస్థ పరిస్థితులు.. ఐఒడీ సానుకూలంగా ఉండటం వంటివి మంచి పరిణామాలని వెల్లడించారు. అయితే రుతుపవనాలను అనేక అంశాలు ప్రభావితం చేస్తాయని.. దీంతో కచ్చితమైన సమాచారం ఇప్పుడే చెప్పలేమని పేర్కొన్నారు.

'అరేబియా'లో మార్చిలోనే అల్పపీడనం

ఉష్ణోగ్రతలు మండిపోతున్న సమయంలో సముద్ర జలాలు ఆవిరిగా మారి అల్పపీడనాలు ఏర్పడడం సహజమే.. అయితే, ఈ ఏడాది మాత్రం అసాధారణ పరిస్థితులు నెలకొన్నాయని వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. హిందూ మహాసముద్రంలో భూమధ్యరేఖకు సమీపంలో మార్చి 10న ఏర్పడిన అతి తక్కువ స్థాయి అల్పపీడనం అరేబియా సముద్రంవైపునకు వచ్చి అల్పపీడనంగా మారింది. అది గంటకు 20 కి.మీ. వేగంతో ప్రయాణిస్తూ లక్షద్వీప్ వద్ద బలహీనపడిందని చెప్పారు. ఇలా మార్చి ప్రారంభంలోనే అరేబియా సముద్రంలో అల్పపీడనం ఏర్పడి వర్షాలు కురవడం అత్యంత అరుదైన విషయమని చెప్పారు. రికార్డులను పరిశీలిస్తే.. గడిచిన 125 ఏళ్లలో ఈ తరహా అల్పపీడనం ఏర్పడడం ఇదే తొలిసారని తేలిందన్నారు. దీని ప్రభావంతో తెలంగాణలో ఓ మోస్తరు వర్షాలు కురిసినా.. మహారాష్ట్రలోని విదర్భ, మరఠ్వాడా ప్రాంతాలతో పాటు కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. సోమవారం వరకూ ఇదే పరిస్థితి కొనసాగే అవకాశం ఉందని సమాచారం. వాస్తవానికి బంగాళఖాతంతో పోలిస్తే అరేబియా సముద్రంలో ఏర్పడే అల్పపీడనాల సంఖ్య తక్కువే.. అయితే, గ్లోబల్ వార్మింగ్ పరిస్థితుల కారణంగా నాలుగేళ్లుగా అరేబియా సముద్రంలో అల్పపీడనాలు, తుఫాన్‌లు ఎక్కువగా ఏర్పడుతున్నాయని పరిశోధకులు చెబుతున్నారు.



జీవితం.. ఉగాది పచ్చడి!

హైదరాబాద్, మార్చి 17:

ఉగాది పచ్చడిలాగే మన జీవితంలోనూ షడ్రుచులు ఉంటాయని ఉపరాష్ట్రతి వెంకయ్య నాయుడు అభిప్రాయపడ్డారు. షడ్రుచులను ఆస్వా దించినట్లే జీవితంలో జరగబోయే పరిణామాలను ఎదుర్కోవాలని ఉద్బోధించారు. రాజ్‌భవన్‌లో శనివారం నిర్వహించిన శ్రీవిళంబినామ సంవత్సర ఉగాది వేడుకలకు వెంకయ్యనాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. మన జీవితం, పండుగలు అంతా ప్రకృతితో ముడిపడి ఉన్నాయని, ప్రకృతితో మమేకమై జీవించడం భారతీయ సంస్కృతిలో భాగమని అన్నారు. ప్రస్తుతం మనమంతా ప్రకృతిని నిర్లక్ష్యం చేస్తూ ప్రమాదం కొనితెచ్చుకుంటున్నామన్నారు. సంప్ర దాయాన్ని, భాషను పరిరక్షించుకోవడం మన బా ధ్యతని సూచించారు. తెలుగు భాష పరిరక్షణకు సీఎం కేసీఆర్ తీసుకుంటున్న చర్యలు అభినం దనీయమని ప్రశంసించారు. ప్రస్తుత తరానికి తెలుగు నెలలు, సంవత్సరాల పేర్లు, నక్షత్రాల పేర్లు తెలియడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గవర్నర్ నరసింహన్ మాట్లాడుతూ.. శ్రీవిళం బినామ సంవత్సరంలో అంతా మంచే జరుగుతుందని ఆశిస్తున్నానని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ మాట్లాడుతూ.. ఏదో ఒక సంవత్సరమే అనికాకుండా ప్రతి ఏడాదీ నిష్ఠతో ఉగాది వేడు కలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొ న్నారు. ఇది వరకు ఎప్పుడూ ఇలా రాజభవన్‌లో పండుగ జరగలేదని, నరసింహన్ వచ్చాకే కొత్త సంప్రదాయానికి శ్రీకారం చుట్టారని కేసీఆర్ చెప్పారు. మన పండుగ మన గౌరవాన్ని ఇనుమడింపు చేస్తున్న గవర్నర్‌కు ధన్యవాదాలు తెలుపుతున్నానని చెప్పారు. '' కాలం జరుగుతూనే ఉంటుంది. కొంత మంచి వస్తుంటుంది.. ఇం కొంత చెడు వస్తుంటుంది. అన్నింటినీ సహిస్తూ, అన్నింటినీ భరిస్తూ.. ఆనందాన్ని ఆస్వాదిస్తూ.. దు:ఖాన్ని దిగమింగుతూ ముందుకు సాగేదే జీవితం. మనదేశంలో అనేక భాషలు, సంస్కృతులు ఉన్నప్పటికీ అందరూ ఈ పండుగను చాలా ఘనంగా జరుపుకుంటారు. ముఖ్యంగా మన తెలుగువారు ఈ పండుగను చాలా గొప్పగా జరుపుకోవటం.. పచ్చటి స్వీకరించడం అందులోనే మంచి, చెడు అనే రెండు అర్థాలున్నాయని..ఆ రోజు ఆస్వాదించడం జరుగుతుంది. అందులోని పులుపు, వగరు, తీపిలాగా జీవితం కూడా ఇదేలా ఉంటుందనే సందేశాన్ని అందులో నుంచే అంతర్లీనంగా తీసుకోవడం.. ఇలా పరంపరగా మన తెలుగు సంవత్సర వేడుకలు జరుపుకుంటున్నాం'' అని కేసీఆర్ ప్రసంగించారు.

నిదురమ్మా.. రావే!



(మూడోపేజీ తరువాయి)

ఇప్పుడు మనవాళ్లకు వస్తున్నాయి. ఎందుకంటే.. నిద్ర లేదు! ఆసుపత్రులకు పదిమంది రోగులు వస్తే.. వాళ్లలో కనీసం ఐదుగురు నిద్రలేమితోనే బాధపడుతున్నారట!!

నగరాల్లో చాలామందిని వేధిస్తున్న ప్రధాన సమస్య.. నిద్రలేమి. వివిధ రకాల సమస్యలతో ఆసుపత్రులకు వెళ్తున్న రోగులలో సగం మందికి పైగా నిద్రలేమితో కూడా బాధపడుతున్నారు. యువత నుంచి మధ్యవయస్కుల వరకు అందరికీ ఈ సమస్య ఎదురవుతోంది. స్మార్ట్‌ఫోన్ల వాడకం, సిగరెట్లు అతిగా కాల్చడం, మద్యపానం.. వీటన్నింటితో పాటు వేళాపాళా లేని పనిసమయాలు కూడా నిద్ర సరిగా పట్టకపోవడానికి ప్రధాన కారణాలని వైద్యులు చెబుతున్నారు. గుండెజబ్బులు ఉన్నవారితో పాటు అవి లేనివారికి కూడా చాలామందికి నిద్రలేమి సమస్య ఉంటోందని వైద్యనిపుణులు చెబుతున్నారు. ఏ సమస్యతో ఆసుపత్రికి వచ్చినా.. అలా వచ్చేవారిలో సగం మందికి పైగా తమకు సరిగా నిద్ర పట్టడం లేదని వాపోతున్నారట. రాత్రిపూట సరిగా నిద్రపోకపోతే ఏకాగ్రత తగ్గడంతో పాటు పనిసామర్థ్యం కూడా గణనీయగా పడిపోతుందని వైద్యులు అంటున్నారు. అంతేకాదు.. దానివల్ల కూడా రకరకాల ఆరోగ్య సమస్యలతో పాటు గుండెజబ్బులు సైతం పెరిగే ప్రమాదముందట. 30-40 ఏళ్ల మధ్య వయసు వారిలో ఈ సమస్య సర్వసాధారణంగా కనిపిస్తుంటే, 40-50ల మధ్య మరీ ఎక్కువవుతోంది. వీళ్లతో పాటు యువత కూడా చాలావరకు పని ఒత్తిడి, స్మార్ట్‌ఫోన్ల వాడకం తదితర కారణాల వల్ల నిద్రలేమికి గురవుతున్నారు. రాత్రి నిద్రపట్టకపోవడం, ఎటూ నిద్ర పట్టలేదు కదాని ఫోన్ తీసుకుని చాటింగ్ మొదలుపెట్టారో.. ఇక అంతే! వచ్చే నిద్ర కూడా ఎగిరిపోతోంది.

పైపెచ్చు, స్క్రీన్ లైటింగ్ ముఖం మీద పడుతుండటం వల్ల వాళ్లతో పాటు వాళ్ల పక్కనున్నవాళ్లకు కూడా నిద్రాభంగం కలుగుతుంది. అందువల్ల నిద్రపట్టనపుడు ఫోన్ అసలు తీయొద్దని వైద్యులు చెబుతున్నారు. ఇక విదేశీ క్లయింట్లతో డీల్ చేసే సాఫ్ట్‌వేర్ నిపుణులది మరోరకం సమస్య. అక్కడకు, ఇక్కడకు సమయాలలో తేడాలు ఉండటం, క్లయింటు అక్కడి వారు అయినప్పుడు వాళ్లకు అనుకూలమైన సమయాల్లోనే మాట్లాడాల్సి ఉండటంతో అర్ధరాత్రి వరకు మెలకువగా ఉండాల్సి వస్తోంది. దాంతో నిద్ర పట్టే సమయానికి పడుకోకపోవడం, ఫలితంగా పడుకున్న తర్వాత నిద్రపట్టక పోవడం లాంటివి ఉంటున్నాయి.

టెలి మెడిసిన్ కోసం ఫోన్ చేసేవారిలో కూడా దాదాపు సగం మంది నుంచి నిద్రలేమికి సంబంధించిన ఫిర్యాదులే వస్తున్నాయట. తమకు వచ్చే ప్రతి పది కాల్స్‌లో కనీసం ఐదు నిద్రలేమివే ఉంటున్నాయని డాక్‌ఆన్‌లైన్‌లో జనరల్ ఫిజీషియన్, కన్సల్టెంటు డాక్టర్ సింధూర తెలిపారు. తొలుత నిద్రకు సంబంధించిన సమస్యతో ఫోన్ చేయకపోయినా, తర్వాత ఇతర సమస్యలతో పాటు దాన్ని కూడా చెబుతున్నారన్నారు. ఉదాహరణకు ఒక పేషెంటు గొంతు నొప్పిగా ఉందని కాల్ చేస్తారని, తర్వాత కొన్ని నెలలుగా సరిగా నిద్రపట్టడం లేదంటారని ఆమె వివరించారు.

> **ఏం చేయాలి.. కూడదు?**
>
> - ☑ మధ్యాహ్నం 3 గంటల తర్వాత కాఫీ తాగకూడదు
> - ☑ నిద్రపోయే సమయం, లేచే సమయాలను పక్కాగా నిర్వహించాలి
> - ☑ ప్రతిరోజూ కనీసం 30 నిమిషాల వ్యాయామం చేయాలి
> - ☑ రాత్రిపూట ఎక్కువగా ఆహారం తీసుకోకూడదు
> - ☑ మసాలాలు ఎక్కువగా ఉండేవి రాత్రి తినకూడదు
> - ☑ ధూమపానం, మద్యపానాలను చాలావరకు తగ్గించాలి

ధ్యానంతో చెక్

నిద్రలేమి సమస్య అత్యంత తీవ్రంగా ఉన్నవారికి కూడా ధ్యానం, యోగాతో చాలావరకు సమస్య పరిష్కారం అవుతుంది. దీని ద్వారా ఆందోళన, ఉద్రిక్తత, ఒత్తిడి లాంటివి కూడా తగ్గుతాయని పరిశోధనలలో తేలింది. మందులు వాడినా తగ్గని ఈ సమస్య చాలామందికి యోగా, ధ్యానంతో తగ్గిందట. ఈ విషయం అమెరికాలోని వెల్‌స్పాన్ యార్క్ ఆసుపత్రి వర్గాలు చేసిన పరిశోధనలో తేలింది. ఇన్సోమ్నియా సివియారిటీ ఇండెక్స్ (ఐఎస్‌ఐ) యోగా, ధ్యానం చేయకముందు 20.6 పాయింట్లు ఉంటే, ఆ తర్వాత అది 10.8కు పడిపోయింది. మనిషి మూడ్, జ్ఞాపకశక్తి, పనితీరు.. వీటన్నింటికీ నిద్ర చాలా చాలా అవసరమని, రాత్రిపూట నిద్ర సరిగా లేకపోవడం.. అది కూడా కొన్నాళ్ల పాటు అలాగే ఉండటం వల్ల పగలు సమయంలో అప్రమత్తత, జ్ఞాపకశక్తి బాగా పడిపోతాయని పరిశోధకులు చెప్పారు. ఇలాంటి సమస్యలతో బాధపడే చాలామందికి ధ్యానంతో మంచి ఫలితాలు వచ్చాయన్నారు.

నిద్ర లేకపోవడం వల్ల మెదడుకు కావల్సిన విశ్రాంతి లేకుండా పోతుంది. శరీరానికి విశ్రాంతి ఉన్నా.. మెదడుకు మాత్రం ఉండదు.

ఒత్తిడి కారణంగా నిద్ర సరిగా పట్టదు. అలాంటి సమయంలో మెదడుకు యోగా, ధ్యానాల ద్వారా శిక్షణ ఇస్తే చాలా ఫలితం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. నిద్రపోయేటపుడు గుండె కొట్టుకునే వేగం తగ్గుతుంది, రక్తపోటు తగ్గుతుంది, శ్వాస తీసుకునే వేగం కూడా తగ్గుతుంది.

దేశాన్ని బీజేపీ చీలుస్తోంది



- విద్వేషాన్ని, అసహనాన్ని వ్యాప్తి చేస్తోంది
- దేశాన్ని, ప్రజలను ఏకం చేసేది కాంగ్రెస్సే
- బీజేపీ పాలనతో దేశం అలసిపోయింది
- దేశానికి కొత్త దిశానిర్దేశం కావాలి
- అభివృద్ధి బాటలో తీసుకెళ్లేది మనమే
- బీజేపీని ఓడించేది ఒక్క కాంగ్రెస్సే
- అది.. ఇంకెవరి వల్లా సాధ్యం కాదు
- కాంగ్రెస్‌లో అనైక్యత పార్టీకి నష్టం
- సీనియర్, యువ నేతలు కలిసిసాగాలి
- కాంగ్రెస్ ప్లీనరీలో రాహుల్ ప్రసంగం

న్యూఢిల్లీ, మార్చి 17: కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం దేశవ్యాప్తంగా విద్వేషాన్ని, అసహనాన్ని వ్యాప్తి చేస్తోందని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ఆరోపించారు. కాంగ్రెస్ మాత్రమే ప్రేమ, మైత్రి, సౌభ్రాతృత్వాన్ని వ్యాపింప చేయగలదని అన్నారు. అధికార బీజేపీకి, కాంగ్రెస్ మధ్య ఉన్న తేడా ఇదేనని పేర్కొన్నారు. ఢిల్లీలో జరుగుతున్న పార్టీ 84వ ప్లీనరీలో శనివారం అధ్యక్ష హోదాలో తొలిసారి రాహుల్ ప్రసంగించారు. కాంగ్రెస్ పార్టీ మాత్రమే దేశాన్ని ఐక్యంగా ఉంచగలదని, దేశాన్ని అభివృద్ధిపథంలో తీసుకెళ్లగలదని రాహుల్ అభిప్రాయపడ్డారు. బీజేపీ విద్వేషాన్ని నింపితే, కాంగ్రెస్ ప్రేమను పంచుతుందని అని చెప్పారు. ఇదే విధానాన్ని పార్టీ కార్యకర్తలు పాటించాలని ఉద్బోధించారు. ఈ దేశం అందరిదన్న అభిప్రాయాన్ని వినిపించాలన్నారు. అందరి లాభం కోసమే కాంగ్రెస్ ఏదైనా చేస్తుందన్నారు. బీజేపీ పాలనతో దేశం చాలా అలసిపోయిందని, ఓ కొత్త దిశానిర్దేశం కావాలని, కాంగ్రెస్ పార్టీ మాత్రమే దేశాన్ని మునుముందుకు తీసుకువెళ్లగలదని రాహుల్ అన్నారు.. ప్రస్తుతం ఎక్కడ చూసినా కోపతాపాలు, విభజనవాదమే కనిపిస్తున్నదని, ఈ పరిస్థితులను మార్చి, మళ్లీ దేశాన్ని ఒక్కటిగా చేయాల్సిన బాధ్యత పార్టీ కార్యకర్తలపైనే ఉందన్నారు. తన హయాంలో కాంగ్రెస్‌లోని సీనియర్లు, యువతకు సమ ప్రాధాన్యం లభిస్తుందని ఉద్ఘాటించారు. పార్టీ పెద్దల మద్దతు లేకుండా యువత పార్టీని ముందుకు నడిపించలేదని, వారిద్దరినీ ఏకం చేసే ప్రధాన కర్తవ్యం తనముందు ఉందని అన్నారు. పార్టీ నేతలు సోనియాగాంధీ, మన్మోహన్, పి.చిదంబరం, తదితరులు పార్టీని కంటికి రెప్పలా కాపాడారని ప్రశంసించారు. ప్లీనరీకి హాజరైన సీనియర్ నేతలంతా కాంగ్రెస్ పార్టీ కోసం పోరాటం సాగించిన వారేనని, పార్టీ పరిరక్షణకు వారు చేసిన సేవలు, పోరాటానికి హృదయ పూర్వక ధన్యవాదాలు తెలుపుకొంటున్నానని అన్నారు. ''ప్రస్తుతం కోట్లాది మంది యువత మోదీ వైపు చూస్తున్నారు. కానీ.. తమకు ఉద్యోగ అవకాశాలు కల్పించట్లేదని వారు గ్రహించారు. మోదీ పాలనతో దేశం అలసిపోయింది. కాంగ్రెస్ పార్టీ కొత్త దిశానిర్దేశం చేయాల్సిన అవసరం ఉంది'' అని రాహుల్ పేర్కొన్నారు. కుల, మతం, వర్గం తేడా లేకుండా ఈ దేశం అన్ని వర్గాలకు చెందినదని, అలాగే కాంగ్రెస్ కూడా అన్ని వర్గాలకు చెందినదని, ఎవరినీ పట్టించుకోకుండా ఉండబోదని చెప్పారు. ''పార్టీ నేతలు ఐక్యతతో ఉంటే కాంగ్రెస్‌ను ఓడించడం ఎవరి తరమూ కాదు. బీజేపీని ఓడించేది ఒక్క కాంగ్రెస్సే. ఇంకెవరి వల్లా కాదు'' అని పేర్కొన్నారు.

ఇక.. 'రాహుల్‌గాంధీ' ట్విటర్!

కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఎట్టకేలకు తన ట్విటర్ అకౌంట్ పేరు మార్చేశారు. సోషల్ మీడియా నుంచి భారీ ఎత్తున్న విమర్శలు వెల్లువెత్తిన తర్వాత రాహుల్ ఇక చివరికి ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటి వరకు 'ఆఫీస్‌ఆఫ్‌ఆర్‌జీ'గా ఉన్న తన ట్విటర్ పేరును, ఇక నుంచి సాదాసీదాగా 'రాహుల్‌గాంధీ' అని పెట్టుకున్నారు.


పార్టీ పటిష్టతపై ప్లీనరీ దృష్టి

వచ్చే ఏడాది సార్వత్రిక ఎన్నికలు జరగనుండటంతో ప్లీనరీ నుంచి శ్రేణులకు రాహుల్ దిశానిర్దేశనం చేయనున్నారు.. రైతాంగం స్థితిగతులు, ఆర్థిక, పారిశ్రామిక విధానం, విదేశీ వ్యవహారాలు, ఉపాధి తదితర అంశాలపై తీర్మానాలను ప్లీనరీ ఆమోదించనుంది.



బ్యాలెట్ పేపర్లే కావాలి

ఎన్నికల కోసం బ్యాలెట్ పేపర్లే అత్యుత్తమమైనవని కాంగ్రెస్ అభిప్రాయపడింది. ఎన్నికల్లో ఈవీఎంలను వాడొద్దని, బ్యాలెట్ పేపర్లే వాడాలంటూ పార్టీ ప్లీనరీలో లోక్‌సభ పక్షనేత మల్లికార్జున ఖర్గే తీర్మానాన్ని ప్రవేశపెట్టగా ఆమోదం లభించింది. బ్యాలెట్ పేపర్లతోనే ఎన్నికల సరళిపై విశ్వసనీయత పెరుగుతుందని, ఈవీఎంలను దుర్వినియోగం చేస్తున్నారని ఆ తీర్మానంలో కాంగ్రెస్ అభిప్రాయపడింది. ఏకకాలంలో పార్లమెంట్, అసెంబ్లీలకు ఎన్నికలు నిర్వహించాలని బీజేపీ చేస్తున్న ప్రయత్నాలను కూడా కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకించింది. ఏకకాలంలో దేశవ్యాప్తంగా ఎన్నికలు నిర్వహించడం వల్ల అనేక సమస్యలు వస్తాయని కాంగ్రెస్ పార్టీ పేర్కొన్నది. ఆ అంశాన్ని మరింత సునిశితంగా పరిశీలించాలని ఆ పార్టీ అభిప్రాయపడింది.





మోదీవి బూటక హామీలు

- ఆ నినాదాలు ఎన్నికల గిమ్మిక్కులు: సోనియా

న్యూఢిల్లీ, మార్చి 17: గత సార్వత్రిక ఎన్నికలకు ముందు అవినీతి అంతం, సమ్మిళిత వృద్ధి తదితర అంశాలపై ప్రధాని నరేంద్రమోదీ ఇచ్చిన హామీలన్నీ ఒట్టి బూటకమని తేలిపోయిందని కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ పేర్కొన్నారు. ఎన్నికల్లో విజయం కోసం చేసిన గిమ్మిక్కులని ధ్వజమెత్తారు. పార్టీ ప్లీనరీలో ఆమె మాట్లాడుతూ.. నరేంద్రమోదీపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ''సబ్ కా సాథ్.. సబ్ కా వికాస్'', ''న ఖానూంగా.. న ఖానే దూంగా'' అని మోదీ ఇచ్చిన నినాదాలు ఉట్టి నీటమూటలేనని తేలిపోయిందని అన్నారు. బీజేపీ వైఖరితో ప్రస్తుతం ప్రజల్లో అధికారమంటే భయం నెలకొందని, దాని నుంచి ప్రజలకు విముక్తి కలిగించాల్సిన అవసరం ఉందన్నారు. బీజేపీ పాలనలో పెరిగిపోతున్న వివక్ష, క్షుద్ర రాజకీయాలు, దురహంకారానికి వ్యతిరేకంగా కార్యకర్తలు పోరాడాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్‌ను తిరిగి అధికారంలోకి తెచ్చేందుకు ప్రతి కార్యకర్తా కృషి చేయాలని ఉద్బోధించారు. ''కాంగ్రెస్ విజయం.. ఇండియా విజయం. 2019లో కాంగ్రెస్ పునరుద్ధరణ జరిగితీరుతుంది'' అని సోనియా పేర్కొన్నారు. కాంగ్రెస్ ఎప్పటికీ బీజేపీకి తలవంచే ప్రసక్తే లేదన్నారు. రాహుల్ వెంటే కాంగ్రెస్ ఉంటుందని, 2019 ఎజెండాను మనం రూపొందించాల్సి అవసరం ఉందని చెప్పారు. రెండు దశాబ్దాల పాటు పార్టీ అధ్యక్షురాలిగా తనకు సహకరించిన వారందరికీ సోనియా ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. దేశ ఆర్థిక వ్యవస్థకు మన్మోహన్ జీ మార్గదర్శకం వహించారని, యూపీఏ పాలనలో ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి ప్రజలకు మరింత చేరువయ్యామని అన్నారు.



చైనా అధ్యక్షుడిగా తిరిగి జిన్‌పింగ్

- ఉపాధ్యక్షుడిగా వాంగ్.. పార్లమెంట్ ఆమోదం

బీజింగ్, మార్చి 17: చైనా అధ్యక్షుడిగా జిన్‌పింగ్ రెండోసారి తిరిగి ఎన్నికయ్యారు. ఆ దేశ రాజ్యాంగంలో అధ్యక్షుడు రెండు పర్యాయాలు మాత్రమే పదవిలో ఉండే నిబంధనను ఎత్తేస్తూ ఇటీవల చైనా పార్లమెంటు సంచలన నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. దీంతో రెండో పర్యాయం అధ్యక్షుడిగా ఎన్నికైన జిన్ పింగ్ అయిదేళ్ల పదవీకాలం ముగిసిన తర్వాత కూడా అధ్యక్షుడిగా కొనసాగేందుకు అవకాశం వచ్చింది. చైనా పూర్తి సైన్యానికి హైకమాండ్‌గా వ్యవహరించే అత్యంత శక్తివంతమైన సెంట్రల్ మిలిటరీ కమిషన్ అధినేతగా కూడా జిన్‌పింగ్ ఎంపికయ్యారు. వాంగ్ చైనా ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. కొత్త ప్రభుత్వంలో ప్రధాని లీ కెకియాంగ్ మినహా ఉన్నత స్థాయి అధికారులను, మంత్రిమండలిని, అక్కడి సెంట్రల్ బ్యాంకు గవర్నర్‌ను మార్చేయనున్నారు.



లీటర్ నీళ్లు.. 5 పైసలు

- త్వరలో ప్రజలకు పంపిణీ
- సముద్రం నుంచి శుద్ధినీరు.. తాగునీటిగా మార్చే ప్రక్రియ
- తమిళనాడులో ట్రయల్స్ షురూ: నితిన్ గడ్కరీ


భోపాల్, మార్చి 17: దేశ వ్యాప్తంగా తాగునీటి సమస్యలను తీర్చడానికి కేంద్ర ప్రభుత్వం దృష్టిసారిస్తోంది. సముద్ర జలాలను శుద్ధి చేసి తాగునీటిని 5 పైసలుకే లీటర్ చొప్పన అందజేస్తామని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ చెప్పారు. దేశ ప్రజలకు త్వరలోనే సముద్ర శుద్ధి జలాలను సరఫరా చేస్తామని వెల్లడించారు. తమిళనాడులోని టుటికొరిన్‌లో సముద్ర జలాలను శుద్ధి చేసి తాగునీటిగా మార్చే ప్రక్రియను ప్రయోగాత్మకంగా ప్రారంభించామని తెలిపారు. భోపాల్‌లో జరుగుతున్న రెండు రోజుల నదీ మహోత్సవం సదస్సులో గడ్కరీ ప్రసంగించారు. కొన్ని రాష్ట్రాలకు నదీ జలాల పంపిణీ కోసం ఘర్షణ పడుతున్నాయని, కాగా నదీ జలాలు పాకిస్థాన్‌కు వెళ్తున్న విషయాన్ని ఎవరూ పట్టించుకోవడం లేదని అన్నారు. పాకిస్థాన్‌తో భారత్ 6 నదులను పంచుకుంటోందని తెలిపారు. ''మూడు నదుల నుంచి జలాలు పాకిస్థాన్‌లోకి ప్రవహిస్తున్నాయి. నిలుపుదల చేయాలని ఏ వార్త పత్రికా రాయదు. ఏ ఎమ్మెల్యే కూడా డిమాండ్ చేయరు?'' అని గడ్కరీ అన్నారు.

పంటకు మద్దతు ధర

- ఉత్పత్తి వ్యయానికి 1.5 రెట్లు
- రాష్ట్రాలతో కేంద్రం చర్చలు
- పంటలను తగులబెట్టొద్దు
- రైతన్నలను ఆదుకుంటాం
- కృషి ఉన్నతి మేళాలో మోదీ



న్యూఢిల్లీ, మార్చి 17: పంట ఉత్పత్తి వ్యయానికి కనీసం 1.5 రెట్లు మద్దతు ధరను కల్పించి రైతులను ఆదుకుంటామని ప్రధాని నరేంద్ర మోదీ హామీ ఇచ్చారు. రైతులు మద్దతు ధరతో ప్రయోజనం పొందేందుకు రాష్ట్రాలతో చర్చిస్తున్నామని పేర్కొన్నారు. మద్దతు ధరపై చాలామంది పుకార్లు ప్రచారం చేస్తున్నారని, ఇది గందరగోళ వాతావరణాన్ని సృష్టిస్తోందని అన్నారు. వివిధ పంటలకు మద్దతు ధర నిర్ణయించడం వల్ల 2022 నాటికి రైతుల ఆదాయం రెట్టింపు కావడానికి దోహదం చేస్తుందని చెప్పారు. ఢిల్లీలో జరిగిన కృషి ఉన్నతి మేళా 2018 సదస్సులో ప్రధాని మోదీ పాల్గొన్నారు. విదేశాల నుంచి వంట నూనెలను దిగుమతి చేసుకోవడాన్ని తగ్గించాలని, ఇందుకోసం రైతులు నూనె విత్తనాల సాగును పెంచాలని కోరారు. అలాగే యూరియా వాడకాన్ని తగ్గించాలని, 2022 నాటికి కనీసం సగం తగ్గించాలని సూచించారు. పంటలను తగలబెట్టే పద్ధతిని మానుకోవాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. పంటలను తగులబెట్టడం వల్ల పోషకాలు బూడిద అవుతాయని, వాతావరణ్యం కాలుష్యం అవుతుందని, భూసారం తగ్గుతుందని మోదీ అన్నారు. దీని నివారణకు తమ ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతున్నదని ఆయన తెలిపారు. పంట కోత తర్వాత మిగిలిన కొయ్యలను తగలబెట్టే సంస్కృతి మంచిదికాదని అన్నారు. వ్యవసాయ పనిముట్లు కొనుగోలు చేసేందుకు తమ ప్రభుత్వం ఆర్థిక సాయం చేస్తున్నదని, పర్యావరణం స్వచ్ఛతగా ఉంటేనే, పంట పచ్చగా ఉంటుందన్నారు. వ్యవసాయం రంగం ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించడానికి కేంద్రం కృషి చేస్తోందని చెప్పారు. వ్యవసాయ మార్కెటింగ్‌లో సంస్కరణలు తీసుకురావడం వల్ల రైతుల ఆదాయం పెంచుతామని తెలిపారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించడానికి, అవసరమైన విద్యుత్ సరఫరా చేయడానికి, ధాన్యాన్ని విక్రయించడంలో ఎలాంటి సమస్యలు ఎదురుకాకుండా ఉండటానికి, తగిన ధరలు కల్పించడానికి కేంద్రం రాత్రి పగలు పని చేస్తోందని మోదీ చెప్పారు. ఈ సందర్భంగా జైవిక్ ఖేటి పోర్టల్‌ను ఆవిష్కరించారు. అలాగే కృషి విజ్ఞాన్ కేంద్రాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కృషి కర్మన్ అవార్డును, పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ కృషి విజ్ఞాన్ ప్రోత్సహ పురస్కారాలను ప్రధాని అందజేశారు. ఈ సదస్సులో కేంద్ర ప్రభుత్వం 800 స్టాల్స్ ఏర్పాటు చేసింది. అలాగే రాష్ట్ర ప్రభుత్వాలు, వివిధ సంస్థలు స్టాల్స్‌ను ప్రదర్శనకు ఉంచాయి. మైక్రో ఇరిగేషన్, యూరియా వాడకం తగ్గింపు, భూసార పరీక్షలు/భూసార హెల్త్ కార్డులు పంపిణీ, ఫెర్టిలైజర్లను వీలైనంత వరకూ వాడకపోవడం వల్ల వ్యయాన్ని తగ్గించడం, పంటల బీమా కల్పించడం వంటి చర్యల ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచడంతో పాటు అదనపు ఆదాయాన్ని సమకూర్చేందుకు పాడి, కోళ్ల పరిశ్రమను ప్రోత్సహించడంపై ఈ సదస్సులో చర్చించారు.





మాజీ సీఎం హంతకుడికి జీవితఖైదు

- పశ్చాత్తాపం లేదన్న జగ్‌తార్ సింగ్ తారా
- సిక్కుల స్వాతంత్ర్యం కోసం యుద్ధం
- తనను యుద్ధ ఖైదీలా చూడాలని వినతి

న్యూఢిల్లీ, మార్చి 17: పంజాబ్ మాజీ ముఖ్యమంత్రి బియాంత్ సింగ్ హత్య కేసులో దోషిగా తేలిన జగతార్ సింగ్ తారాకు జీవితఖైదు పడింది. తాను చేసిన పనికి ఏమాత్రం పశ్చాత్తాప పడటం ఏదని, దేశంలో సిక్కుల స్వాతంత్ర్యం కోసం తాను యుద్ధం చేస్తూనే ఉంటానని అంతకుముందు తారా చెప్పాడు. ఒక క్రూరుడిని చంపి వేలాది మంది అమాయక ప్రజలను కాపాడితే అది తప్పు కానే కాదని తన న్యాయవాది సిమ్రన్‌జిత్ సింగ్ ద్వారా కోర్టుకు తెలిపాడు. కోర్టులో వాదనలు జరుగుతున్నంత సేపు కోర్టు బయట ఖలిస్థాన్ అనుకూల నినాదాలు మార్మోగుతూనే ఉన్నాయి. అదనపు జిల్లా, సెషన్స్ జడ్జి జేఎస్ సిద్ధూ ఈ కేసును విచారించి, ఖలిస్థాన్ అనుకూల ఉగ్రవాది అయిన తారాను దోషిగా నిర్ధారించిన ఒక రోజు తర్వాత శిక్ష గురించి తీర్పు చెప్పారు. కోర్టుకు సమర్పించిన ఆరు పేజీల లేఖలో తారా తన నేరాన్ని అంగీకరించాడు. తనను యుద్ధఖైదీలా చూడాలని అతడు కోర్టును కోరాడు. ఆక్రమిత సిక్కు రాజ్యానికి స్వాతంత్ర్యం రప్పించడానికి పోరాడుతున్న సిక్కు దేశస్తుడినని తనను తాను చెప్పుకొన్నాడు. 1995 ఆగస్టు 31వ తేదీన నాటి పంజాబ్ ముఖ్యమంత్రి బియాంత్ సింగ్ చండీగఢ్‌లోని సచివాలయం వెలుపల జరిగిన బాంబు పేలుడులో మరణించారు. ఆ ఘటనలో పంజాబ్ పోలీసు ఉద్యోగి దిలావర్ సింగ్ మానవబాంబుగా పనిచేశాడు.

ఎప్పటికీ కశ్మీర్ మనదే




- అవసరమైతే దళాలు సరిహద్దు దాటుతాయి
- స్నేహం కోరుతుంటే పాక్ అడ్డుపుల్ల వేస్తోంది
- కేంద్ర హోం శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

న్యూఢిల్లీ, మార్చి 17: ప్రపంచంలోని ఏ శక్తి భారత్ నుంచి కశ్మీర్‌ను వేరు చేయలేదని కేంద్ర హోం శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. దేశ సమగ్రతను రక్షించేందుకు అవసరమైతే భారత దళాలు సరిహద్దును దాటేందుకు కూడా సిద్ధమేనని ఆయన చెప్పారు. ఢిల్లీలో జరిగిన రైజింగ్ ఇండియా సమ్మిట్‌లో రాజ్‌నాథ్ సింగ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అప్పుడు, ఇప్పుడు, ఎప్పటికీ కశ్మీర్ మనదేనని, మన దగ్గరి నుంచి ఏ ఒక్కరూ తీసుకుపోలేరని అన్నారు. అంతేకాక భారత సైన్యంపై ప్రశంసలు కురిపించారు. అంతర్గతంగా దేశానికి భద్రతను కల్పించడం మాత్రమే కాదు, దేశ రక్షణకు అవసరమనుకుంటే సరిహద్దు దాట డానికి భారత్ సిద్ధంగా ఉందని రాజ్‌నాథ్ పేర్కొన్నారు. పాకిస్థాన్‌తో మంచి సంబంధాలు కొనసాగించాలని భారత్ కోరుకుంటోందని.. అయితే పాక్ ఉగ్రవాదులకు చేస్తున్న సాయాన్ని ఆపితేనే అది జరుగుతుందన్నారు. ప్రస్తుతం పాకిస్థాన్ చర్యలను అమెరికా కూడా ఖండిస్తోంది. పాక్‌కు ఏం జరుగుతుందో మాత్రం నాకు తెలియదు. స్నేహపూర్వక సంబంధాలు కొనసాగిద్దామని తాము చేసిన ప్రతిపాదనలను పాక్ నిరాకరిస్తోందని రాజ్‌నాథ్ వెల్లడించారు. కశ్మీర్ సమస్యకు శాశ్వత పరిష్కారం కనుగొనేందుకు ఏం చేయడానికైనా భారత్ సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. కశ్మీర్ అంశం పరిష్కారానికి అక్కడి వారితో చర్చలు జరపడానికి ప్రత్యేక ప్రతినిధి దినేశ్వర్ శర్మను కేంద్ర ప్రభుత్వం నియమించిందని ఆయన చెప్పారు. దాయాది దేశంతో సత్సంబంధాలనే కోరుకుంటున్నామని.. కానీ ఆ దేశం అడ్డుపుల్లలు వేస్తోందన్నారు. స్నేహితులు మారతారు.. కానీ పొరుగుదేశాలు మారవని అటల్ బిహారీ వాజ్‌పేయ్ అనే వారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. మనం పొరుగు దేశాలతో బాగుండాలనే అనుకుంటాం. కానీ పాకిస్థాన్ మాత్రం ఇరు దేశాల మధ్య సంబంధాలు మెరుగుపడేలా చేసేందుకు ఏ మాత్రం ప్రయత్నించదని ఆయన పేర్కొన్నారు. ఉగ్రవాదుల నియంత్రణకు పాక్ ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని దుయ్యబట్టారు. అంతర్జాతీయ ఉగ్రవాదిగా పేరొందిన వ్యక్తి రాజకీయ పార్టీ ప్రారంభిస్తే, ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆ దేశం అంగీకరించిందన్నారు. అంతేకాకుండా హక్కానీ నెట్‌వర్క్‌కు ఆ దేశం సహాయం చేస్తోందని ఆరోపించారు. ఇరు దేశాల మధ్య శాంతిపూర్వకమైన వాతావరణం కోసం ప్రధాని నరేంద్ర మోదీ పలుమార్లు ప్రయత్నించారని, వాటిని పాక్ అడ్డుకుంటూ వచ్చిందని రాజ్‌నాథ్ అన్నారు.


దక్షిణాది రాష్ట్రాలతో 'ద్రవిడ నాడు'!

- భవిష్యత్తులో ఇది సాధ్యమే: స్టాలిన్
- టీడీపీ అవిశ్వాసానికి మద్దతివ్వాలి
- అన్నాడీఎంకేకు ఆయన డిమాండ్



చెన్నై, మార్చి 17: దక్షిణాది రాష్ట్రాలన్నీ కలిసి 'ద్రవిడ నాడు' కోసం డిమాండ్ వస్తే దాన్ని స్వాగతిస్తామని డీఎంకే కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ సంచలన చెప్పారు. స్వయం ప్రతిపత్తితో కూడిన ద్రవిడ దేశం కోసం భవిష్యత్తులో ఈ తరహా డిమాండ్ సాధ్యమేనని తాను భావిస్తున్నట్లు వ్యాఖ్యానించారు. తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, కేరళ రాష్ట్రాలతో పాటు కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరి ఏకమవ్వాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. తమిళనాడులోని ఈరోడ్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా విలేకర్లు అడిగిన ప్రశ్నకు స్టాలిన్ పైవిధంగా స్పందించారు. దక్షిణాది రాష్ట్రాలపై కేంద్రం చిన్నచూపు చూస్తోందని పలువురు దక్షిణాది రాష్ట్రాల నేతలు ఆరోపిస్తున్న నేపథ్యంలో స్టాలిన్ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఇదిలా ఉండగా, లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వంపై టీడీపీ ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానానికి సోమవారం అన్నాడీఎంకే మద్దతివ్వాలని స్టాలిన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ పార్టీ నేత, తమిళనాడు సీఎం పళనిస్వామికి ఆయన లేఖ రాశారు. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అన్యాయాన్ని నిలదీసేందుకు దక్షిణాది పార్టీలన్నీ ఏకంకావాలని స్టాలిన్ పిలుపునిచ్చారు.

'పోలింగ్‌కు రెడీ అయినట్టున్నారుగా?' అని ప్రశ్నిస్తే.. 'అవునండీ.. (నవ్వుతూ) ఈ నెల 23న పోలింగ్ ఉంటుంది. అదే రోజున రిజల్ట్ కూడా ఉంటుంది' అని అంటున్నారు నందమూరి కల్యాణ్ రామ్. ఈయన కథానాయకుడు నటించిన చిత్రం 'ఎం.ఎల్.ఎ' (మంచి లక్షణాలున్న అబ్బాయి). కాజల్ అగర్వాల్ హీరోయిన్. టి.జి.విశ్వప్రసాద్ సమర్పణలో కిరణ్ రెడ్డి, భరత్ చౌదరి ఈ చిత్రాన్ని నిర్మించారు. ఉపేంద్ర మాధవ్ దర్శకుడు. ఈ సినిమా మార్చి 23న విడుదలవుతుంది. ఈ సందర్భంగా చిత్ర కథానాయకుడు కల్యాణ్ రామ్ ఇంటర్వ్యూ...



క్యారెక్టర్ గురించి...

మంచి లక్షణాలు అని సినిమాలో పర్టిక్యులర్‌గా ఏ డెఫినిషన్ లేదు. సినిమాలో హీరో ఓ మంచి పని చేస్తాడు. కొన్ని రోజుల తర్వాత తను చేసింది తప్పు అని తెలుస్తుంది. దాంతో ఆ తప్పును తను ఎలా సరిదిద్దుకున్నాడనేదే కథ. సినిమా లవ్‌స్టోరీతో స్టార్ట్ అవుతుంది. సెకండాఫ్‌లో రాజకీయాల గురించి ప్రస్తావన ఉంటుంది.. కొన్ని డైలాగ్స్ కూడా ఉంటాయి. కానీ.. పొలిటికల్ డ్రామా సినిమాలో ఉండదు. గ్రామంలోని ఓ సమస్యపై హీరో ఎలా పోరాటం చేశాడు, ప్రజలను ఎలా మోటివేట్ చేశాడనేదే సినిమా.

ప్రత్యేకమైన శ్రద్ధ..

నిజం చెప్పాలంటే పూరిగారి 'ఇజం' సినిమాలో నటించడం వల్ల నటుడిగా ఓపెన్ అయ్యాను. ఇక 'ఎం.ఎల్.ఎ' సినిమా విషయానికి వస్తే.. డైలాగ్స్ ఉచ్ఛారణలో డైరెక్టర్ ఉపేంద్ర మాధవ్ ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకున్నాడు. ఇందులో ఓ రిథమ్‌లో, కొత్తగా నా డైలాగ్ డెలివరీ ఉంటుంది. డైరెక్టర్ ఉపేంద్ర మాధవ్ బేసిక్‌గా రచయిత కావడం వల్ల మంచి డైలాగ్స్‌ను రాసుకున్నాడు. అలాగే డైలాగ్ డెలివరీ కూడా కొత్తగా ఉండేలా ముందుగానే ప్లాన్ చేసుకున్నాడు. రజనీకాంత్ స్టయిల్లో డైలాగ్ చెప్పించే ప్రయత్నం చేయించాడు.

'ఎం.ఎల్.ఎ' విషయానికి వస్తే.. పూర్తి కమర్షియల్ అంశాలతో నిండి ఉంటుంది. తర్వాత రాబోయే 'నా నువ్వే' .. లవ్ ఎంటర్‌టైనర్. ఓ హీరోగా నేను మంచి సినిమాలు చేశానా? లేదా? అనే చూసుకుంటాను. అంతే కానీ బాక్సాఫీస్ వద్ద ఎలాంటి ఫలితాన్ని రాబట్టుకుందనే దాని గురించి పెద్దగా ఆలోచించను. నటుడిగా కొత్త సినిమాలు చేయాలనేదే నా ప్రయత్నం. అందుకోసం బాగా కష్టపడుతున్నాను. ఈ ప్రయాణంలో కచ్చితంగా మంచి సక్సెస్‌ను సాధిస్తాననే నమ్మకం ఉంది.

రెండు పడవలపై ప్రయాణించలేను

– కల్యాణ్‌రామ్





అదే నా ప్రయత్నం..

'పటాస్' సినిమా కమర్షియల్‌గా మంచి సక్సెస్‌ను ఇవ్వడమే కాదు.. హీరోగా నాకున్న గుర్తింపు మరింత పెంచింది. తర్వాత వచ్చిన 'షేర్' సక్సెస్ కాలేదు. ఇక పూరిగారి 'ఇజం' కమర్షియల్‌గా సక్సెస్ సాధించకున్నా.. నటుడిగా ఎంతో సంతృప్తినిచ్చింది.

కథల ఎంపికలో...

ఎవరైనా కథ చెబితే..ఆ కథకు, నేను చేసిన ముందు చిత్రాలకు ఏదైనా పోలిక ఉందా? అని ఆలోచిస్తాను. అలాగే నా క్యారెక్టర్ ఎలా ఉందని కూడా ఆలోచిస్తాను. జయేంద్రగారు వచ్చి 'నా నువ్వే' కథ చెప్పినప్పుడు.. 'సార్ ఈ కథకు నేనెలా ఫిట్ అవుతానని అనుకుంటున్నారు' అని అడిగాను. ఆయన చాలా నమ్మకంగా చెప్పడంతో పాటు.. హీరో క్యారెక్టరైజేషన్ కొత్తగా ఉండటంతో సినిమా చేయడానికి అంగీకరించాను.

మల్టీస్టారర్ చేస్తాను...

సాయిధరమ్ తేజ్‌తో మల్టీస్టారర్ చేయాల్సింది కానీ.. మా ఇద్దరికీ కథ నచ్చకపోవడంతో కుదరలేదు. అయితే ఈ ఏడాది జూన్ లేదా జూలైలో మల్టీస్టారర్‌ను అనౌన్స్ చేయబోతున్నాను. అప్పుడే పూర్తి వివరాలు తెలియజేస్తాం.

నిర్మాతగా హ్యాపీ..

నిర్మాతగా నేను చాలా హ్యాపీగా ఉన్నాను. నా బ్యానర్‌లో వస్తున్న సినిమాలను చూసి ప్రేక్షకులు 'ఏదో కొత్తగా ట్రై చేశాడులే..' అని అనుకుంటారు కానీ.. 'చెత్త సినిమా చేశాడురా' అని అనుకోలేదు. ఇకపై అనుకోరు కూడా.

తారక్‌తో చర్చలు...

నాకు, తారక్‌కు మధ్య మా సినిమాలకు సంబంధించిన చర్చలే ఎక్కువగా జరుగుతుంటాయి. నా సినిమాలను చూసి తన అభిప్రాయాలను చెబుతుంటాడు తారక్. 'ఎం.ఎల్.ఎ' సినిమా ట్రైలర్ చూసిన తర్వాత 'అన్నయ్య.. ఈ సినిమాలో నువ్వు కొత్తగా కనపడుతున్నావ్' అన్నాడు.

ఎవరూ అడగలేదు..

'యన్టీఆర్' బయోపిక్‌లో నన్ను నటించమని ఎవరూ అడగలేదు. మా కుటుంబ సభ్యుల మధ్య ఆ చర్చ కూడా రాలేదు.


రాజకీయాల గురించి..

నేను ప్రస్తుతం సినిమాల గురించే ఆలోచిస్తున్నాను. రాజకీయాల గురించి ఆలోచించడం లేదు. మా మైండ్‌సెట్ ప్రకారం నేను రెండు పడవలపై ప్రయాణించలేను. ప్రస్తుతం నా కెరీర్ పట్ల చాలా హ్యాపీగా ఉన్నాను.

'విశ్వరూపం 2'కి లైన్ క్లియర్




కమల్ హాసన్ హీరోగా నటించి, దర్శకత్వం వహించిన 'విశ్వరూపం' ఎన్నో వివాదాలను ఎదుర్కొంటూనే ఘనవిజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ చిత్రానికి సీక్వెల్‌గా 'విశ్వరూపం 2' చిత్రాన్ని ప్లాన్ చేసిన కమల్ హాసన్ చాలా కాలంగా అదే పనిమీద ఉన్నారు. ఎన్నో అవాంతరాల మధ్య ఈ సినిమా షూటింగ్ పూర్తి చేసుకుంది. పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా పూర్తయ్యాయి. ఇటీవల సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ సినిమా యు/ఎ సర్టిఫికెట్ పొందింది. త్వరలోనే ఈ చిత్రం ఆడియోతోపాటు ట్రైలర్‌ని కూడా విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు కమల్. సినిమా విడుదల తేదీని కూడా త్వరలోనే ప్రకటిస్తారని తెలుస్తోంది. రాహుల్ బోస్, శేఖర్‌కపూర్, నాజర్ ఈ చిత్రంలో కీలకపాత్రలు పోషిస్తున్నారు. రాజ్‌కమల్ ఫిలింస్ ఇంటర్నేషనల్ పతాకంపై కమల్ హాసన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. జిబ్రాన్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. ప్రస్తుతం రాజకీయాల్లో బిజీగా ఉన్న కమల్ త్వరలో శంకర్ దర్శకత్వంలో రూపొందే 'భారతీయుడు 2' చిత్రంలో నటించనున్నారు.



మే 24న 'నేల టిక్కెట్టు'

రవితేజ, కల్యాణ్ కృష్ణ కాంబినేషన్‌లో రూపొందుతోన్న చిత్రానికి 'నేల టిక్కెట్టు' టైటిల్ ఖరారైంది. ఉగాది సందర్భంగా ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. ఎస్.ఆర్.టి. ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై రామ్ తాళ్లూరి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. మాళవికా శర్మ హీరోయిన్. 60% షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రాన్ని మే 24న విడుదల చేయాలని నిర్మాతలు ప్లాన్ చేస్తున్నారు. ఈ చిత్రానికి శక్తికాంత్ కార్తీక్ సంగీతం, ఛోటా కె.ప్రసాద్ కూర్పు, బ్రహ్మ కడలి కళ, ముఖేష్ ఛాయాగ్రహణం సమకూరుస్తున్నారు.

మంచి బ్రేక్ కోసం...



• అఖిల్

తొలి చిత్రం 'తొలిప్రేమ'తో సక్సెస్‌ఫుల్ దర్శకుడిగా పేరు తెచ్చుకున్నారు వెంకీ అట్లూరి. తన రెండో సినిమాను అఖిల్‌తో రూపొందించేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారని తెలుస్తోంది. అఖిల్‌కి కథ వినిపించడం, అతనికి నచ్చడం కూడా జరిగిపోయాయని, అఖిల్ సినిమా చేయడానికి ఓకే చెప్పారని తెలుస్తోంది. థాయిలాండ్ నేపథ్యంలో ఈ సినిమా కథ ఉంటుందని సమాచారం. 60 శాతం షూటింగ్ అక్కడే ఉంటుందట. వెంకీతోపాటు అఖిల్ కూడా త్వరలోనే థాయిలాండ్ వెళతారని తెలుస్తోంది. ప్రముఖ దర్శకులు వి.వినా యక్‌తో 'అఖిల్', విక్రమ్ కె.కుమార్‌తో 'హలో' చిత్రాలు చేసిన అఖిల్‌కి హీరోగా బ్రేక్ రాలేదు. ఆ బాధ్యతను తీసుకొని అఖిల్‌కు హీరోగా మంచి బ్రేక్ ఇచ్చేందుకు వెంకీ అట్లూరి కృషి చేస్తున్నారట.



• శ్రియ

రహస్య వివాహం?

ఆమధ్య హీరోయిన్ శ్రియ శరన్ రష్యాకి చెందిన క్రీడాకారుడు ఆండ్రూ కొశివ్‌ను వివాహం చేసుకోబోతోందని, దానికి సంబంధించిన షాపింగ్ కూడా చేసిందని వార్తలు వచ్చాయి. అయితే అందులో ఎంత మాత్రం నిజం లేదని, తన స్నేహితురాలి వివాహం కోసం షాపింగ్ చేశానని చెప్పుకొచ్చింది శ్రియ. తాజా సమాచారం మేరకు మార్చి 12న ఆండ్రూ కొశివ్‌ను శ్రియ రహస్యంగా వివాహం చేసుకుందని తెలుస్తోంది. ముంబయిలోని శ్రియ నివాసంలో ఆమె కుటుంబ సభ్యులు, కొంతమంది సన్నిహితుల సమక్షంలో ఈ వివాహ వేడుక జరిగిందట. ఈ వివాహానికి బాలీవుడ్ నుంచి మనోజ్ భాజ్‌పాయ్, షబానా అజ్మీ హాజరయ్యారట. హిందూ సంప్రదాయం ప్రకారం ఈ శుభకార్యం జరిగిందని తెలుస్తోంది. మొదట శ్రియ వివాహం ఉదయ్‌పూర్‌లో జరుగుతుందని వార్తలు వచ్చాయి. అయితే ఈ విషయాన్ని శ్రియ ఖండించింది. గత కొన్ని సంవత్సరాలుగా శ్రియ, ఆండ్రూల మధ్య ప్రేమ వ్యవహారం నడుస్తోందని మీడియాలో ప్రచారం జరిగింది. శ్రియ మాత్రం ఈ విషయంపై ఎప్పుడూ స్పందించలేదు.

'బిగ్‌బాస్' నాని?



ఎన్టీఆర్ వ్యాఖ్యాతగా వ్యవహరించిన రియాలిటీ టీవీ షో 'బిగ్ బాస్' అందర్నీ ఆకట్టుకున్న విషయం తెలిసిందే. ఈ షో సీజన్ 2 త్వరలో మొదలు కానుంది. ప్రస్తుతం సినిమాలతో బిజీగా ఉన్న ఎన్టీఆర్ బిగ్‌బాస్ షోకు వ్యాఖ్యాతగా వ్యవహరించే అవకాశం కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో ఈ షోను నిర్వహించబోతున్నారంటూ పలువురు హీరోల పేర్లు వినిపించాయి. కాగా హీరో నాని ఈ షోకు వ్యాఖ్యాతగా వ్యవహరించే అవకాశం ఎక్కువగా ఉన్నట్టు తెలుస్తోంది. త్వరలోనే ఈ షోకి సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది. గతంలో రేడియో జాకీగా పనిచేసిన నాని ఈ రియాలిటీ షోను ఏ విధంగా నడిపిస్తాడనే ఆసక్తి అందరిలోనూ కనిపిస్తోంది.

రెండేళ్ళ తర్వాతే పెళ్లి

'అత్తారింటికి దారేది' వంటి చిత్రాల్లో తన అంద చందాలతో ఆకట్టుకున్న ప్రణీత తన పెళ్లి విషయం గురించి రెండేళ్ళ తర్వాతే ఆలోచిస్తానని చెప్తోంది. ''ఇప్పుడిప్పుడే మంచి సినిమాల్లో నటించే అవకాశం వస్తోంది. గతంలో చాలా సినిమాల్లో నటించినా పవన్‌కల్యాణ్‌తో చేసిన 'అత్తారింటికి దారేది' నాకు మంచి పేరు తెచ్చింది. నాకు ఎంతో ఇష్టమైన హీరో పవన్‌కల్యాణ్. ఎక్కడికి వెళ్లినా, ఏ ఇంటర్వ్యూలో అయినా నా పెళ్లి గురించే అడుగుతున్నారు. అయితే ప్రస్తుతం దృష్టంతా నా కెరీర్‌పైనే ఉంది. మంచి పాత్రలు వస్తే భాషతో సంబంధం లేకుండా ఏ సినిమా అయినా చెయ్యడానికి నేను సిద్ధం. ఇక నా పెళ్లి గురించి చెప్పాలంటే రెండు సంవత్సరాల తర్వాత నా పెళ్లి గురించి కబురు అందరికీ తెలియజేస్తాను'' అన్నారు.



• ప్రణీత

మడోన్నా 'టేకింగ్ ఫ్లైట్'



సంగీతానికి ఎల్లలులేవని చాటి చెప్పిన అమెరికా గాయని మడోన్నా. పాడటంతో పాటు పాటల రచయిత్రిగా, మంచి డాన్సరుగా, నటిగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు ఈ పాశ్చాత్య గాయని. ''క్వీన్ ఆఫ్ పాప్''గా పేరు తెచ్చుకున్న మడోన్నా.. 'ఫిల్త్ అండ్ విజ్‌డమ్'(2008)తో తొలిసారిగా మెగాఫోన్ పట్టుకున్నారు. తదుపరి సినిమాగా 'డబ్ల్యు.ఇ%.'(2011)ను తెరకెక్కించారు. ఇప్పుడు ముచ్చటగా మూడోసారి 'టేకింగ్ ఫ్లైట్' అనే మూవీని రూపొందిస్తున్నారు. మైఖేలా రచించిన ''టేకింగ్ ఫ్లైట్: ఫ్రమ్ వార్ ఆరానే టు స్టార్ బాలరీనా '' పుస్తకం ఆధారంగా తెరకెక్కబోతోంది ఈ చిత్రం. ఈ సినిమా గురించి మడోన్నా మాట్లాడుతూ.. ''పశ్చిమ ఆఫ్రికాలోని సియర్రా లియోన్‌కు చెందిన మైఖేలా జీవితాన్ని తెరకెక్కించడం గొప్ప అవకాశంగా భావిస్తున్నాను. ఒక యుద్ధంలో అనాథగా మిగిలి.. సర్వం కోల్పోయి జీవితంలో ఎన్నో కష్టాలకు ఓర్చి ఒక స్టార్ బ్యాలే డాన్సరుగా, కార్యకర్తగా ఆమె ఎదిగిన వైనం నన్ను కదిలించింది. అనాథ పిల్లలకు బాసటగా నిలిచిన ఈమె కథను తెరపై ఆవిష్కరించడం నాకు ఎంతో గర్వంగా ఉంద''ని తెలిపారు.

ఏప్రిల్ 5న 'ఆచారి అమెరికా యాత్ర'



• విష్ణు

మంచు విష్ణు హీరోగా నటించిన చిత్రం 'ఆచారి అమెరికా యాత్ర'. జి.నాగేశ్వరరెడ్డి దర్శకుడు. పద్మజ పిక్చర్స్ పతాకంపై కీర్తి చౌదరి, కిట్టు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఎం.ఎల్.కుమార్ చౌదరి సమర్పకుడు. ఈ చిత్రాన్ని ఏప్రిల్ 5న విడుదల చేస్తున్నారు. విష్ణు, జి.నాగేశ్వర్‌రెడ్డిల కాంబినేషన్‌లో 'దేనికైనా రెడీ', 'ఈడో రకం ఆడో రకం' వంటి సూపర్ హిట్ కామెడీ సినిమాలు వచ్చాయి. 'ఆచారి అమెరికా యాత్ర' కూడా పూర్తి వినోదాత్మక చిత్రం కావడంతో ఇది కూడా ఘనవిజయం సాధిస్తున్న నమ్మకంతో ఉంది చిత్ర యూనిట్. ఈ చిత్రంలో విష్ణు సరసన ప్రగ్యా జైస్వాల్ హీరోయిన్‌గా నటిస్తోంది. అమెరికా, మలేషియా, హైదరాబాద్‌లలో ఈ చిత్రం షూటింగ్ జరిగింది. తనికెళ్ళ భరణి, కోట శ్రీనివాసరావు, పోసాని, పృథ్వీ తదితరులు ఇతర ప్రధాన తారాగణం. ఈ చిత్రానికి సంగీతం: థమన్, మాటలు: డార్లింగ్ స్వామి.

'ఆనందం' ఆడియో ఆవిష్కరణ



మలయాళంలో ఘనవిజయం సాధించిన 'ఆనందం' చిత్రాన్ని అదే పేరుతో సుఖీభవ మూవీస్ పతాకంపై తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు నిర్మాత ఎత్తరి గురురాజ్. ఈ చిత్రం మార్చి 23న విడుదల కానుంది. గణేశ్‌రాజ్ దర్శకుడు. సీనియర్ నిర్మాత ఆర్.సీతారామరాజు ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. సచిన్ వారియర్ సంగీతం అందించిన ఈ సినిమా ఆడియోను శనివారం హైదరాబాద్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్మాత ఎత్తరి గురురాజ్ మాట్లాడుతూ ''మా సినిమా చూడటానికి ప్రేక్షకులు ఎంత ఆనందంగా థియేటర్‌కి వస్తారో.. అంతే ఆనందంగా బయటకు వస్తారు. తెలుగు ప్రేక్షకులకు కూడా సినిమా తప్పకుండా నచ్చు తుందని భావిస్తున్నాం'' అన్నారు. దర్శకుడు గణేష్ రాజ్ మాట్లాడుతూ ''కాలేజ్‌లో ట్రిప్‌కు వెళ్లిన కొంత మంది విద్యార్థుల కథే ఈ సినిమా. యూనివర్సల్ పాయింట్‌తో తెరకెక్కిన ఈ సినిమా తప్పకుండా తెలుగు ఆడియెన్స్‌కు కూడా నచ్చుతుంది'' అన్నారు. హీరో తరుణ్ మాట్లాడుతూ ''ఆనందం' ట్రైలర్ బాగుంది. ఈ సినిమా అందరికీ నచ్చుతుంది'' అన్నారు. ఈ కార్యక్రమంలో పద్మరాజు, ఎ.వి.ఎస్.రాజు, సీతారామరాజు తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ అలా.. బాబు ఇలా!

- తెలంగాణలో లిఫ్టులతో నీళ్లు తోడేస్తున్నారు
- నాలుగేళ్లలో చంద్రబాబు ఏం సాధించారు?
- ఓటుకు నోటు కేసులో ఆయనకు జైలు భయం
- అందుకే తెలంగాణతో పోరాడలేకపోతున్నారు
- రైతులతో ఆత్మీయ సమ్మేళనంలో వైఎస్ జగన్



గుంటూరు, మార్చి 17: తెలంగాణ ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు ఓ పక్క లిఫ్టులు పెట్టి నీళ్లు తోడేస్తుంటే, ఏపీ సీఎం చంద్రబాబు ఈ నాలుగేళ్లలో ఏం సాధించారని వైసీపీ అధినేత, ప్రతిపక్ష నేత జగన్‌మోహన్ రెడ్డి ప్రశ్నించారు. అసలు కేసీఆర్‌కు ఉన్నదేంటి.. చంద్రబాబుకు లేనిదేంటని నిలదీశారు. ఓటుకు నోటు కేసులో ఆడియో టేపులు, వీడియో టేపుల్లో అడ్డంగా దొరికిన వ్యక్తి కనుక.. ప్రశ్నిస్తే జైల్లో పెట్టిస్తారన్న భయంతోనే చంద్రబాబు తెలంగాణతో ఏ విషయంలోనూ పోరాడలేకపోతున్నారని జగన్ విమర్శించారు. ప్రజా సంకల్పయాత్రలో భాగంగా శనివారం గుంటూరు జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం కాకుమానులో రైతులతో ఆత్మీయ సమ్మేళనంలో జగన్ పాల్గొన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఎడాపెడా నీళ్లు తోడేస్తున్నా, ఇక్కడ మాత్రం టీడీపీ ప్రభుత్వం రైతులకు నీళ్లు ఇవ్వడంలో విఫలమైందన్నారు. నాలుగేళ్లు గడుస్తున్నా చంద్రబాబు ఏ పంటకైనా గిట్టుబాటు ధర కల్పించారా అని ప్రశ్నించారు. దళారులకు నాయకుడై, హెరిటేజ్ పేరుతో వ్యాపారం మొదలుపెట్టిన వ్యక్తి చంద్రబాబు అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల దగ్గరి నుంచి కొన్న సరుకులను కవర్లో ప్యాక్ చేసి ఎన్నో రెట్ల ధరలకు విక్రయించడం రాష్ట్రం మొత్తం చూసింది. గుంటూరు మిర్చి యార్డ్‌కు ప్రతిపక్షనేత వచ్చి దీక్ష చేయాల్సిన పరిస్థితి తలెత్తిందంటే చంద్రబాబు పాలన ఎలా ఉందో అర్థం చేసుకోవాలన్నారు. చంద్రబాబు పాలనలో చిత్తూరులో షుగర్ ఫ్యాక్టరీలు, ఒంగోలులో డెయిరీలు మూతపడ్డాయి తప్పా ఎలాంటి ప్రయోజనం చేకూరలేదంటూ జగన్ మండిపడ్డారు.

చంద్రబాబుది 87 వేల కోట్ల మోసం

''రుణమాఫీ అని చంద్రబాబు చేసిన మోసం ఇంతా అంత కాదు అది రూ. 87 వేల కోట్ల మోసం. బ్యాంకుల్లో తాకట్టు పెట్టిన బంగారం ఇంటికి వచ్చిందో లేదో కానీ బ్యాంకుల నుంచి మాత్రం రైతులకు నోటీసులు వస్తున్నాయి. ఎందుకంటే ఇది చంద్రబాబు ప్రభుత్వం'' అని జగన్ అన్నారు. చంద్రబాబు ప్రభుత్వం బ్యాంకులకు రైతు రుణాల డబ్బులు ఎగ్గొట్టడం వల్లే ఏ బ్యాంకు కూడా రైతులకు రుణాలు ఇచ్చేందుకు ముందుకు రావడం లేదన్నారు. తాము అధికారంలోకి వస్తే ప్రకృతి వైపరీత్యాల కోసం రూ.4 వేల కోట్లు కేటాయిస్తామని తెలిపారు.

రైతులకు 9 గంటల ఉచిత విద్యుత్

పెట్రోల్, డీజిల్ ధరలు ఇతర రాష్ట్రాలతో పోలిస్తే లీటర్‌కు 6 లేదా 7 రూపాయలు అదనంగా ఉంని జగన్ అన్నారు. ఏపీలో దళారీ వ్యవస్థ పెరిగిందని, రైతులకు ఏమీ మేలు జరగలేదని విమర్శించారు. రైతులకు 9 గంటల ఉచిత విద్యుత్ ఇస్తామన్న చంద్రబాబు.. కేవలం 7 గంటలు ఇస్తున్నారని, అది కూడా రాత్రిపూట ఇస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిపారు. తాము అధికారంలో వస్తే రైతులకు పగటి పూట 9 గంటల విద్యుత్ ఉచితంగా ఇస్తామని, రైతులకు పంట రుణాలు వడ్డీ లేకుండా ఇస్తామని హామీ ఇచ్చారు. చంద్రబాబు పాలనలో మూతపడ్డ సహకారం రంగ సంస్థలను మళ్లీ తెరిపించి అభివృద్ధి పథంలో నడిపిస్తానని హామీ ఇచ్చారు.

కమీషన్ తీసుకుంటే తప్పేంది?

- మా మంత్రే తీసుకొమ్మన్నడు.. 1-3% తీసుకుంటున్నాం
- కాంట్రాక్టర్లే ఇవ్వాలి, వారి బాధ్యత.. మాకూ ఖర్చులుంటయ్
- సిరిసిల్ల మునిసిపల్ చైర్‌పర్సన్ పావని సంచలన వ్యాఖ్యలు



కరీంనగర్, మార్చి 17(మనం బ్యూరో): కాంట్రాక్టర్ల నుంచి ప్రజాప్రతినిధులు కమీషన్లు వసూలు చేయడం మామూలేనని, అలా ఇవ్వడం కాంట్రాక్టర్ల బాధ్యతని సిరిసిల్ల మునిసిపల్ చైర్‌పర్సన్ సామల పావని సంచలన వ్యాఖ్యలు చేశా రు. కమీషన్ తీసుకోవాలని సాక్ష్యాత్తు పుర పాలకశాఖ మంత్రిగారే చెప్పారని పావని సెలవిచ్చారు. ఈ మేరకు శనివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. 'సిరిసిల్లా టౌన్‌లో ఎన్ని కోట్ల పనులొచ్చినా అందరూ అసంతృప్తితో ఉన్నా రు. ఒక వార్డులో ఒకే కాంట్రాక్టర్ అన్ని పనులనూ చేపడుతున్నాడు. కాంట్రాక్టర్లు మాకు 1-3శాతం కమీషన్ ఇవ్వాలి. మా మంత్రిగారు కూడా ఇదే చెప్పారు.. మనకు వచ్చేదేమీ ఉండదు పర్సెంటేజ్ తీసుకోవాలన్నారు. కానీ, కౌన్సిలర్లను కాంట్రాక్టర్లు లెక్కచేయడంలేదు, రాజకీయంచేస్తూ డబ్బులివ్వకుండా కౌన్సిలర్లది తప్పు అంటున్నారు. దీన్ని కాంట్రాక్టర్ల విజ్ఞత కే వదిలేస్తున్నాం' అంటూ సిరిసిల్ల మునిసిపల్ చైర్‌పర్సన్ సామల పావని ఇన్నాళ్లు గుట్టుచప్పుడు కాకుండా జరిగిన తమ అవినీతిని నిర్మొహమాటం గా బయటపెట్టారు. ఇందులో తప్పేముంది రాష్ట్రమంతటా ఇట్లనే జరుగుతుందిగా అని విలేకరులడిగిన ప్రశ్నకు బదులిచ్చారు. రాజకీయంగా కౌన్సిలర్లకు ఎన్నో ఖర్చులు ఉంటాయని, పొద్దున్న లేచినప్పటి నుంచి తిరుగుతూనే ఉంటామని, తమ వార్డుల్లో జరిగే పనుల్లో కమీషన్లు తీసు కోవడంలో తప్పేముందని ఆమె ప్రశ్నించారు. 'మా మంత్రిగారు కమీషన్లు తీసుకోవద్దని చెప్పలేదు. 2-3శాతం పర్సెంటేజ్ మాత్రమే తీసుకోవాల న్నారు'అంటూ అవినీతిలోనూ తమ నిజాయితీని చాటుకున్నారు. 'రాష్ట్రంలోని అన్ని మునిసిపాలిటీల్లోనూ ఇదే జరుగుతుంది కదా! నేను ఒక వార్డు కౌన్సిలర్‌నే.. అందరితోపాటు నేనూ..'అంటూ నిజాన్ని నిర్భయంగా చెప్పారు. తన వార్డులో కాంట్రాక్టర్లు కమీషన్లు ఇస్తున్నది, లేనిది తెలియదని, వ్యవహార మంతా భర్తే చూసుకుంటారని పావని చెప్పుకొచ్చారు. పావని వ్యాఖ్యలు రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేకెత్తిస్తున్నాయి. ఆమె విలేకరులతో మాట్లాడిన వీడియో సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. టీఆర్ఎస్ ప్రభుత్వం కాంట్రాక్టుల్లో దోచుకుంటున్న తీరు నేటితో సుస్పష్టంగా వెల్లడైందని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి.



'అమ్మ' జాబ్ అంత ఈజీ కాదు


- రెండున్నర ఉద్యోగాలకు సమానం
- రోజుకు 14 గంటలు విధినిర్వహణే
- పండుగలు, వారాంతపు సెలవుల్లేవు
- 2 వేల మంది అమ్మల మనోగతం
- అమెరికాలో జరిగిన సర్వేలో వెల్లడి

వాషింగ్టన్, మార్చి 17: ఇంటిని, ఇంట్లోని వాళ్లను చక్కబెట్టుకోవడంకన్నా పెద్ద ఉద్యోగమేమీ లేదని, అమ్మతనం అంత ఈజీ కాదని తాజా సర్వే ఒకటి వెల్లడించింది. ఉద్యోగంచేసే మహిళలతో పోలిస్తే ఇంట్లో పనులు చక్కబెట్టుకునే అమ్మల శ్రమే ఎక్కువని తేలింది. రోజుకు ఆరేడు గంటలు.. ఎనిమిది గంటలు చేసే బయటి ఉద్యోగాలతో పోలిస్తే ఇంట్లో అమ్మలు రోజుకు పద్నాలుగు గంటలు పనిచేస్తున్నారని వెల్లడైంది. అంటే సాధారణ ఉద్యోగాలకన్నా అమ్మ ఉద్యోగం రెండున్నర రెట్లు ఎక్కువన్నమాట! అమ్మ ఇంట్లో చేసే పనులు బయట రెండున్నర ఉద్యోగాలకు సమానమని శాస్త్రీయ అధ్యయనంలో తేలింది. అంతేనా.. ఇతర ఉద్యోగాల మాదిరిగా వారంతపు సెలవు, పండుగ సెలవు, జాతీయ సెలవు దినమంటూ అమ్మకు ఎలాంటి సెలవూ ఉండదు. ఉదయాన్నే లేచింది మొదలు రాత్రి వరకు ఏదో ఒక పని చక్కబెడుతూనే ఉంటుందనే విషయం తెలిసిందే! పిల్లల న్యాపీలు మార్చడం మొదలు.. ఇంట్లో వాళ్లకు సమయానికి అన్నీ అందించడం, అదే సమయంలో పసికందుల ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు తీసుకోవడం వంటి క్లిష్టమైన విధుల నేపథ్యంలో అమ్మతనం అంత వీజీ కాదని అందరూ ఒప్పుకోవల్సిందే! అప్పట్లో దాసరి దర్శకత్వంలో వచ్చిన 'అమ్మ రాజీనామా' సినిమాలో రోజువారీగా అమ్మ బాధ్యతలను, అమ్మ సెలవు తీసుకుంటేనో లేక తన 'ఉద్యోగానికి' రాజీనామా చేస్తే ఎలా ఉంటుందనే విషయాన్ని కళ్లకు కట్టినట్లు చూపించారు. అప్పటి దాకా అంతగా ప్రాధాన్యంలేనివంటూ కొట్టిపారేసిన పనులే అమ్మ రాజీనామా తర్వాత ఎంత కష్టమో తెలిసొస్తుంది. తాజాగా అమెరికాలో నిర్వహించిన ఓ సర్వేలో వివిధ సంరక్షణ పనులతో సహా అమ్మ వారంలో 98 గంటలు పనిచేస్తూనే ఉంటుందని తేలింది. ఈ సర్వేలో భాగంగా.. 5 నుంచి 12 ఏళ్ల వయసున్న పిల్లల తల్లులు రెండు వేల మందిని ప్రశ్నించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందులో వెల్లడైన వివరాలను పరిశీలిస్తే.. అమ్మ విధులు సగటున ఉదయం 6:23 నిమిషాలకు ప్రారంభమై రాత్రి 8:31 నిమిషాలకు ముగుస్తాయని తేలింది. అంటే రోజుకు 14 గంటలు అమ్మ పనిచేస్తూనే ఉంటుందన్నమాట! రోజులో సగటున అమ్మ తనకంటూ మిగుల్చుకునే సమయం కేవలం 67 నిమిషాలు మాత్రమేనట.. తాము చేయాల్సిన పనులకు అంతమనే మాటే లేదని 40 శాతం మంది తల్లులు భావిస్తున్నారు.

మనకు అనూహ్య మద్దతు

అవిశ్వాసం పెట్టిన గంటలోనే పలు పార్టీల అండ.. టీడీపీ విశ్వసనీయతకు నిదర్శనమిది

- వైఎస్సార్‌సీపీని ఎవరూ నమ్మే పరిస్థితి లేదు
- సోమవారం అవిశ్వాసం.. ఓటింగ్‌కు పట్టు
- ఈ రెండ్రోజులు అక్కడే మద్దతు కూడగట్టండి
- టీడీపీ ఎంపీలతో టెలికాన్ఫరెన్స్‌లో బాబు
- 2014లో జనసేన.. బీజేపీ వల్లే ఓట్లు తగ్గాయి
- దీన్ని క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లండి: సీఎం



అమరావతి, మార్చి 17(మనం ప్రతినిధి): వైసీపీని దేశంలోని ఏ ఒక్క పార్టీ నమ్మే స్థితిలో లేదని, ఆ పార్టీ అవిశ్వాస తీర్మానం పెట్టినప్పుడు అందుకే స్పందన కరువైందని సీఎం చంద్రబాబు అన్నారు. అదే సమయంలో టీడీపీ అవిశ్వాసం పెట్టగానే అనూహ్య స్పందన వచ్చిందని, గంటలోపే పలు పార్టీలు మద్దతుగా నిలిచాయని ఆయన చెప్పారు. టీడీపీపై జాతీయ స్థాయిలో ఉన్న విశ్వసనీయతకు ఇదే నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. శనివారం తన నివాసం నుంచి టీడీపీ ఎంపీలు, అసెంబ్లీ వ్యూహ కమిటీ ప్రతినిధులతో సీఎం చంద్రబాబు టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా లోక్‌సభలో సోమవారం మరోసారి అవిశ్వాస తీర్మానం ఇచ్చి, ఓటింగ్‌కు పట్టుబట్టాలని ఆయన దిశానిర్దేశం చేశారు. ఆరుగురు సభ్యుల ఎంపీల బృందం ఈ రెండు రోజులు ఢిల్లీలోనే ఉండి.. అన్ని పార్టీల నేతలను వ్యక్తిగతంగా కలవాలని, టీడీపీ ప్రతిపాదించిన అవిశ్వాసానికి మద్దతు కూడగట్టాలని సూచించారు. ఇది అత్యంత కీలకమైన సమయమని, టీడీపీ ఎంపీలంతా మరింత చురుకుగా, ఉత్సాహంగా పనిచేయాలన్నారు. అవిశ్వాసంపై సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకున్నామని, మూడు పార్టీల మహాకుట్రను ప్రజల్లో బయటపెట్టామని ప్రజల్లో చర్చ జరుగుతోందని చంద్రబాబు ఎంపీలకు వివరించారు. 'జగన్, పవన్ కేంద్రాన్ని ప్రశ్నించకుండా నన్ను విమర్శిస్తున్నారు. ఈ సమయంలో నన్ను బలహీనపరిచి ఎవరికి లాభం చేకూరుస్తున్నారు. దేశం మొత్తం ఆంధ్రప్రదేశ్ వైపే చూస్తోంది. జాతీయ స్థాయిలో ఏపీ ప్రజల గొంతు వినిపించాం'' అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. లోక్‌సభలో అశోక్ గజపతిరాజు, రాజ్యసభలో వైఎస్‌చౌదరి సమర్థంగా వాదన వినిపించారని అభినందించారు. ఈ స్ఫూర్తిని ఇదే విధంగా మరింత ముందుకు తీసుకెళ్లాలని, రాష్ట్రానికి న్యాయం జరిగేవరకూ పోరాటాన్ని కొనసాగించాలని ఆదేశించారు.

పవన్‌వి పసలేని ఆరోపణలు

లోక్‌సభాపక్ష నేత తోట నరసింహం మాట్లాడుతూ ఢిల్లీలో ఇప్పటి వరకు తాము కలిసిన పార్టీల నేతలు వెల్లడించిన అభిప్రాయాలను ముఖ్యమంత్రికి వివరించారు. అనేక పార్టీలు రాష్ట్రానికి మద్దతుగా ఉన్నాయని, రాష్ట్రానికి న్యాయం చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపైనే ఉందని చెప్పారు. కాగా రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ.. జాతీయ చానళ్లలో జరిగిన డిబేట్‌లో పవన్ తీరును ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రధాని మోదీని విమర్శించకుండా.. సీఎం చంద్రబాబు, లోకేశ్‌ను లక్ష్యంగా చేసుకుని విమర్శలు ఎందుకు చేశారని టీవీ యాంకర్ ప్రశ్నించగా పవన్ కల్యాణ్ సమాధానం దాటవేశారని తెలిపారు. లోకేశ్‌పై చేసిన ఆరోపణలకు రుజువులు చూపాలని తాను సవాల్ చేయగా జవాబివ్వలేదని చెప్పారు. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందిస్తూ ఆరోపణలు చేసిన మరుసటి రోజే వాటి గురించి మళ్లీ విలేకరులు ప్రస్తావించగా 'అందరూ అంటున్నారు కాబట్టే నేను అన్నాను' అని పవన్ బదులివ్వడాన్ని గుర్తుచేశారు. పవన్ ఆరోపణలన్నీ పసలేనివని, ప్రజలు వాటన్నింటినీ గమనిస్తున్నారని బాబు చెప్పారు. కాగా సీఎం రమేష్ మాట్లాడుతూ జాతీయ చానళ్ల టీడీపీ జాతీయ రాజకీయాల్లోకి వస్తోందని, ఫ్రంట్ ఏర్పాటు చేస్తోందని ప్రచారం చేస్తున్న విషయం ప్రస్తావించారు. దీనిపై ముఖ్యమంత్రి స్పందిస్తూ.. ఆంధ్రప్రదేశ్‌కు జరిగిన అన్యాయం గురించి మాట్లాడకుండా జాతీయ మీడియా రాజకీయాలపైనే దృష్టి పెట్టడం సరికాదని అన్నారు.

పొత్తు వల్లే సీట్లు తగ్గాయ్


బీజేపీ, జనసేనతో పొత్తు వల్లే టీడీపీకి 2014 ఎన్నికల్లో సీట్లు తగ్గాయని సీఎం చంద్రబాబు అన్నారు. తమతో పొత్తు వల్లే 102 సీట్లు గెలిచి టీడీపీ అధికారంలోకి వచ్చిందని ఆ రెండు పార్టీల నేతల విమర్శలను ఆయన తిప్పికొట్టారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు 2014 ఏప్రిల్‌లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటింగ్ సరళి ప్రకారం 120 అసెంబ్లీ స్థానాలు టీడీపీ గెలవాల్సి ఉందన్నారు. కానీ బీజేపీ, జనసేనతో పొత్తుల వల్లే ప్రత్యేకించి బీజేపీకి కేటాయించిన సీట్లు.. వారు గెలవకపోవటం వల్లనే సీట్ల సంఖ్య తగ్గిపోయిందని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. అలాగే అప్పటి ఓటింగ్ సరళిని, బూత్‌ల వారీగా ఓటింగ్ శాతాన్ని టెలికాన్ఫరెన్స్‌లో ఏపీ టీడీపీ అధ్యక్షుడు కళా వెంకట్రావు వివరించారు. అనంతరం మండల, గ్రామ స్థాయిలో నాయకులు కేంద్ర ప్రభుత్వం చేసిన మోసంతోపాటు స్థానిక సంస్థల ఎన్నికల ఓటింగ్ సరళిని జనంలోకి తీసుకువెళ్లాలని చంద్రబాబు ఆదేశించారు.

నీటమునిగి ఐదుగురు చిన్నారులు మృతి

- పండుగ పూట గుడితండాలో విషాదం



నల్లగొండ, మార్చి 17(మనం ప్రతినిధి): అప్పటి దాకా ఆడిపాడిన చిన్నారులు అంతలోనే విగత జీవులుగా మారారు.. ఈతకు వెళ్లి రిజర్వాయర్‌లో మునిగిపోయారు. అన్నదమ్ముల కుటుంబాలకు చెందిన ఐదుగురు పిల్లలు తిరిగిరానిలోకాలకు వెళ్లారు. నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండలం గుడితండాలో జరిగిన ఈ సంఘటన స్థానికుల హృదయాలను కలిచి వేసింది. చిన్నారుల మృతదేహాలపై పడి రోధిస్తున్న తల్లిదండ్రులను చూసి గ్రామస్థులు కన్నీటి పర్యంతమయ్యారు. ఉగాది పండుగ పూట ఆ కుటుంబాల్లో విషాదం నింపిన ఈ ఘటన వివరాలు.. కొండమల్లేపల్లి మండలం పెండ్లిపాకల గ్రామ పంచాయతీ పరిధిలోని గుడితండా చెరువులో ఈతకు వెళ్లిన ఐదుగురు చిన్నారులు మృతిచెందారు. మరణించిన వారిలో నేనావత్ ఓంకార్ కుమారులు శివ(6), రాకేష్ (6), నేనావత్ హనుమ కుమారులు నవదీప్(7), సాత్విక్(6), నేనావత్ సర్దార్ కొడుకు సంతోష్(7)లు ఉన్నారు. మరణించిన చిన్నారులంతా పెండ్లిపాకల గుడితండాకు చెందిన అన్నదమ్ముల కుటుంబాలకు చెందిన పిల్లలని తెలిసింది. చిన్నారుల మృతి సమాచారం అందుకున్న పోలీసులు రిజర్వాయర్ ప్రాంతానికి చేరుకుని ఘటనా స్థలాన్ని పరిశీలించారు. చిన్నారుల మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శివరాంరెడ్డి తెలిపారు.



టీఆర్ఎస్.. సహకరించాలి

- పార్లమెంటులో 'అవిశ్వాసం' చర్చకు రావాలి
- బీజేపీతో పవన్‌కు దోస్తీ లేదు: సీపీఐ రామకృష్ణ

హైదరాబాద్, మార్చి 17 (మనం ప్రతినిధి): కేంద్ర ప్రభుత్వంపై పార్లమెంటులో టీడీపీ ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం చర్చకు వచ్చేలా సహకరించాలని టీఆర్ఎస్ ఎంపీలకు సీపీఐ ఏపీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విజ్ఞప్తి చేశారు. అవిశ్వాస తీర్మానం చర్చకు వచ్చినప్పుడు సహకరించేలా తమ ఎంపీలకు టీఆర్ఎస్ అధినేత, తెలంగాణ సీఎం కేసీఆర్ దిశానిర్దేశం చేయాలని కోరారు. ఇతర పార్టీల ఎంపీల గందరగోళం కారణంగానే శుక్రవారం లోక్‌సభలో అవిశ్వాస తీర్మానం చర్చకు రాలేదని రామకృష్ణ అభిప్రాయపడ్డారు. శనివారం హైదరాబాద్‌లోని సీపీఐ కార్యాలయంలో పార్టీ నేత రావుల వెంకయ్యతో కలిసి రామకృష్ణ విలేకరులతో మాట్లాడారు. ప్రత్యేక హోదాపై సీపీఐ ఆధ్వర్యంలో పోరాటం చేసి మూడేళ్ల కిందటే జైలుకు వెళ్లామని తెలిపారు. ఇప్పుడు హోదా కోసం అందరూ నినదించడం స్వాగతించదగిన విషయమన్నారు. కేంద్ర ప్రభుత్వం ఏపీకి అన్యాయం చేస్తోందని, ఇటు చంద్రబాబు ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని, ఏపీని అప్పుల రాష్ట్రంగా మార్చారని రామకృష్ణ ఆరోపించారు. ఏపీలో మితిమీరిన అవినీతి చోటు చేసుకుంటోందన్నారు. ఏసీబీ దాడుల్లో ఇప్పటివరకూ రూ.2500 కోట్లు పట్టుబడటం ఇందుకు నిదర్శనమన్నారు.

బాలికను ఆటోలో ఎత్తుకెళ్లి గ్యాంగ్ రేప్

- రెండు రోజుల పాటు చిత్రహింసలు
- 13 మంది యువకుల దారుణం
- మూడు రోజులు క్రితం అపహరణ
- ఖమ్మంలో మరో 'నిర్భయ' ఘటన
- తాజాగా వెలుగులోకి వచ్చిన వైనం

పినపాక మార్చి 17 (మనం న్యూస్): ఖమ్మం జిల్లాలో ఘోరం చోటు చేసుకుంది. పినపాక మండలానికి చెందిన ఓ బాలికపై 13 మంది యువకులు సామూహిక అత్యాచారానికి పాల్పడినట్లు వెలుగులోకి వచ్చింది. రెండు రోజుల క్రితం జరిగిన ఈ ఘటన శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు పాండురంగాపురం గ్రామానికి చెందిన ఓ బాలికను.. అమరారం గ్రామానికి చెందిన 13 మంది యువకులు మాయమాటలు చెప్పి ఆటోలో అటవీ ప్రాంతానికి తీసుకెళ్లి అత్యాచారానికి ఒడిగట్టారు. అనంతరం అక్కడి నుంచి జయశంకర్ భూపాపల్లి జిల్లా అకినేపల్లి మల్లారం గ్రామ శివారు అటవీ ప్రాంతంలో మరోసారి బాలికపై దుర్మార్గానికి ఒడిగట్టారు. చివరకు ఆ బాలికను జానంపేట గ్రామంలో వదిలేసి వెళ్లిపోయారు. విషయం తెలిసిన ఆ బాలిక సోదరుడు ఆ గ్రామానికి వెళ్లగా.. స్థానిక నాయకుడు ఒకరు జోక్యం చేసుకుని బాలిక శీలా నికి వెల కట్టేందుకు ప్రయత్నించినట్లు సమాచారం. ఇదిలా ఉండగా, తమ కూతురు కనిపించట్లేదని మూడు రోజుల క్రితం అంటే బుధవారం ఆ బాలిక తల్లి ఏడూళ్ల బయ్యారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. అయితే.. సామూహిక అత్యాచార ఘటనకు సంబంధించి తమకు ఎలాంటి సమాచారం అందలేదని పోలీసులు పేర్కొన్నారు.

పండుగ ముందు విషాదం

- సెప్టిక్ ట్యాంకులో పడి నలుగురి మృతి
- విషవాయువు వెలువడడంతో సమాధి
- విశాఖపట్నం జిల్లాలో విషాదం



నక్కపల్లి, మార్చి 17 (మనం న్యూస్): ఉగాది ముందు రోజు శనివారం విశాఖపట్నం జిల్లాలో విషాదం చోటు చేసుసుకుంది. నక్కపల్లి మండలం, ఉపమాక గ్రామంలో సెప్టిక్ ట్యాంక్ శుభ్రంగా చేస్తుండగా, నలుగురు దళితులు మృత్యువాత పడగా, మరొకరు ప్రాణాలతో బయటపడ్డారు. గ్రామంలో కాండ్రకోట అప్పారావు (50) తన ఇంటిలో సెప్టిక్ ట్యాంకు నిండిపోవడంతో కొత్తగా మరొకటి నిర్మించాడు. సెప్టిక్ ట్యాంకులోకి తన కొడుకు కాండ్రకోట రాజశేఖర్ (28) సహాయంతో నిచ్చెన వేసుకొని దిగాడు. పాత ట్యాంకులోని వ్యర్థం కొత్త ట్యాంకులోకి పోయేందుకు అప్పారావు రంధ్రం చేస్తుండగా విషవాయువు వెలువడటంతో స్పృహతప్పి ట్యాంకులో పడిపోయాడు. రాజశేఖర్ తండ్రిని రక్షించడానికి ట్యాంకులోకి దిగగా ఆయన కూడా విషవాయువు ప్రభావంతో ట్యాంకులో ఎడిపోయాడు. వీరిని గమనించిన అప్పారావు సోదరుడి కొడుకు సత్తిబాబు ట్యాంకులోకి దిగాడు. ఆయన పెద్దగా కేకలు వేయడంతో స్థానికులు పైకిలాగి రక్షించారు. కాగా ట్యాంకులో ఉన్న అప్పారావు, రాజశేఖర్‌ను రక్షించడానికి దిగిన కాండ్రకోట కృష్ణ (30), కాండ్రకోట నాగేశ్వరరావు (30) ఊపిరాడక పడిపోయారు. స్థానికులు తాళ్ల సాయంతో నలుగురిని బయటకు తీశారు. పోలీసులు, స్థానికులు బాధితులను సమీపంలోని ఆసుపత్రికి తరలించగా, అప్పటికే వారు మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సత్తిబాబుకు చికిత్స అందించారు. ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు. ఇంటిపెద్దలు కళ్ల ఎదుటే మరణించడంతో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు.



మృతుల కుటుంబాలకు 2 లక్షల ఎక్స్‌గ్రేషియా


ఎమ్మెల్యే వంగలపూడి అనిత, జాయింట్ కలెక్టర్ సృజన నక్కపల్లి ఆసుపత్రికి చేరుకుని బాధిత కుటుంబాలను పరామర్శించారు. ప్రమాద ఘటనపై ఆరా తీశారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని, తక్షణమే మృతుల కుటుంబాలకు 2 లక్షల రూపాయలు ఎక్స్‌గ్రేషియాతో పాటు కుటుంబంలో ఒకరికి ఉపాధి, గృహ నిర్మాణం కల్పిస్తామని హామీ ఇచ్చారు. అధికారులు, స్థానక ప్రజాప్రతినిధులు, నాయకులు ఆసుపత్రికి వెళ్లి మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు.

'సార్క్' సహకారం పెంపొందాలి

కాఠ్మాండూ: దక్షిణాసియా దేశాల ప్రాంతీయ సహకార సంఘం (సార్క్) దేశాలు ఆర్థిక సహకారాన్ని పెంచుకోవడం, భౌగోళికంగా వివిధ దేశాల మధ్య మార్గాలను ఏర్పరుచుకోవడం ద్వారా భారతదేశపు 7-7.5 శాతపు వృద్ధి రేటు నుంచి లబ్ధి పొందాలని నేపాల్‌లో భారత రాయబారి మంజీవ్ సింగ్ పురీ అన్నారు. ''భారతదేశపు 7-7.5 శాతం జి.డి.పి వృద్ధి నుంచి సార్క్ దేశాలు ఎలా లబ్ధి పొందుతాయో చూడాలి. దాని కోసం అవి వాటి మధ్య కనెక్టివిటీ పెంచుకోవాలి. భారతదేశపు అధిక వృద్ధి రేటు నుంచి దక్షిణాసియాలోని అన్ని ఇతర దేశాలు కూడా అంతో ఇంతో ప్రయోజనం పొందవచ్చని నేను భావిస్తున్నాను. దీని వల్ల అన్ని దేశాలు లాభపడతాయి. ఇది అందరికీ మేలు చేకూర్చే పరిస్థితి'' అని పురీ అన్నారు. సార్క్ సి.ఐ.ఐ (ఎస్.సి.ఐ.ఐ) ఇక్కడ నిర్వహించిన సార్క్ వ్యాపార నేతల6వ సదస్సు 2018 సందర్భంగా ఆయన మీడియా ప్రతినిధులతో విడిగా మాట్లాడారు. ప్రాంతీయ కనెక్టివిటీని మెరుగుపరచుకోవడం భారతదేశానికి చాలా ముఖ్యమైన ఆశయమని ఆయన చెప్పారు. నేపాల్‌కు సంబంధించినంత వరకు, బీర్‌పూర్ వద్ద ఇండియా ఇంటెగ్రేటెడ్ చెక్‌పోస్ట్ నిర్మిస్తోంది. దాదాపుగా పూర్తి కావచ్చని ఆ చెక్ పోస్ట్‌ను త్వరలో ప్రారంభించనున్నారని పురీ తెలిపారు. భూటాన్, బంగ్లాదేశ్, నేపాల్, ఇండియా మధ్య మోటారు వాహనాల చట్టం రూపుదిద్దుకుంటోందని, వాటి మధ్య రైలు వ్యవస్థ పునరుద్ధరణకు కూడా ప్రయత్నాలు సాగుతున్నాయని ఆయన చెప్పారు. ''నేపాల్‌తో మనం పటిష్టమైన సంబంధాలు కొనసాగిస్తున్నాం. అనేక ప్రాజెక్టులను ముందుకు తీసుకెళ్ళడం కోసం ఎదురు చూస్తున్నాం. ఉదాహరణకు, 900 మెగావాట్ల అరుణ్ త్రీ ప్రాజెక్టు నేపాల్‌లో బహుశా అతి పెద్ద జల విద్యుచ్ఛక్తి ప్రాజెక్టు కావచ్చు. మరికొన్ని ఇతర కీలక ప్రాజెక్టులను మేం పరిశీలిస్తున్నాం. వాటిలో రైలు నెట్‌వర్క్‌లు, రోడ్డు లింకులు కూడా ఉన్నాయి'' అని ఆయన చెప్పారు. కనెక్టివిటీని పెంపొందించడానికి, వ్యాపార నిర్వహణను సులభ తరం చేయడానికి రెండు దేశాలు చాలా తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయని, భారత్-నేపాల్ భాగస్వామ్యంలో అదొక ప్రధాన లక్ష్యమని పురీ చెప్పారు. భారత్-నేపాల్ మధ్య వాణిజ్యం కూడా కొన్నేళ్ళుగా వేగంగా వృద్ధి చెందుతూ వస్తోంది. సార్క్ దేశాలు ఒక దాని కొకటి అత్యంత అనుకూల దేశం (ఎం.ఎఫ్.ఎన్) హోదాను ఇచ్చుకోవాలని అంతకుముందు ఒక చర్చలో ఆయన పిలుపునిచ్చారు.



టాస్క్ ఫోర్స్ నివేదిక రెడీ



డొల్ల కంపెనీల స్వరూప స్వభావాలను వివరించే 14 పరామితులు

ముంబయి: డెలావర్ (అమెరికా), లక్సెంబర్గ్, పనామా, మారిషస్, ఐర్లాండ్ వంటి పన్నుల స్వర్గధామాల్లో అనుబంధ సంస్థలున్న భారతీయ కంపెనీలను గుర్తించి, దర్యాప్తు నిర్వహించవలసిందని డొల్ల కంపెనీలపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన టాస్క్ ఫోర్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలకు, నియంత్రణ సంస్థలకు సిఫార్సు చేసింది. డొల్ల కంపెనీలుగా అనుమానించి, గుర్తించడానికి 14 పరామితులను 2017 జులైలో ఏర్పాటైన ఈ టాస్క్‌ఫోర్స్ రూపొందించింది. వాటిపై దర్యాప్తులు ప్రారంభించవలసిందని సూచించింది. ''పన్నుల స్వర్గాలుగా పేరున్నచోట్ల భారతీయ కంపెనీలకు అనుబంధ సంస్థలుండడం ప్రాథమికంగా ఆందోళనకరమైన అంశమే'' నని ఆ నివేదికలో పేర్కొన్నట్లు తెలిసింది. అటువంటి సంస్థలకుండే స్వరూప స్వభావాలతో టాస్క్ ఫోర్స్ ఒక జాబితా తయారు చేసింది. ఆ లక్షణాలను బట్టి వాటిని గుర్తించి అటువంటి సంస్థలను నిలువరించవచ్చని ఒక నివేదికను అది దర్యాప్తు సంస్థలకు సమకూర్చింది. ఒక సమతూకాన్ని మించి పెట్టుబడులు, రుణం, అడ్వాన్సులు లేదా నగదు ఉండడం ఒక లక్షణమని ఆ ప్యానెల్ పేర్కొంది. రిజర్వులు, మిగులు నిధులు ఐదు రెట్లు ఉన్న లేదా అవి టర్నోవరుకన్నా ఎక్కువగా ఉన్న కంపెనీలు, స్థిరాస్తులు కూడా ఐదు రెట్లుగా లేదా టర్నోవరుకన్నా ఎక్కువగా ఉన్న కంపెనీలను దర్యాప్తు సంస్థలు పరిశీలించాలని ప్యానెల్ సూచించింది. ఈ నగదు, ఇన్వెస్ట్‌మెంట్లు, రుణం, అడ్వాన్సులు లేదా మొత్తం భారాలు, అప్పులలో ఏదైనా దాని టర్నోవరులో ఐదు రెట్లకన్నా ఎక్కువగా ఉంటే, వాటికి ఎర్ర జెండాలు చూపవచ్చని తెలిపింది. ఒక కంపెనీ వాటా మూలధనంలో 75 శాతం ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీల అధీనంలో ఉన్నా లేదా చట్టబద్ధంగా సమర్పించవలసిన వార్షిక పత్రాలను రెండేళ్ళు లేదా అంతకు మించిన కాలంగా దాఖలు చేయకపోయినా, అటువంటి కంపెనీల వ్యవహారాలను పరిశీలించవలసిందని టాస్క్ ఫోర్స్ సిఫార్సు చేసింది. ఒకే ఆఫీసుతో 10 కంపెనీలు రిజిస్టరైనా లేదా కనీసం వాటిలో సగం సంస్థలకు ఒకే డైరెక్టర్లు ఉన్నా, లేదా సదరు కంపెనీ గత రెండేళ్ళలో తన డైరెక్టర్లలో సగం మందిని మార్చేసినా, అటువంటి కంపెనీలను కూడా తప్పనిసరిగా పరిశీలించవలసిందేనని వెల్లడించింది. డొల్ల కంపెనీలపై విరుచుకుపడేందుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆదేశంపై ఈ టాస్క్ ఫోర్స్ ఏర్పాటైంది. వివిధ నియంత్రణ సంస్థలు, మంత్రిత్వ శాఖలు, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజన్సీల వారు దీనిలో సభ్యులుగా ఉన్నారు. రెవిన్యూ కార్యదర్శి, కార్పొరేట్ వ్యవహారాల శాఖ కార్యదర్శి దీనికి సహ-అధ్యక్షులుగా ఉన్నారు. నీరవ్ మోదీ-మెహుల్ చోక్సీల ఉదంతంలో దర్యాప్తు సంస్థలు కనుగొన్న అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవలసిందని, ప్రభుత్వం ఇటీవల ఈ టాస్క్ ఫోర్స్‌ను కోరింది. నిధులు దారి మళ్ళించేందుకు, అందుకునేందుకు వారిద్దరూ 200లకు పైగా డొల్ల కంపెనీలను ఉపయోగించుకున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. రూ. 127 బిలియన్ల లెటర్స్ ఆఫ్ అండర్‌టేకింగ్ (ఎల్ వోయూ) కుంభకోణంలో నీరవ్, మెహుల్ ప్రధాన నిందితులుగా ఉన్నారు. పెద్ద నోట్ల (రద్దు) మార్పిడికి 2016లో అవకాశం ఇచ్చిన తర్వాత, పద్దుల్లో చూపని నగదును మళ్ళించేందుకు ఆ కంపెనీలను దుర్వినియోగపరచారని కూడా టాస్క్ ఫోర్స్ ప్రముఖంగా పేర్కొంది. ''ఇతరులకు చెందిన చట్ట విరుద్ధ ద్రవ్యాన్ని ఉంచేందుకు ఆ కంపెనీలను ఉపయోగించుకోవడానికి ఎంతైనా అవకాశం ఉంది'' అని అది తెలిపింది. అటువంటి కంపెనీలు దాఖలు చేసిన ఫైనాన్షియల్ స్టేట్‌మెంట్లను కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (ఎం.సి.ఎ) ప్రత్యేకించి పరిశీలించాలని కూడా టాస్క్ ఫోర్స్ కోరింది.



అలాగే, రుణాలలో అసాధారణమైన పెరుగుదల లేదా తరుగుదల ఉంటే, లేదా మొండి బాకీలలో 10 శాతంపైగా తిరిగి వచ్చినా, భాగస్వామ్య సంస్థల పెట్టుబడి 100 శాతం లేదా అంతకుమించి ఉన్నా అటువంటి సంస్థలను అనుమానించవలసిందేనని తెలిపింది.

టాస్క్ ఫోర్స్ తన నివేదికలో, డొల్ల కంపెనీకుండే ప్రతి లక్షణాన్ని విస్తృతంగా వివరించిందని అభిజ్ఞ వర్గాలవారు తెలిపారు. టాస్క్ ఫోర్స్ ఈ నెలాఖరునాటికి నివేదికను ప్రభుత్వానికి సమర్పించగలదని భావిస్తున్నారు.

పన్నుల స్వర్గాలలో ''ఏజంట్లుగా పనిచేసే వృత్తినిపుణులు ఉన్నారు. వారు కంపెనీలను రిజిస్టరు చేయిస్తారు. చిరునామాలు, ఇతర సదుపాయాలు సమకూరుస్తారు'' అని నివేదిక వివరించింది. ఇలాంటి కంపెనీలను ''పోస్ట్ బాక్స్'' కంపెనీలని కూడా అంటారు. ఆయా ప్రదేశాల్లో వాటికి భౌతికపరమైన ఉనికి ఏదీ ఉండదు. అవి కాగితంపైన మాత్రమే ఉంటాయి. ''ఈ సంస్థలు న్యాయపరంగా చెల్లుబాటయ్యే విధంగా ఆస్తులు కలిగి ఉంటాయి. లావాదేవీలకు ముసుగు తొడగడానికి, అక్రమంగా సంపాదించిన సొమ్మును దాచుకునేందుకు, విదేశాల్లో ఖాతాలు నిర్వహించేందుకు, పన్నులు ఆదా చేసేందుకు, ఇతర ప్రయోజనాలకు వాటిని ఉపయోగించుకుంటారు'' అని నివేదిక తెలిపింది.

డొల్ల కంపెనీలవడానికి అవకాశం ఉన్న వాటిని కంపెనీ డాటాబేస్ ఆధారంగా గుర్తించడానికి డొల్ల కంపెనీ నిర్వచనం ఒక్కటే సరిపోదని టాస్క్ ఫోర్స్ పేర్కొంది. చట్టబద్ధమైన, చట్టవిరుద్ధమైన వ్యా పారాల మధ్య హద్దు రేఖ చాలా సన్ననిదని తెలిపింది. అందుకని డొల్ల కంపెనీల లక్షణాలన్నింటినీ దర్యాప్తు సంస్థలు, నియంత్రణ సంస్థలు గుదిగుచ్చి చూసుకుని, రిజిస్టరైన మొత్తం కంపెనీల నుంచి ఒక కుదించిన జాబితాను తయారు చేసుకోవాలి. అంతిమ లబ్ధి పొందిన యజమానులను గుర్తించేందుకు అవి తదుపరి దర్యాప్తును కొనసాగించవచ్చని టాస్క్ ఫోర్స్ తెలిపింది.

NSIC


మార్జిన్ తీసుకునే గ్యారంటీలిచ్చాం


న్యూఢిల్లీ: వంద శాతం మార్జిన్ తీసుకునే నేషనల్ స్మాల్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్ (ఎన్.ఎస్.ఐ.సి)కి రూ. 155.5 కోట్ల మేరకు బ్యాంక్ గ్యారంటీలు జారీ చేసినట్లు యునైటెడ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యు.బి.ఐ) శనివారంనాడు వెల్లడించింది. పశ్చిమ బెంగాల్‌లో ఎన్.ఎస్.ఐ.సి ప్రమేయం ఉన్న , యు.బి.ఐలో చోటుచేసుకున్న రూ. 173 కోట్లకు పైగా మోసానికి సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇ.డి) గుప్త ధన చెలామణీ నిరోధక కేసును 2016లో నమోదు చేసింది. ''100 శాతం మార్జిన్ తీసుకునే, ఎన్.ఎస్.ఐ.సికి రూ. 155.50 కోట్ల మేర బ్యాంక్ గ్యారంటీ(బి.జి)లను బ్యాంక్ జారీ చేయడం జరిగిందని మేం స్పష్టం చేయదలచుకున్నాం'' అని బొంబాయి స్టాక్ ఎక్స్చేంజి (బి.ఎస్.ఇ)కి యు.బి.ఐ నివేదించింది. రూ. 18 కోట్ల మేరకు మరిన్ని బి.జిల జారీ ఖరారును ఎన్.ఎస్.ఐ.సి కోరింది. తాము అటువంటివి ఏవీ జారీ చేయలేదని బ్యాంక్ రికార్డులు కూడా స్పష్టం చేస్తున్నాయని యు.బి.ఐ వెల్లడించింది. రూ. 155.5 కోట్లను నిర్ణీత సమయాల్లో, ముందుగానే బ్యాంక్ గ్యారంటీలను ఎన్.ఎస్.ఐ.సి వాడుకుంది. నగదును ''వారి ఖాతాలో జమ చేశాం'' అని యు.బి.ఐ తెలిపింది. ఈ అంశంపై 2016 జూలై నుంచి పశ్చిమ బెంగాల్ సి.ఐ.డి దర్యాప్తు జరుపుతోంది.

వరల్డ్ రియల్టర్స్ డే కార్యక్రమం

CREAA NAR INDIA

చెన్నై: వచ్చే వారం ఇక్కడ జరుగనున్న వార్షిక 'వరల్డ్ రియల్టర్స్ డే'లో అగ్ర శ్రేణి రియల్టర్లు, సీనియర్ అధికారులు పాల్గొననున్నారు. దీనికి 400 మందికి పైగా ప్రాపర్టీ డెవలపర్లు కూడా హాజరు కానున్నారు. చెన్నై రియల్ ఎస్టేట్ ఏజంట్ అసోసియేషన్ (క్రియా) మార్చి 21న నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి గృహ నిర్మాణ, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్. కృష్ణన్ అధ్యక్షత వహిస్తారని ఒక పత్రికా ప్రకటనలో తెలిపారు. ''దేశవ్యాప్తంగా ఉన్న 45 వేర్వేరు రియల్టర్ల సంఘాలకు చెందిన సభ్యులు ఈ కార్యక్రమానికి హాజరవుతారు. స్థిరాస్తుల లావాదేవీలలో 80 శాతం పైగా భాగం రియల్ ఎస్టేట్ ఏజంట్ల ప్రమేయంతోనే సంభవిస్తున్న సంగతి వాస్తవం'' అని క్రియా చెన్నై శాఖ అధ్యక్షుడు అజీమ్ అహ్మద్ చెప్పారు. ఈ కార్యక్రమంలో కాన్ఫెడరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియాకు చెందిన అజిత్ కోర్డియా, సురేశ్ క్రిషన్‌లు కూడా పాల్గొంటారని భావిస్తున్నట్లు ఆయన చెప్పారు. విక్రయానికి ముందు, విక్రయానంతర సేవలను రియల్ ఎస్టేట్ ఏజంట్లు సమకూరుస్తారని, కస్టమరు లాయల్టీని పెంపొందించేందుకు రియల్ ఎస్టేట్ నియమ నిబంధనలకు సంబంధించిన జటిలమైన విధి విధానాలను వివరిస్తారని అహ్మద్ చెప్పారు.





ఏపీఐల దిగుమతులపై ఆధారపడడం తగ్గాలి

pharmexcil

విశాఖపట్నం: ఔషధాల తయారీలో ఉపయోగించే క్రియాశీల ఉత్పాదక సామగ్రి (ఏపీఐలను), మధ్యంతర వస్తువుల దిగుమతికి చైనా, ఇటలీలపై ఆధారపడడాన్ని తగ్గించుకోవాలని భారత్ భావిస్తోంది. ఫార్మాస్యూటికల్స్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఫార్మెక్సిల్), జాతీయ పరిశోధన సంస్థలు అందుకు తగ్గ పథకాలు రూపొందిస్తున్నాయని ఫార్మెక్సిల్ డైరెక్టర్-జనరల్ ఆర్. ఉదయ్ భాస్కర్ చెప్పారు. ''ఏపీఐల దిగుమతులకు భారతదేశం ఎక్కువగా చైనాపై ఆధారపడుతోంది. ఇటీవలి కాలం వరకు కూడా చైనా, ఏపీఐలను తక్కువ ధరలకే విక్రయిస్తూ వచ్చింది. అక్కడ సిబ్బంది వ్యయాలు తక్కువగా ఉండడమే దానికి కారణం. ఏపీఐలపై లాభాల మార్జిన్ తక్కువగా ఉండడంతో, భారతదేశపు ఔషధ తయారీ సంస్థలు ఏపీఐలను దిగుమతి చేసుకోవడమే మేలైన పనిగా భావించాయి. ఆ పదార్థాలతో ఇక్కడ మందులు తయారు చేసి ఎగుమతి చేయడాన్ని వివేకవంతమైన పనిగా అభిప్రాయపడ్డాయి'' అని ఉదయ్ భాస్కర్ చెప్పారు. ''ఔషధాల పరిశ్రమను షెడ్యూలు-ఎం నుంచి డబ్ల్యు.హెచ్.ఓ-జి.ఎం.పి నిబంధనల పాటింపునకు బదలాయింపు'' అనే అంశంపై ఏర్పాటైన ఒక సదస్సులో పాల్గొనేందుకు ఆయన శుక్రవారంనాడు ఇక్కడకు వచ్చారు.

చైనాలో కార్మిక వ్యయాలు పెరగడంతో ఏపీఐల ధరలను చైనా పెంచిందని ఆయన తెలిపారు. ''ఏపీఐలను, మధ్యంతర వస్తువులను అభివృద్ధి చేసుకునేందుకు భారతదేశానికి ఇది సరైన అవకాశం. చైనా భారతదేశం నుంచి ఏపీఐలను కొనుగోలు చేయడం ప్రారంభించింది. ఔషధాల ఫార్ములేషన్లు, తయారీపై ఎక్కువ దృష్టి పెట్టింది. ఆరోగ్య రక్షణ వ్యయాన్ని తగ్గించుకోవాలని అన్ని దేశాలు భావిస్తున్నాయి. ఈ దేశాలు తక్కువ ధరలకు ఔషధాల సరఫరా కోసం ఇండియా, చైనాల వంక చూస్తున్నాయి'' అని ఆయన అన్నారు. జనరిక్ మందుల తయారీలో భారతదేశం నాయకత్వ స్థానంలో ఉందని, ప్రపంచంలోని మొదటి 20 ఔషధ సంస్థలలో ఎనిమిది భారతదేశానికి చెందినవేనని ఆయన చెప్పారు. ''ప్రపంచానికి జనరిక్స్ సరఫరాలో ఇది భారతదేశానికి సానుకూలాంశంగా ఉంది. ఫార్మా ఎగుమతులలో భారతదేశం పరిమాణంలో మూడవ స్థానంలో, విలువలో పదవ స్థానంలో ఉంది. మన ఎగుమతులలో 50 శాతం పైగా అధిక నియంత్రణ మార్కెట్లైన అమెరికా, యూరప్‌లకే వెళుతున్నాయి'' అని ఉదయ్ భాస్కర్ చెప్పారు. ఎగుమతులను ప్రోత్సహించడంలో ఫార్మెక్సిల్ పాత్ర గురించి ప్రస్తావిస్తూ, కౌన్సిల్ ప్రధాన లక్ష్యం ఫార్మా ఎగుమతులను ప్రోత్సహించడమేనని చెప్పారు. భారతీయ, విదేశీ ఉత్పత్తి సంస్థలకు, సంబంధిత ప్రభుత్వాలకు మధ్య సమన్వయకర్తగా కౌన్సిల్ వ్యవహరిస్తోందని తెలిపారు. ప్రోత్సాహకాలు, రాయితీలు అందేట్లు చేస్తోందని చెప్పారు. అంతర్జాతీయ ఎగ్జిబిషన్లలో భారతీయ ఎగుమతిదార్లు తమ ఉత్పత్తులను ప్రదర్శించేందుకు ఒక వేదికను కల్పిస్తోందని తెలిపారు. పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చేందుకు దేశంలోని వివిధ ప్రాంతాల్లో ప్రాథమిక రసాయనాలు, మధ్యంతర వస్తువుల తయారీకి ప్రత్యేకమైన క్లస్టర్లను ఏర్పాటు చేయవలసిన అవసరం గురించి వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖకు కౌన్సిల్ సిఫార్సు చేస్తుందని ఉదయ్ భాస్కర్ వెల్లడించారు.

కొబ్బరి పీచు ఉత్పత్తులకు మర మగ్గం ఆవిష్కరణ

కోయంబత్తూరు: నాణ్యమైన కొబ్బరి పీచు జియో టెక్స్‌టైల్స్‌ని ఉత్పత్తి చేసేందుకు కేరళలో ఆళప్పుళలోని సెంట్రల్ కాయిర్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాయిర్ బోర్డ్ పూర్తి ఆటోమేటిక్ మర మగ్గాన్ని ప్రారంభించింది. కొత్త మగ్గం బహుళ ప్రయోజనాలను అందిస్తుంది. మంచి నాణ్యత కలిగిన కాయిర్ జియో టెక్స్‌టైల్స్‌ని 5-6 రెట్లు ఎక్కువ పరిమాణంలో సమకూరుస్తుంది. ఖర్చు కూడా తగ్గుతుంది. కాయిర్ బోర్డ్ చైర్మన్ సి.పి. రాధాకృష్ణన్ ఈ మర మగ్గాన్ని ఆవిష్కరించారు. నూతన/యువ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు కాయిర్ ఉద్యమి యోజన, ముద్రా బ్యాంకింగ్ సిస్టం, స్వయం ఉపాధి కల్పన పథకాల కింద ఈ కొబ్బరి పీచు మర మగ్గాన్ని కొనుగోలు చేయవచ్చు. ఇతర వెజిటబుల్ ఫైబర్ ఉత్పత్తులతో పోలిస్తే కాయిర్ జియో టెక్స్‌టైల్స్ జీవావరణ, పర్యావరణ స్నేహపూర్వకమైనవి. మట్టిలో కలిసిపోయే లక్షణం కలవి. సహజమైనవి. మన్నికైనవి. చౌక ధరకు లభించేవి. కాయిర్ జియో టెక్స్‌టైల్స్ ఎగుమతుల పరిమాణం పెరుగుతూ వస్తున్న ధోరణి ఉంది. దేశ, విదేశాల లోపల డిమాండ్ తీర్చేందుకు ఈ కొత్త ఆవిష్కరణ తోడ్పడుతుందని కొబ్బరి పీచు బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది. కాయిర్ జియో టెక్స్‌టైల్స్ తయారీకి కొత్త మర మగ్గం పట్ల ఎగుమతిదార్లు ఆసక్తి చూపారని ఆ ప్రకటన తెలిపింది. సహకార రంగం కూడా తమ యూనిట్లలో ఈ మర మగ్గాలను ఏర్పాటు చేసుకోవచ్చని చెప్పింది. దానివల్ల ఉత్పత్తి పెరుగుతుంది. కాయిర్ వర్కర్లకు మంచి ప్రతిఫలం లభిస్తుంది.

ఎఫ్.ఆర్.డి.ఐ బిల్లు నివేదిక సమర్పణకు గడువు పొడిగింపు



న్యూఢిల్లీ: ఫైనాన్షియల్ రిజల్యూషన్ అండ్ డిపాజిట్ ఇన్స్యూరెన్స్ బిల్లు (ఎఫ్.ఆర్.డి.ఐ బిల్లు)ను పరిశీలిస్తున్న సంయుక్త కమిటీ నివేదికను సమర్పించేందుకు లోక్ సభ శుక్రవారంనాడు మరింత సమయాన్ని ఇచ్చింది. బ్యాంకింగ్ వ్యవస్థలోని డిపాజిట్‌దార్లకు దీన్ని ఊరటగా భావిస్తున్నారు. పార్లమెంట్ సంయుక్త కమిటీ ఇప్పుడు తన నివేదికను 2018 వర్షాకాల సమావేశాల చివరి రోజున సమర్పించవచ్చని లోక్ సభ ఒక తీర్మానాన్ని ఆమోదించింది. బి.జె.పి సభ్యుడు భర్తృహరి మహతాబ్ ఈ మేరకు సభలో శుక్రవారంనాడు ఒక తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ప్రస్తుత బడ్జెట్ సమావేశాలు ముగిసేలోగా సంయుక్త కమిటీ తన నివేదికను సమర్పించవలసి ఉంది. ఇప్పుడు గడువును పొడిగించడమంటే, డిపాజిటర్లు తమ డబ్బు గురించి కలత చెందకుండా నివారించడమే అవుతుంది. ఏ విధమైన 'బెయిల్ ఇన్'కీ తమ డబ్బును ఇప్పటిప్పట్లో ఉపయోగించే అవకాశం లేదని డిపాజిటర్లు ఊరట చెందవచ్చు. విఫలమైన బ్యాంకుల 'బెయిల్ ఇన్'కి డిపాజిటర్ల సొమ్మును వినియోగించవచ్చని ఎఫ్.ఆర్.డి.ఐ బిల్లు సూచిస్తోంది. ఈ బిల్లు ప్రజానీకంలో విస్తృతంగా భయాందోళనలను రేకెత్తించింది. బిల్లులోని 'బెయిల్ ఇన్' క్లాజు వల్ల బ్యాంకులలోని డిపాజిట్లను తిరిగి ఇవ్వకపోవచ్చని ఆందోళనలు నెలకొన్నాయి. గత ఏడాది వర్షాకాల సమావేశాల చివరి రోజున ఎఫ్.ఆర్.డి.ఐ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టారు. ఈ బిల్లు ప్రస్తుతం పార్లమెంట్ సంయుక్త కమిటీ పరిశీలనలో ఉంది. బ్యాంకులు, బీమా సంస్థలతో సహా ఫైనాన్షియల్ సంస్థలకు దివాలా విధి విధానాలను సమకూరుస్తున్న ఎఫ్.ఆర్.డి.ఐ బిల్లును ఆమోదించేందుకు గత శీతాకాల సమావేశాలలో కేంద్రం సన్నద్ధమైందనే అభిప్రాయం విస్తృతంగా ఏర్పడింది. ఎఫ్.ఆర్.డి.ఐ బిల్లును ఆమోదించడంలో తొందరపడవద్దని బ్యాంకు ఉద్యోగుల సంఘాలు కేంద్రాన్ని హెచ్చరించాయి. దాన్ని తేకూడని సమయంలో తీసుకువచ్చారని, పైగా, భారతదేశంలో ఇది అవాంఛనీయమైనదని అవి వాదించాయి. బిల్లు విషయంలో ముందుకు వెళ్ళవద్దని సూచించాయి.

నోవార్టిస్‌కు జియా రాజీనామా



న్యూఢిల్లీ: నోవార్టిస్ ఇండియా వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ జావేద్ జియా పదవి నుంచి వైదొలగాలని నిర్ణయించుకున్నారని కంపెనీ శనివారంనాడు వెల్లడించింది. ఆయన 2018 మే 31న బాధ్యతల నుంచి తప్పుకుంటారని కంపెనీ బి.ఎస్.ఇకి తెలిపింది. కంపెనీ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ పదవికి తగిన వారసుడిని ఎంపిక చేసి, సిఫార్సు చేయవలసిందిగా డైరెక్టర్ల బోర్డు నామినేషన్, రెమ్యూనిరేషన్ కమిటీని కోరినట్లు కంపెనీ వెల్లడించింది. భారతదేశంలో నోవార్టిస్ ఇండియా లిమిటెడ్ ఫార్మాస్యూటికల్ వ్యాపారం ఎముకలు, నొప్పి, కాల్షియం పోర్ట్‌ఫోలియో, గైనకాలజీ, న్యూరోసైన్స్‌పై దృష్టి కేంద్రీకరించింది. జనరిక్ వ్యాపారం గైనకాలజీ, యాంటీ-టీబీ, యాంటీ ఇన్‌ఫెక్టీవ్‌లపై దృష్టి పెట్టింది.



ప్రగతి భవన్‌లో శనివారం సీఎం కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన సైబరాబాద్ నూతన కమిషనర్ సజ్జనార్





ఢిల్లీలో శనివారం జరిగిన ఏఐసీసీ ప్లీనరీలో రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జి ఆర్సీ కుంతియా, టీపీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సంపత్‌కుమార్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తదితరులు

16 ఎంపీ సీట్లు గెలుస్తాం: కోమటిరెడ్డి

హైదరాబాద్, మార్చి 17(మనం ప్రతినిధి) వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో 16 పార్లమెంట్ సీట్లు గెలిచి, రాహుల్ గాంధీని ప్రధాన మంత్రి చేయడంతో తమ వంతు పాత్ర పోషిస్తామని కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి చెప్పారు. ఢిల్లీలో శనివారం నాడు ప్రారంభమైన ఏఐసీసీ ప్లీనరీలో కోమటి రెడ్డి ప్రసంగించారు. సోనియా లేకుంటే తెలంగాణ వచ్చేదికాదన్నారు. విభజన హామీలను మరిచిన కేంద్ర ప్రభుత్వంపై అవిశ్వాసం పెడితే దానికి టీఆర్ఎస్ మద్దతు ఇవ్వడంలేదంటేనే మడీకి కేసీఆర్ ఏజెంట్ అన్న విషయం అర్థమవుతుందని విమర్శించారు. మోదీకి మోడీకి భాగస్వామిగా ఉంటూ థర్డ్ ఫ్రంట్ గురించి మాట్లాడుతున్న కేసీఆర్ మోసాన్ని ప్రజలు గమనించాలని కోమటి రెడ్డి కోరారు.

సీఎం కేసీఆర్ ఉగాది శుభాకాంక్షలు

హైదరాబాద్, మార్చి 17(మనం ప్రతినిధి): రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. శ్రీవిళంబినామ సంవత్సరంలో తెలంగాణ ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని సీఎం ఆకాంక్షించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు అందాలని.. వాటితో రాష్ట్రం ముందుకు సాగాలని కేసీఆర్ ఈ సందర్భంగా ఆకాంక్షించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ప్రజలకు గవర్నర్ నరసింహన్ శ్రీవిళంబినామ ఉగాది పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ పర్వదినాన్ని ప్రజలు ఆనందంగా జరుపుకోవాలని, ఈ ఉగాది ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలని గవర్నర్ ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రజలకు మంత్రి హరీశ్ రావు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. విళంబి నామ సంవత్సరంలో తెలంగాణ ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని ఆయన అన్నారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు అందాలని హరీశ్‌రావు ఆకాంక్షించారు. తెలుగు నూతన సంవత్సరంలో తెలంగాణ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, రైతులకు పాడి పంటలు సమృద్ధిగా పండాలని, తెలంగాణ అంతా సుఖ శాంతులతో వర్ధిల్లాలని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆకాంక్షించారు. తెలుగు రాష్ట్ర ప్రజలకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ విళంబి నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.

ఆ డబ్బులు ఏమయ్యాయి?

- ఇసుక ఆదాయంపై కాంగ్రెస్‌కు కేటీఆర్ ప్రశ్న



హైదరాబాద్, మార్చి 17: కాంగ్రెస్ పదేళ్ల కాలంతో పోలిస్తే టీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇసుక ద్వారా రాష్ట్ర ఖజానాకు వచ్చే ఆదాయం వందరెట్లు పెరిగిందని మంత్రి కేటీఆర్ తెలిపారు. 2004 నుంచి 2014 వరకు ఇసుక ద్వారా ఏడాదికి సగటున నాలుగు కోట్ల చొప్పున రూ. 39 కోట్ల కు పైగా ఆదాయం వచ్చిందని చెప్పారు. రాష్ట్ర ఆవిర్భావం అనంతరం 2014 నుంచి 2018 వరకు కేవలం నాలుగేళ్లలోనే ఆదాయం ఏకంగా రూ.1609 కోట్లకు చేరుకొందని, సగటున ఏడాదికి రూ.400 కోట్లకుపైగా ఆదాయం వచ్చిందని వివరించారు. ఇసుక ద్వారా ప్రభుత్వానికి వచ్చే ఆదాయం వంద రెట్లు పెరిగిందని, గతంలో ఈ డబ్బంతా ఎక్కడికి వెళ్లిందని ట్విట్టర్ ద్వారా కేటీఆర్ కాంగ్రెస్ నేతలను ప్రశ్నించారు. వాస్తవాలు ఇలా ఉంటే కాంగ్రెస్ పార్టీ నేతలు ఇసుక మాఫియాను అరికట్టాలంటూ నీతులు చెప్పడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. ఉల్టా చోర్ కొత్వాల్ కో డాంటే అన్న చందాన కాంగ్రెస్ నేతలు వ్యవహరిస్తున్నారని మంత్రి ఆక్షేపించారు.



మహిళా లీడర్‌షిప్ సమ్మిట్‌లో ఎంపీ కవిత తదితరులు

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

- 'మహిళా లీడర్‌షిప్ సమ్మిట్'లో ఎంపీ కవిత

హైదరాబాద్, మార్చి 17: అన్ని రంగాల్లోనూ మహిళల ప్రాధాన్యం పెరగాలని ఎంపీ కవిత ఆకాంక్షించారు. మహిళా సాధికారతకు ప్రభుత్వాలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లో శనివారం నల్సార్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో మహిళా లీడర్‌షిప్ సమ్మిట్ –2108 జరిగింది. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన కవిత మాట్లాడుతూ.. మహిళలకు నాయకత్వ లక్షణాలు ఉండాలన్నారు. వారసత్వం నుంచి వచ్చే మహిళలను ప్రశ్నిస్తున్నారు. పురుషులను నిలదీయరా? అని ఆమె ప్రశ్నించారు. తెలంగాణ ప్రభుత్వం మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తుం దన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా పారిశ్రామికవేత్తల కోసం వీ హబ్‌ను ప్రారంభించామని తెలిపారు. వీ హబ్‌కు బడ్జెట్‌లో రూ. 15 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికి మంచినీరు అందించి మహిళలకు కష్టాలు లేకుండా చేస్తున్నామని పేర్కొన్నారు. దీని వల్ల సమయం ఆదా అవుతుంది. మహిళలు చదువుకునేందుకు వెసులుబాటు కలుగుతుందన్నారు. మహిళల భద్రత కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా షీటీమ్స్ అద్భుతంగా పని చేస్తున్నాయని ప్రశంసించారు.

త్వరలో టీ టీడీపీ నియామకాలు

- ముఖ్య నేతలతో చర్చించిన ఎల్.రమణ
- 29న పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

హైదరాబాద్, మార్చి 17(మనం ప్రతినిధి): నియోజకవర్గ స్థాయిలో నాయకుల నియామకం త్వరలో చేపడతామని తెలుగుదేశం పార్టీ తెలంగాణ అధ్యక్షుడు ఎల్. రమణ చెప్పారు. ఈ నెల 29వ తేదీన పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు సంబంధించి శనివారం హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ భవన్‌లో పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకులతో రమణ సమావేశమయ్యారు. ఆవిర్భావ దినోత్సవ వేడుకల ఏర్పాట్లుతో పాటు పల్లెపల్లెకు తెలుగుదేశం కార్యక్రమం తీరుపై చర్చించారు. అలాగే నియోజకవర్గ స్థాయి నాయకుల నియామకం చేపడతామని రమణ ఈ సందర్భంగా చెప్పారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని 29న రాష్ట్రవ్యాప్తంగా వేడుకలు నిర్వహించాలని రమణ సూచించారు. ఈ సమావేశంలో పొలిట్ బ్యూరో సభ్యులు రావుల చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు అమర్‌నాథ్ బాబు, బుచ్చిలింగం, తదితరులు పాల్గొన్నారు. కాగా, టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ఏపీ సీఎం చంద్రబాబునాయుడు, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రమణ తెలుగు ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.

'గుర్తింపు' హోదా.. జాడేది?

రెండేండ్లా.. నాలుగేండ్లా?..

టీబీజీకేఎస్‌కు స్పష్టతేది?

- అయోమయంలో సంఘం నేతలు
- సింగరేణితో కేంద్రం దోబూచులు
- సమస్యలపై సంఘంతో నిలిచిన చర్చలు

హైదరాబాద్, మార్చి 17 (మనం ప్రతినిధి) : అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందంగా సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘం హోదా పరిస్థితి మారింది. రాష్ట్రంలో అధికారంలో ఉన్న టీఆర్ఎస్‌తోపాటు జాతీయ కార్మిక సంఘాలు సింగరేణి కాలరీస్ కంపెనీలో గుర్తింపు సంఘం ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. రాష్ట్రంలోనే అతిపెద్ద ప్రభుత్వరంగ పరిశ్రమగా విరాజిల్లుతున్న సింగరేణిలో గుర్తింపు సంఘం హోదా ఎన్నికలు గతేడాది అక్టోబర్ 17న జరిగాయి. ఫలితాలు వెలువడ్డాయి. గుర్తింపు సంఘంగా టీఆర్ఎస్ అనుబంధ తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం(టీబీజీకేఎస్) గెలిచింది. అయినా ఫలితం లేకుండా పోయింది. ఎన్నికలు జరిగి ఐదు నెలలు గడుస్తున్నా గుర్తింపు సంఘం హోదా సర్టిఫికెట్ యూనియన్‌కు అందలేదు. మొన్నటి దాకా యూనియన్ కమిటీలు లేకపోవటంతో నాయకత్వం విషయంలో కొంత ఇబ్బందిని నాయకులు ఎదుర్కొన్నారు. ఇటీవలనే యూనియన్ గౌరవ అధ్యక్షురాలు, ఎంపీ కవిత కమిటీలను ప్రకటించారు. కానీ కార్మిక సమస్యలపై యాజమాన్యంతో చర్చించే అవకాశం లేకుండా పోయింది.

కేంద్ర కార్మిక శాఖ X సింగరేణి..

గెలిచిన కార్మిక సంఘానికి గుర్తింపుహోదా పత్రం ఇచ్చే విషయంలో కేంద్ర కార్మికశాఖ, సింగరేణి యాజమాన్యం మధ్య దోబూచులాట కొనసాగుతోంది. సింగరేణిలోని 11 ఏరియాల్లో 9ఏరియాల్లో టీబీజీకేఎస్, 2 ఏరియాల్లో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) గెలిచింది. గెలిచిన సంఘానికి గుర్తింపు హోదా సర్టిఫికెట్‌ను కేంద్ర కార్మిక సంఘం సింగరేణి యాజమాన్యానికి పంపించాల్సి ఉంది. ఎన్నికలు జరిగి ఐదు నెలలు గడిచినా టీబీజీకేఎస్‌కు గుర్తింపుపత్రం రాని పరిస్థితి ఉంది. అదేవిధంగా రెండు ఏరియాల్లో విజయం సాధించిన ఏఐటీయూసీకి ప్రాతినిధ్య సంఘంగా పత్రం వస్తుందో లేదో అర్థం కాకుండా ఉంది. గుర్తింపుపత్రం ఇచ్చేబాధ్యత మాదికాదంటే మాది కాదని కేంద్ర కార్మిక శాఖ, సింగరేణి పేర్కొంటూ తమకు సంబంధం లేదన్నట్టుగా వ్యవహరిస్తున్నాయని నాయకులు ఆరోపిస్తున్నారు. సాధారణంగా ఫలితాలు వెలువడిన నెలరోజుల్లోగా గెలిచిన సంఘానికి కేంద్ర కార్మిక సంఘం సంబంధిత గుర్తింపు హోదా సర్టిఫికెట్‌ను సింగరేణి యాజమాన్యానికి పంపించేంది. దీని ఆధారంగా యాజమాన్యం ఆయా సంఘాన్ని గుర్తింపుసంఘంగా, ఏరియాల వారీగా ప్రాతినిధ్య సంఘాలుగా గుర్తించేది. కాగా ఐదు నెలలు గడిచినా గుర్తింపు, ప్రాతినిధ్య పత్రాలు ఇవ్వటంలో జాప్యం చేస్తుండటంపై కేంద్ర కార్మికశాఖ తీరుపై కార్మికులు మండిపడ్తున్నారు.

రెండేండ్లా.. నాలుగేండ్లా..

గుర్తింపుసంఘం కాలపరిమితిపై సింగరేణిలో వివాదం చెలరేగుతుంది. నాలుగేండ్ల కాలపరిమితితోనే ఎన్నికలు జరుగగా రెండేండ్ల కాలపరిమితిగా కేంద్ర కార్మిక శాఖ నిర్ణయించడంతో గందరగోళం నెలకొంది. నాలుగేండ్ల కాలపరిమితితో ఎన్నికలు నిర్వహించిన ఫలితాల తర్వాత రెండేండ్లకే పరిమితం అని కేంద్ర కార్మిక శాఖ పేర్కొనటం పట్ల గుర్తింపుసంఘం నాయకులు గుర్రుగా ఉన్నారు. గతంలో మాదిరిగానే నాలుగేండ్ల కాలపరిమితితో గుర్తింపుపత్రం ఇవ్వాలని సింగరేణి యాజమాన్యానికి, కేంద్ర కార్మికశాఖను నాయకులు కోరారు. కేంద్ర కార్మిక శాఖ నుంచి ఇప్పటి వరకు ఎటువంటి స్పందన రాకపోవటం గమనార్హం. గుర్తింపుసంఘం కాలపరిమితి రెండేండ్లకే పరిమితం చేయటాన్ని నిరసిస్తూ టీబీజీకేఎస్ నేతలు కోర్టుకెళ్లేందుకు సన్నద్ధమవుతున్నారు. నిన్నమొన్నటి వరకు యూనియన్ కమిటీలు లేకపోవటంతో కొంత ఇబ్బందికి టీబీజీకేఎస్ నాయకత్వం గురైంది. ప్రస్తుతం కమిటీలు వేయటంతో కోర్టుకెళ్లే ఆలోచనలో నేతలున్నట్టుగా సమాచారం. ఎన్నికల ముందు అన్ని కార్మిక సంఘాల అభిప్రాయాలు తీసుకొని నాలుగేండ్ల కాలపరిమితితో ఎన్నికలను నిర్వహించారు. ప్రస్తుతం రెండేండ్లకే పరిమితం చేయటం అన్యాయమని టీబీజీకేఎస్ నేతలు వాపోతున్నారు. గతంలో కంపెనీస్థాయిలో అత్యధిక ఓట్లు సాధించిన యూనియన్‌ను గుర్తింపుసంఘంగా, ఏరియాల్లో అత్యధిక ఓట్లు సాధించిన యూనియన్‌ను ప్రాతినిధ్య సంఘంగా గుర్తించటం సర్వసాధారణం, కాగా కేంద్ర కార్మిక సంఘం ఈ సారి ప్రాతినిధ్య సంఘం ఊసెత్తకపోవటం సర్వత్రా చర్చానీయాంశంగా మారింది. ఎన్నికల్లో ఓటమి పాలైన యూనియన్లు మాత్రం రెండేండ్ల కాలపరిమితిపై పరోక్షంగా హర్షం వ్యక్తం చేస్తుండటం గమనార్హం.



సమస్యలపై చర్చలేవి..?

గుర్తింపు సంఘం పత్రం రాకపోవటంతో కార్మికుల సమస్యలపై యాజమాన్యంతో చర్చించేవారే కరవయ్యారు. గెలిచిన యూనియన్లతోనే కార్మికుల సమస్యలపై యాజమాన్యం గనులు, ఏరియాలు, రీజియన్, కంపెనీ స్థాయిలో ప్రతి నెల, ప్రతి మూడు నెలలకోసారి సమావేశాలను నిర్వహిస్తుంటుంది. ఈ క్రమంలోనే పలు కార్మిక సమస్యలకు పరిష్కారం దొరికేది. గుర్తింపు హోదా లేకపోవటంతో గెలిచినా కార్మిక సమస్యలపై యాజమాన్యంతో మాట్లాడలేని పరిస్థితి.

'బీసీ' బిల్లుకు కేంద్రం ఓకే

- ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే ఆమోదం
- కేంద్ర మంత్రి రాందాస్ హామీ: ఆర్.కృష్ణయ్య
- మంత్రిని, 74 మంది ఎంపీలను కలిసిన బృందం



హైదరాబాద్, మార్చి 17(మనం ప్రతినిధి): ఈ పార్లమెంట్ సమావేశాలు ముగిసేలోగా జాతీయ బీసీ కమిషన్‌కు రాజ్యాంగబద్ధమెన హోదా ఇచ్చే బిల్లును పాస్ చేస్తామని కేంద్ర సామాజిక న్యాయ సాధికార సహాయ మంత్రి రాందాసు అత్వాలే బీసీ నాయకులకు హామీ ఇచ్చారని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య తెలిపారు. శనివారం ఢిల్లీలోని మంత్రి కార్యాలయంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ కృష్ణ నాయకత్వంలోని ప్రతినిధి బృందం గంటకు పైగా చర్చలు జరిపారు. ఈ సమావేశాల్లో బీసీ బిల్లును పాస్ చేయడానికి కేంద్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని, కానీ కొన్ని ప్రతిపక్షాలు వ్యతిరేకించడం వల్ల జాప్యం జరుగుతోందని మంత్రి తెలిపారని ఆర్.కృష్ణయ్య తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ సమావేశాల్లోనే బీసీ బిల్లు నెగ్గించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి హామీ ఇచ్చారని పేర్కొన్నారు.

జాతీయ స్థాయిలో ఫీజుల పథకం పెట్టాలి..

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న ఫీజు రీయంబర్స్‌మెంట్ పథకాన్ని, రెసిడెన్సియల్ పాఠశాలల పథకాన్ని కేంద్రప్రభుత్వం ఆధ్వర్యంలో అన్ని రాష్ట్రాలలో ప్రవేశపెట్టాలని బీసీ నాయకులు మంత్రిని కోరామని కృష్ణయ్య తెలిపారు. బీసీలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యాసంస్థల్లో రిజర్వేషన్లు అమలు చేయడం వల్ల పేద కులాల వారు ఇంజినీరింగ్, మెడిసిన్, ఇతర వృత్తి విద్య ఉన్నత విద్యా కోర్సులలో చదువుకోవడానికి ముందుకు వస్తున్నారని, ఫీజులు ఎక్కువ ఉండడంతో చదువు మానుకుంటున్నారని మంత్రికి వివరించామన్నారు. వెంటనే ఫీజులు ప్రభుత్వం భరించే విధంగా ఈ పథకాన్ని ప్రవేశపెట్టాలని కోరారు. తెలంగాణ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో ఉన్న బీసీ కాలేజీ హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలలు అద్దె భవనాలలో ఉన్నాయని వాటికి సొంత భవనాలు నిర్మించడానికి నిధులివ్వాలని కోరగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి సరియైన ప్రతిపాదనలు వస్తే పెద్ద ఎత్తున నిధులు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారన్నారు. తన అధీనంలో ఉన్న సబ్జెక్టుకు తగ్గకుండా మంత్రి హామీ ఇచ్చారని కృష్ణయ్య తెలిపారు. కాగా, రాజ్యాంగాన్ని సవరించడానికి పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టి బీసీలకు చట్టసభలలో 50శాతం రిజర్వేషన్లు పెట్టాలని, బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని శుక్రవారం 62 మంది, శనివారం 12 మంది ఎంపీలను కలిసి విజ్ఞప్తి చేశామని బీసీ సంఘం ప్రతినిధులు తెలిపారు.

'రాజకీయ' సమన్వయ సమితులు

- సీఎం కేసీఆర్‌కు దాసోజు బహిరంగ లేఖ

హైదరాబాద్, మార్చి 17 (మనం ప్రతినిధి): కేసీఆర్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు సమన్వయ సమితి కాదని అది రాజకీయ సమన్వయ సమితి అని కాంగ్రెస్ ముఖ్య అధికార ప్రతినిధి దాసోజ్ శ్రవణ్ ఆరోపించారు. దీనిపై ముఖ్యమంత్రి కేసీఆర్‌కు దాసోజ్ బహిరంగ లేఖ రాశారు. ఇమేజ్ తగ్గుతున్న ప్రతిసారి ముఖ్యమంత్రి ఏదో ఒక పేరుదో హడావుడి చేయడం అలవాటుగా మారిందని విమర్శించారు. కరువు, గిట్టుబాటు ధరలేక రైతులు విలవిల్లాడుతుంటే పట్టించుకోని మీరు, రైతు సమన్వయ సమితి ఏర్పాటు చేసి ఏదో అద్భుతం జరుగుతుందని ప్రచారం చేసుకుంటున్నారని ఆరోపించారు. మీరు కొనుక్కున్న నాయకులకు రాజకీయ నిరుద్యోగం లేకుండా చేసేందుకు రైతు సమన్వయ సమితి అనే ఓ దళారి వ్యవస్థను ఏర్పాటుచేసి రాజకీయ దళారి గుత్తా సుఖేందర్ రెడ్డిని ఛైర్మన్‌గా నియమించారని ఘాటుగా విమర్శించారు. పంటలకు గిట్టుబాటు రాక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటుంటే ఏనాడు పరామర్శించకుండా ఎన్నికలు సమీపిస్తుండటంతో రైతుల ఓట్లకోసం ఏర్పాటు చేశారన్నారు. సమితిల్లో కేవలం టీఆర్ఎస్ కార్యకర్తలే ఉంటారనడం దివాలాకోరు రాజకీయాలకు నిదర్శనమన్నారు.

చివరి బడ్జెట్‌లోనూ అన్యాయమేనా?

- కార్మికులకు సామాజిక భద్రతేది?: ఏఐటీయూసీ

హైదరాబాద్, మార్చి 17(మనం ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం తన చివరి బడ్జెట్‌లో కూడా కార్మిక సంక్షేమాన్ని విస్మరించిందని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు టి.నరసింహన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం హైదరాబాద్‌లోని సంస్థ కార్యాలయంలో ప్రధాన కార్యదర్శి ఉజ్జిని రత్నాకర్‌రావుతో కలిసి నరసింహన్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న లక్షలాది మంది కార్మికులకు సామాజిక భద్రత కల్పించే విధంగా బడ్జెట్‌లో చర్యలు చేపట్టలేదని విమర్శించారు. రాష్ట్రంలో రెండున్నర లక్షల మంది కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులు కనీస వేతనాలకు కూడా నోచుకోకుండా, ఉద్యోగ భద్రతలేకుండా దుర్భర స్థితిలో బతుకీడుస్తున్నారని పేర్కొన్నారు. అధికారంలోకి రాగానే ఉద్యోగాల భర్తీ, కాంట్రాక్ట్ వ్యవస్థ రద్దు, ఆర్టీసీ కార్మికులకు పే స్కేల్ అమలు, సింగరేణిలో వారసత్వ ఉద్యోగాలు, మునిసిపల్ కార్మికుల జీతాలపెంపు వంటి హామీలిచ్చిన కేసీఆర్.. ఒక్క హామీనీ అమలు చేయకుండా నిరుద్యోగులను, కార్మికులను మభ్య పెడుతున్నారని నరసింహన్ ధ్వజమెత్తారు. రాష్ట్ర కనీస వేతనాల బోర్డు సిఫారసు చేసినా, కనీస వేతనాలను అమలుచేయక పోవడం దారుణమన్నారు. కేసీఆర్ ఇచ్చిన ఈ హామీలన్నింటినీ నెరవేర్చాలని, కనీస వేతనం రూ.18 వేలుగా నిర్ణయించాలని, అసంఘటితరంగ కార్మికులకు ఈయస్ఐ, పీఎఫ్, గ్రాడ్యుటీ, బోనస్ చెల్లించాలనే డిమాండ్‌తో 19 నుంచి 23వరకు ధర్నాలు చేపడతామని నరసింహన్ వెల్లడించారు.

బొట్ల శ్రీనివాస్‌కు పితృవియోగం

హైదరాబాద్, మార్చి 17(మనం ప్రతినిధి): టీటీడీపీ జనగాం జిల్లా అధ్యక్షుడు, పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు బొట్ల శ్రీనివాస్ తండ్రి బొట్ల రాములు మృతి చెందారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు, జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్, ఎల్ రమణ, రావుల, తదితరులు సంతాపం తెలియజేశారు.

తెలంగాణలో వస్త్ర పరిశ్రమకు పెద్దపీట

- అంతర్జాతీయ ప్రమాణాలతో పార్కులు
- వలస జీవులు సొంత రాష్ట్రానికి రావాలి
- టీఎస్ఐఐసీ చైర్మన్ గ్యాదరి బాలమల్లు



హైదరాబాద్, మార్చి 17(మనం ప్రతినిధి): తెలంగాణలో వస్త్ర పరిశ్రమ అభివృద్ధికి సీఎం కేసీఆర్ ప్రాధాన్యమిస్తున్న నేపథ్యంలో ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లిన పరిశ్రమల యజమానులు తిరిగి రావాలని టీఎస్ఐఐసీ చైర్మన్ గ్యాదరి బాలమల్లు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో వస్త్ర పరిశ్రమకు కేంద్రంగా వరంగల్ కాకతీయ మెగా టెక్స్‌టైల్స్, సిరిసిల్లా అపరెల్ పార్కులను పెద్ద ఎత్తున అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. సూరత్, షోలాపూర్, భీవండి ఇతర ప్రాంతాల నుంచి వెనక్కి వచ్చి సొంత రాష్ట్రంలో యూనిట్లను ఏర్పాటు చేసుకునే వారికి స్థలాలను కేటాయిస్తామని పేర్కొన్నారు. తెలంగాణ నుంచి వలస వెళ్లిన సూరత్ వస్త్ర పరిశ్రమల యజమానులతో శనివారం నాడు ఆయన భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మహబూబాబాద్‌లో 200 ఎకరాల స్థలం ఇప్పించాలని చైర్మన్ బాలమల్లుకు వినతి పత్రం సమర్పించినట్లు వస్త్ర పరిశ్రమ యజమానులు తెలిపారు. సూరత్‌కు వలసెళ్లిన 500 మంది సభ్యులతో వీరభద్రస్వామి టెక్స్‌టైల్స్ మ్యానుఫ్యాక్టర్స్ అండ్ వీవర్స్ వేల్ఫేర్ సొసైటీని ఏర్పాటు చేసుకున్నామని మాడిఫైడ్ కాంప్రెన్సివ్ పవర్‌లూమ్ క్లస్టర్ డెవలప్‌మెంట్ స్కీమ్ (ఎంసీపీసీడీఎస్) కింద టెక్స్‌టైల్స్ క్లస్టర్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి అనుమతులు, స్పెషల్ ప్యాకేజీ మంజూరయ్యేలా చూడాలని ప్రాజెక్టు రిపోర్టును టీఎస్ ఐఐసీ చైర్మన్ బాలమల్లు కు అందజేశారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించి క్లస్టర్ ఏర్పాటుకు అవకాశాలను పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని టీఎస్ ఐఐసీ జీఎం విఠల్‌ను ఆదేశించారు. రాష్ట్రంలో వస్త్ర పరిశ్రమల యూనిట్లను నెలకొల్పాడానికి ముందుకొచ్చే చిన్నతరహా వస్త్ర పరిశ్రమల యజమానులకు స్థలాలతో పాటు పారిశ్రామిక సబ్సిడీలు, ప్రోత్సాహకాలను ప్రభుత్వం నుంచి అందేలా చూస్తామని బాలమల్లు హామీ ఇచ్చారు. వలసెళ్లిన వారు తిరిగి వచ్చేలా సూరత్ వస్త్ర పరిశ్రమ యజమానుల సంఘం, సొసైటీల నాయకులు చొరవ తీసుకోవాలని బాలమల్లు కోరారు.



ఫైనల్ వార్

భారత్ -బంగ్లా టి20 ట్రై సిరీస్ ఫైనల్ నేడు

సంచలన విజయాలతో దుమ్మురేపుతూ అంతిమయుద్ధానికి సిద్ధమైన బంగ్లాదేశ్ ఓ వైపు.. వరుస విజయాలతో కూదగట్టుకున్న ఆత్మవిశ్వాసంతో భారత జట్టు మరోవైపు.... నిదహాస్ కప్ 2018 టి20 సిరీస్ ఆఖరి పోరులో గెలుపెవరిది.. కప్ ఎవరికి దక్కుతుంది?



కొలంబో: నిదహాస్ కప్ టి20 ట్రై సిరీస్ ఫైనల్లో నేడు భారత జట్టు బంగ్లాదేశ్‌తో పోటీపడుతుంది. కొత్త కుర్రాళ్లతో బరిలోకి దిగిన భారత జట్టు హ్యాట్రిక్ విజయాలు సాధించి ఫైనల్లో అడుగుపెట్టగా.. ఒక్కో మ్యాచ్‌లో ఒక్కో సంచలనతో ఆతిథ్య జట్టు శ్రీలంకను చిత్తు చేసిన బంగ్లా జట్టు భారత్‌తో తుది పోరుకు సిద్ధమైంది. శుక్రవారం జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో శ్రీలంకపై నాటకీయంగా గెలిచిన బంగ్లా జట్టు ఈ మ్యాచ్‌లోనూ అంలాంటి సంచలనమే సాధించేందుకు సిద్దంమంటూ భారత్‌ను హెచ్చరిస్తోంది. శ్రీలంకతో జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో బంగ్లా ఆటగాళ్ల తీరు పాకిస్తాన్ జట్టును గుర్తు చేసింది. లంక బౌలర్లపై సిక్సర్‌తో విరుచుకుపడ్డ మహ్మదుల్లా గెలుపుకోసం పోరాడిన తీరు ఆ జట్టులో ఉత్సాహాన్ని రెట్టింపు చేసింది. గతంలో బంగ్లాదేశ్‌తో ఇంటర్నేషనల్ క్రికెట్‌లో ఓటముల తర్వాత అనుభవాలను గుర్తు చేసుకుంటూ భారత్ ఈ ఫైనల్ వార్‌కు రెడీ సిద్ధమైంది.

బ్యాటింగ్ పరంగా చూస్తే బంగ్లా జట్టుకంటే భారత్ బలంగా కనిపిస్తోంది. రోహిత్ శర్మ ఫామ్‌లోకి రావటం, ఓపెనర్ ధావన్ దూకుడు కొనసాగిస్తుండటం భారత్‌కు తిరుగులేని ఆయుధంగా కనిపిస్తోంది. ఈ టోర్నీలో 200 పైగా పరుగులు సాధించిన ధావన్ మరో సారి తన బ్యాట్‌కు పని చెప్పేందుకు రెడీ అవుతున్నాడు. ధావన్‌కు తోడుగా రైనా, కార్తీక్, మనీష్ పాండేలు రాణిస్తే భారత్ బంగ్లా ముందు భారీ లక్ష్యాన్ని ఉంచటం ఖాయం. ఇక బౌలింగ్ విభాగంలో రెండో స్పెషలిస్ట్ బౌలర్ అనుకున్న ంతగా రాణించలేక పోతుండటం భారత్‌ను కలవరపెడుతోంది. చివరి లీగ్ మ్యాచ్‌లో హైదరాబాద్ ఆటగాడు సిరాజ్‌కు అవకాశ మిచ్చినా ఆకట్టుకో లేకపోయాడు. సిరాజ్‌తో పాటు ఉనద్కత్ కూడా వికెట్లు పడగొట్టలేక, పరుగులు నియంత్రించలేక పోతుండటంతో విజయ్ శంకర్‌పైనే రోహిత్‌సేన భారం మోపనుంది.

ఇక ఆల్‌రౌండర్ షకిబ్ అల్ హసన్ రాకతో కొండంత బలం పుంజుకున్న బంగ్లాదేశ్ బ్యాటింగ్‌పైనే ఆశలుపెట్టుకుంది. ఎలాంటి పరిస్థితుల్లో అయినా డేంజరస్ ఇన్నింగ్స్ ఆడగలిగే సామర్థ్యం గల ఆటగాళ్లు ఆ జట్టులో ఉన్నారు. తమ జట్టుకు ఆదే బలమని ఈ మ్యాచ్‌లోనూ తమ సత్తా చూపెడతామని హెచ్చరిస్తోంది.

భారత్‌ను తక్కువ అంచనావ వేయం : షకిబుల్

లీగ్ మ్యాచ్‌ల్లో తమ జట్టు సంచలన విజయాలు సాధించి నప్పటికీ భారత్‌ను తేలిగ్గా తీసుకోమని బంగ్లాదేశ్ కెప్టెన్ షకిబుల్ హసన్ చెబుతున్నాడు. భారత్ రికార్డులు బలంగా ఉన్నాయని, అన్ని విభాగంలో బంగ్లా కంటే భారత్ బలంగా ఉందని తెలిపాడు. అయితే ఎలాంటి పరిస్థితులను అయినా ఎదుర్కొనే వ్యూహం తమ వద్దన ఉందని ధీమా వ్యక్తం చేస్తున్నాడు. ఎలాంటి స్కోరయినా సాధించగలిగే సత్తా ఉందని, బౌలింగ్ బలహీనతలను సరిదిద్దుకుంటే భారత్‌ను ఓడించటం కష్టమేమీ కాదని షకిబుల్ తెలిపాడు. మొత్తంగా ఈ మ్యాచ్ ఆసక్తికరంగా సాగటం ఖాయమని చెప్పాడు.

షకిబుల్, నూరుల్ మ్యాచ్ ఫీజులో కోత

నిదహాస్ ట్రై సిరీస్ చివరి లీగ్ మ్యాచ్‌లో బంగ్లాదేశ్ ఆటగాళ్లు చేసిన రచ్చపై ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ (ఐసిసి) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. బంగ్లా కెప్టెన్ షకిబుల్ హసన్, రిజర్వ్ ప్లేయర్ నూరుల్ హసన్‌లపై జరిమానా విధించింది. ఈ ఇద్దరి మ్యాచ్ ఫీజులో 25 శాతం కోత పెట్టిన ఐసిసి చెరో డీమెరిట్ పాయింట్ ఇచ్చింది. ఈ ఘటనను సీరియస్‌గా పరిగణించిన మ్యాచ్ రిఫరీ క్రిస్ బోర్డ్ ఐసిసి ప్రవర్తనా నియమావళి ప్రకారం షకీబ్, నూరుల్‌లు క్రీడా స్ఫూర్తిని దెబ్బతీసే విధంగా ప్రవర్తించారని నివేదిక ఇచ్చారు. ఈ వివాదంపై విచారం వ్యక్తం చేసిన క్రిస్‌బోర్డ్ ఆటలో ఇలాంటి ఉద్వేగాలు సహజమే అయినప్పటికీ ఆటగాళ్లు ఇలా ప్రవర్తించి ఉండకూడదని అభిప్రాయపడ్డాడు.

సాయంత్రం 7 గంటల నుంచి డి. స్పోర్ట్స్, డి.డి. స్పోర్ట్స్ చానెళ్లలో ప్రత్యక్ష ప్రసారం.



సెమీస్‌లో సింధు ఓటమి

బర్మింగ్‌హామ్ : ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత స్టార్ సింధు సెమీస్‌లో పరాజయం పాలైంది. ఈ టోర్నీలో సంచలన విజయాలు సాధిస్తోన్న సింధుకు సెమీఫైనల్లో జపాన్‌కు చెందిన ఆరో సీడ్ యమగుచి షాక్ ఇచ్చింది. హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో యమగుచి 19-21, 21-19, 21-18 స్కోరుతో సింధును ఓడించి ఫైనల్లో అడుగుపెట్టింది. తొలి గేమ్‌లో విజయం సాధించిన సింధుకు యమగుచి ఆ తర్వాత గట్టిపోటీ ఎదురైంది. క్వార్టర్ ఫైనల్లో స్పెయిన్ ప్లేయర్ కరోలినా మారిన్‌ను ఓడించి జోష్ మీద ఉన్న యమగుచి సెమీస్‌లోనూ అదే ఉత్సాహంతో ఆడి సింధును ఓడించింది.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam publications private limited, Printed at JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, Survey No:127, Plot No:12, Mallapur Village, Nacharam, Medchal District.Telangana state and Published From H.No:6-3-864/4/B, SBN Arcade,4th&5th Floor, Green lands, Opp: Green Park Hotel, Hyderabad - 500016 Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952. Phone No.040-46519999. E-mail Id: editor@manamnews.com.